www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 2-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 197 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి రా. 8.21 తదుపరి విదియ; నక్షత్రం: విశాఖ తె. 5.58 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ. 9.41-11.27; దుర్ముహూర్తం: ఉ. 6.17-7.48; అమృతఘడియలు: రా. 8.16-10.01; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.17; సూర్యాస్తమయం: 5.39 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

క్లాసెన్‌కు జాక్‌పాట్



రూ.23 కోట్లతో అట్టిపెట్టుకున్న సన్‌రైజర్స్
విరాట్, పూరన్‌కు రూ.21 కోట్లు
అన్‌క్యాప్‌డ్‌గా ఎంఎస్ ధోనీ
వేలంలోకి పంత్, శ్రేయాస్, రాహుల్
ఆటగాళ్ల రిటెన్షన్ జాబితా వెల్లడి

ముంబై: ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న ఐపీఎల్ రిటెన్షన్ జాబితా వచ్చేసింది. రాబోయే 17వ సీజన్ కోసం డిసెంబరులో మెగా వేలం జరుగబోతోంది. అంతకన్నా ముందే లీగ్‌లోని పది ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకునే ఆటగాళ్ల పేర్లను ప్రకటించాల్సి ఉంది. అక్టోబరు 31తో గడువు ముగియడం తో అదే రోజు అన్ని జట్లు గరిష్ఠంగా ఆరుగురితో కూడిన తమ ఆటగాళ్ల జాబితాను ప్రకటించేశాయి. దీంతో ఎవరు వేలంలోకి వెళ్లబోతున్నారనేది స్పష్టమైంది. ఇందులో పలు ఫ్రాంచైజీలు ఆరుగురికన్నా తక్కువ మందితోనే సరిపెట్టుకున్నాయి. తద్వారా ఈ జట్లకు భారీ మొత్తంతో వేలంలోకి వెళ్లే వెసులుబాటు లభించింది. ఇక ఈసారి సీఎస్‌కే తరఫున ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? అనే ఊహాగానాలకు కూడా తెరపడింది. అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా ధోనీని చెన్నై జట్టు రిటైన్ చేసుకుంది. భారత్ తరఫున ఆడక ఐదేళ్లు అయిన రిటైర్డ్ ఆటగాళ్లను అన్‌క్యాప్‌డ్‌గా పరిగణిస్తారు. అలాగే రోహిత్‌ను వేలంలోకి వదిలేస్తారని భావించినా.. ముంబై అతడిపై నమ్మకముంచింది. ఓవరాల్‌గా పంజాబ్ కేవలం ఇద్దరిని మాత్రమే రిటైన్ చేసుకోవడంతో అత్యధికంగా రూ.110.5 కోట్లతో, రాజస్థాన్ ఆరుగురిని ఎంపిక చేసుకోవడంతో అత్యల్పంగా రూ.41 కోట్లతో వేలానికి సిద్ధం కానున్నాయి.

అమ్మో.. అంత ధరా?

దక్షిణాఫ్రికా ఆటగాడు క్లాసెన్‌పై కనకవర్షం కురిసింది. గత సీజన్‌లో విధ్వంసకర ఆటతీరును ప్రదర్శించిన క్లాసెన్‌పై సన్‌రైజర్స్ ఏకంగా రూ.23 కోట్లు వెచ్చించింది. ఇది ఓవరాల్‌గా ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక ధర. గత వేలంలో ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను కేకేఆర్ రూ.24.75 కోట్లకు దక్కించుకున్న విషయం తెలిసిందే. అలాగే ఇతర విదేశీ ఆటగాళ్లయిన నికోలస్ పూరన్ (రూ.21 కోట్లు)పై లఖ్‌నవూ, కోహ్లీ (రూ. 21 కోట్లు) పై బెంగళూరు, ప్యాట్ కమిన్స్ (రూ.18 కోట్లు)పై సన్‌రైజర్స్ భారీ మొత్తాలను వెచ్చించి రిటైన్ చేసుకున్నాయి.

ఆ ముగ్గురిపై అందరి దృష్టి


పంత్

మెగా వేలానికి ముందు మూడు ఫ్రాంచైజీలు తమ కెప్టెన్లను వేలంలోకి వదిలేస్తూ అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇందులో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌తో పాటు ఢిల్లీ కెప్టెన్ రిషబ్ పంత్, లఖ్‌నవూ సారథి కేఎల్ రాహుల్ ఉన్నాడు. రాహుల్‌కు ఆ జట్టు యజమానితో విభేదాలు ఉండడంతో వేలంలోకి వస్తాడని భావించినా.. కేకేఆర్ శ్రేయా‌స్‌ను, డీసీ పంత్‌ను వదులుకోవడం ఊహించనిదే. అయితే వేలంలో వీరిపై ఆయా జట్లు భారీ మొత్తాలను వెచ్చించే అవకాశం లేకపోలేదు. అలాగే డెత్ ఓవర్లలో వికెట్లను తీసే పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను సైతం పంజాబ్ కింగ్స్ రిటైన్ చేసుకునేందుకు ఇష్టపడలేదు. అలాగే వెంకటేశ్ అయ్యర్, ఇషాన్ కిషన్, పేసర్లు దీపక్ చాహర్, సిరాజ్ సైతం వేలంలోకి రానున్నారు. విదేశీ ఆటగాళ్లలో ఆర్‌సీబీ కెప్టెన్ డుప్లెసీ, మిచెల్ స్టార్క్, జోస్ బట్లర్, మొయిన్ అలీ, శాంట్నర్, గ్రీన్, జాక్స్, మ్యాక్స్‌వెల్, కాన్వే, రచిన్‌లను ఆయా జట్లు వదిలేయడంతో వీరు కూడా అధిక ధర పలికే చాన్స్ ఉంది.



తొలి భారత ఆటగాడిగా విరాట్..

పేరుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ అయినా ధర విషయంలో ఇప్పటి వరకు విదేశీ ఆటగాళ్లదే హవా. అన్ని జట్లు వారిపైనే ఎక్కువ మొత్తం వెచ్చించేందుకు సిద్ధపడుతుంటాయి. ఈనేపథ్యంలో తొలిసారిగా ఓ భారత ఆటగాడు రూ.20 కోట్లకు పైన ధర పలకడం విశేషం. విరాట్ కోహ్లీని ఆర్‌సీబీ జట్టు రూ.21 కోట్లకు రిటైన్ చేసుకుంది. దీంతో ఐపీఎల్‌లో రూ.20+ కోట్లు పలికిన మొదటి భారత ఆటగాడిగా నిలిచాడు. అంతకుముందు స్టార్క్, కమిన్స్ ఈ క్లబ్‌లో ఉన్నారు.

ఆర్‌టీఎం అంటే..

2018లో చివరిసారి రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ఆప్షన్‌ను ఉపయోగించగా, తిరిగి ఈసారి ప్రవేశపెట్టారు. మెగా వేలంలోకి వదిలేసిన తమ ఆటగాళ్లను తిరిగి అదే జట్టు తీసుకోవాలనుకుంటే ఈ ఆర్‌టీఎంను ఉపయోగించాల్సి ఉంటుంది. గతంలో అయితే ప్రత్యర్థి ఫ్రాంచైజీ ఎంత బిడ్ వేసిందో అంతే మొత్తం చెల్లించి తమకు కావాల్సిన ప్లేయర్‌ను ఆయా జట్లు తీసుకునే అవకాశం ఉండేది. కానీ ఈసారి బీసీసీఐ ఆ నిబంధనను మార్చింది. దీనిప్రకారం ముందుగా బిడ్ వేసిన టీమ్‌కు మరోసారి పోటీలో ఉండే చాన్స్ లభిస్తుంది. అంటే ఆ జట్టు తిరిగి వేలం కొనసాగించవచ్చు. అప్పుడు ఆ పెరిగిన ధర చెల్లిస్తేనే ఆర్‌టీఎం ద్వారా పాత జట్లు తమకు కావాల్సిన ప్లేయర్లను సొంతం చేసుకుంటాయి. ఇక రిటెన్షన్ ప్రక్రియలో అట్టిపెట్టుకునే ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడమా? లేక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ద్వారా తిరిగి తీసుకోవడమా? అనేది పూర్తిగా ఫ్రాంచైజీల నిర్ణయానికే వదిలేశారు.

ధర ఎందుకు పెరిగిందంటే..

ఐపీఎల్ రిటెన్షన్ రూల్ ప్రకారం రిటైన్ చేసుకునే ఆటగాడి అత్యధిక ధర రూ.18 కోట్లు. ఆ తర్వాత మిగిలిన వారికి వరుసగా రూ.14 కోట్లు, రూ.11 కోట్లు, రూ.18 కోట్లు, రూ.14 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. మరోవైపు ఇది బీసీసీఐ నిర్దేశించిన కనీస పరిమితి మాత్రమే. ఫ్రాంచైజీలు తమకు కావాల్సిన ఆటగాడికి ఎంత మొత్తమైనా చెల్లించి రిటైన్ చేసుకునే సౌలభ్యం ఉంది. దీని ప్రకారమే క్లాసెన్‌కు రైజర్స్ జట్టు రూ.23 కోట్లు, ఆర్‌సీబీ విరాట్‌కు రూ.21 కోట్లు, లఖ్‌నవూ పూరన్‌కు రూ.21 కోట్లు ఇచ్చాయి.

రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల జాబితా



చెన్నై సూపర్ కింగ్స్	
రుతురాజ్	రూ.18 కోట్లు
పతిరణ	రూ.13 కోట్లు
దూబే	రూ.12 కోట్లు
జడేజా	రూ.18 కోట్లు
ధోనీ	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.65 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.55 కోట్లు**

ముంబై ఇండియన్స్	
బుమ్రా	రూ.18 కోట్లు
సూర్యకుమార్	రూ.16.35 కోట్లు
హార్దిక్	రూ.16.35 కోట్లు
రోహిత్	రూ.16.30 కోట్లు
తిలక్‌వర్మ	రూ.8 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.75 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.45 కోట్లు**

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	
విరాట్ కోహ్లీ	రూ.21 కోట్లు
రజత్ పటీదార్	రూ.11 కోట్లు
యష్ దయాల్	రూ.5 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.37 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.83 కోట్లు**

కోల్‌కతా నైట్‌రైడర్స్	
రింకూ సింగ్	రూ.13 కోట్లు
వరుణ్ చక్రవర్తి	రూ.12 కోట్లు
నరైన్	రూ.12 కోట్లు
రస్సెల్	రూ.12 కోట్లు
హర్షిత్ రాణా	రూ.4 కోట్లు
రమణ్‌దీప్	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.69 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.51 కోట్లు**

ఢిల్లీ క్యాపిటల్స్	
అక్షర్ పటేల్	రూ.16.50 కోట్లు
కుల్దీప్ యాదవ్	రూ.13.25 కోట్లు
స్టబ్స్	రూ.10 కోట్లు
అభిషేక్ పోరెల్	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.47 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.73 కోట్లు**

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్	
నికోలస్ పూరన్	రూ.21 కోట్లు
రవి బిష్ణోయ్	రూ.11 కోట్లు
మయాంక్ యాదవ్	రూ.11 కోట్లు
మొహిసిన్ ఖాన్	రూ.4 కోట్లు
ఆయుష్ బదోని	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.51 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.69 కోట్లు**

పంజాబ్ కింగ్స్	
శశాంక్ సింగ్	రూ.5.5 కోట్లు
ప్రభ్‌సిమ్రన్	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.9.5 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.110.5 కోట్లు**

సన్‌రైజర్స్ హైదరాబాద్	
క్లాసెన్	రూ.23 కోట్లు
కమిన్స్	రూ.18 కోట్లు
అభిషేక్	రూ.14 కోట్లు
హెడ్	రూ. 14 కోట్లు
నితీశ్ కుమార్	రూ.6 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.75 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.45 కోట్లు**

రాజస్థాన్ రాయల్స్	
శాంసన్	రూ.18 కోట్లు
జైస్వాల్	రూ.18 కోట్లు
పరాగ్	రూ.14 కోట్లు
జురెల్	రూ.14 కోట్లు
హెట్‌మయెర్	రూ.11 కోట్లు
సందీప్ శర్మ	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.79 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.41 కోట్లు**

గుజరాత్ టైటాన్స్	
రషీద్ ఖాన్	రూ.18 కోట్లు
శుభ్‌మన్ గిల్	రూ.16.50 కోట్లు
సాయి సుదర్శన్	రూ.8.50 కోట్లు
తెవాటియా	రూ.4 కోట్లు
షారుక్ ఖాన్	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	**రూ.51 కోట్లు**
మిగిలిన మొత్తం:	**రూ.69 కోట్లు**

అదే తీరు.. బ్యాటింగ్ మారలేదు!


కోహ్లీ (4) రనౌట్

భారత్ తొలి ఇన్నింగ్స్ 86/4 ● న్యూజిలాండ్ 235 ఆలౌట్

భారత జట్టు బ్యాటింగ్ డొల్లతనం మరోసారి బయటపడింది..ఎప్పటిలానే బౌలర్లు న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు..ఆపై బ్యాటర్లు సత్తా చాటి బౌలర్ల కష్టానికి ఫలితం రాబట్టాల్సి ఉంది..కానీ మనోళ్ల తీరు మారలేదు ! రెండు టెస్టులు పూర్తయినా స్టార్ బ్యాటర్ల బ్యాటింగ్ గాడిలో పడలేదు..దీంతో బౌలర్ల శ్రమ వృథా అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి..స్పిన్నర్లు జడేజా, సుందర్ అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థిని 250 రన్స్‌కులోపే కట్టడి చేయడంతో భారత్‌దే పైచేయి అయింది..అయితే కెప్టెన్ రోహిత్ దారుణ వైఫల్యాన్ని కొనసాగించగా, కోహ్లీ అనూహ్యంగా రనౌట్ కావడంతో మూడో టెస్ట్ మొదటి రోజే టీమిండియా ఇక్కట్లలో పడింది..ఇక తదుపరి బ్యాటర్లలో ఒకరిద్దరైనా పట్టుదలతో ఆడి క్రీజులో నిలవకపోతే ఈ మ్యాచ్ కూడా చేజారడం ఖాయం..


జడేజా (5/65)

జడేజాకు 5, సుందర్‌కు 4 వికెట్లు

12 స్వదేశంలో ఐదు వికెట్లు తీయడం జడేజాకిది 12వసారి. ఓవరాల్‌గా 14వసారి.

ముంబై: న్యూజిలాండ్‌తో కీలకమైన మూడో టెస్ట్‌లోనూ భారత జట్టు..ముఖ్యంగా బ్యాటర్ల తీరు ఏమాత్రం మెరుగుపడలేదు. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఆట నానాటికీ తీసికట్టు అన్న చందమైంది. ఫలితంగా వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో ఉండాలంటే గెలిచి తీరాల్సిన ముంబై మ్యాచ్‌లో టీమిండియా పరిస్థితులు తలకిందులయ్యేలా ఉన్నాయి. శుక్రవారం మొదలైన ఆఖరి టెస్ట్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్..జడేజా (5/65), సుందర్ (4/81) ధాటికి మొదటి ఇన్నింగ్స్‌లో 235 పరుగులకే ఆలౌటైంది. మిచెల్ (82), యంగ్ (71) అర్ధ శతకాలతో ఆదుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ చేపట్టిన భారత్ ఆట ఆఖరికి 86 పరుగులకే నాలుగు వికెట్లు చేజార్చుకుంది. గిల్ (31 బ్యాటింగ్), జైస్వాల్ (30) రాణించారు. రోహిత్ (18), కోహ్లీ (4) తీవ్రంగా నిరాశ పరిచారు.

జైస్వాల్, గిల్ భాగస్వామ్యం: ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన భారత్ ఆనందం.. మొదటి రోజు ఆట చివర్లో ఆవిరైంది. అంతకుముందు..సొంత గడ్డ ముంబైలో కేవలం రెండో టెస్టే ఆడుతున్న రోహిత్ ధాటి షాట్లతో అలరించాడు. ఈక్రమంలో లభించిన లైఫ్‌ను అతడు సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఓ భారీ షాట్ సంధించే క్రమంలో రోహిత్ వికెట్ పారేసుకున్నాడు. 25/1తో ఉన్న దశలో జైస్వాల్‌కు గిల్ తోడయ్యాడు. పుణె టెస్ట్ మాదిరే వీరు జట్టు ఇన్నింగ్స్ చక్కదిద్దారు. సాధికార షాట్లతో ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. రెండో వికెట్‌కు 53 పరుగులతో జోడించారు.

10 నిమిషాల్లో తారుమారు: యశస్వీ, శుభమన్ భాగస్వామ్యం బలపడుతూ తొలిరోజును ప్రశంసనీయంగా ముగిస్తారని భావిస్తున్న దశలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరో 10 నిమిషాల్లో ఆటకు తెరపడనుండగా..భారత ఇన్నింగ్స్ తీవ్ర కుదుపులకు లోనైంది. స్పిన్నర్ ఎజాజ్ లెగ్ స్టంప్ ఆవలిగా వేసిన బంతిని రివర్స్ స్వీప్ చేయబోయిన జైస్వాల్ బౌల్డయ్యాడు. తన టెస్ట్ కెరీర్‌లో గత 14 ఇన్నింగ్స్‌లలో కళ్లు చెదిరే రివర్స్ స్వీప్ షాట్‌లు ఆడిన జైస్వాల్ మొదటిసారి ఇలా అవుట్ కావడం గమనార్హం. తదుపరి మరో అద్భుతమైన బంతికి నైట్‌వాచ్‌మన్ సిరాజ్‌ను ఎల్బీ చేసిన ఎజాజ్ గట్టి దెబ్బ కొట్టాడు. సిరాజ్ రివ్యూకి వెళ్లినా ఫలితం దక్కలేదు. ఇక..లేని పరుగుకోసం వెళ్లి కోహ్లీ రనౌట్ కావడంతో..ఎనిమిది బంతులలో టీమిండియా ఇన్నింగ్స్ మారిపోగా..కివీస్ మ్యాచ్‌పై పట్టు బిగించింది.

జడేజా 'ఐదు'

వాంఖడే స్పిన్ పిచ్‌పై టాస్ గెలిచిన లాథమ్.. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఆకాశ్‌దీప్, సుందర్ ధాటికి 72/3తో నిలిచిన పర్యాటక జట్టును మిచెల్, యంగ్ నాలుగో వికెట్‌కు 87 పరుగులు జత చేసి గాడిలో పెట్టారు. కానీ జడేజా విజృంభణకు కివీస్ 159/3 నుంచి 235కు ఆలౌటైంది.

బాబోయ్ ఎండ



మ్యాచ్‌కు తొలిరోజైన శుక్రవారం 37 డిగ్రీల ఎండతో సూర్యుడు఼ దారెత్తించాడు. దానికితోడు తీవ్ర ఉక్కపోత. ఫలితంగా ఆటగాళ్లు అల్లాడిపోయారు. బ్యాటర్లు ప్రతి రెండు ఓవర్లకోసారి డ్రింక్స్ తీసుకోవాల్సి వచ్చింది. అలాగే విరామం మధ్యలో ఐస్ టవల్స్, ఐస్ ప్యాక్‌ను మెడ చుట్టూ ఉంచుకుంటూ ఎండనుంచి కాపాడుకొనేందుకు తంటాలు పడ్డారు.

5 టెస్ట్‌ల్లో అత్యధిక (314) వికెట్లు పడగొట్టిన ఐదో భారత బౌలర్ జడేజా. ఈక్రమంలో జహీర్‌ఖాన్, ఇషాంత్ (311)లను దాటేశాడు.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : లాథమ్ (బి) సుందర్ 28, కాన్వే (ఎల్బీ) ఆకాశ్‌దీప్ 4, యంగ్ (సి) రోహిత్ (బి) జడేజా 71, రచిన్ (బి) సుందర్ 5, మిచెల్ (సి) రోహిత్ (బి) సుందర్ 82, బ్లండెల్ (బి) జడేజా 0, ఫిలిప్స్ (బి) జడేజా 17, సోథీ (ఎల్బీ) జడేజా 7, హెన్రీ (బి) జడేజా 0, ఎజాజ్ (ఎల్బీ) సుందర్ 7, ఓ రోర్క్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు 13 : మొత్తం 65.4 ఓవర్లలో 235 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-15, 2-59, 3-72, 4-159, 5-159, 6-187, 7-210, 8-210, 9-228 ; **బౌలింగ్ :** సిరాజ్ 6-0-16-0, ఆకాశ్‌దీప్ 5-0-22-1, అశ్విన్ 14-0-47-0, సుందర్ 18.4-2-81-4, జడేజా 22-1-65-5.

భారత్ తొలి ఇన్నింగ్స్ : జైస్వాల్ (బి) ఎజాజ్ 30, రోహిత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 18, గిల్ (బ్యాటింగ్) 31, సిరాజ్ (ఎల్బీ) ఎజాజ్ 0, కోహ్లీ (రనౌట్/హెన్రీ) 4, పంత్ (బ్యాటింగ్) 1 ; **ఎక్స్‌ట్రాలు : 2 ; మొత్తం : 19 ఓవర్లలో 86/4 ; వికెట్లపతనం :** 1-25, 2-78, 3-78, 4-84 ; **బౌలింగ్:** హెన్రీ 5-1-15-1, ఓ రోర్క్ 2-1-5-0, ఎజాజ్ పటేల్ 7-1-33-2, ఫిలిప్స్ 4-0-25-0, రచిన్ 1-0-80.

విజేత సంజన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఏఐటీఏ) నిర్వహించిన ఏఎన్‌టీ అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సిరిమల్ల సంజన విజేతగా నిలిచింది. శుక్రవారం బెంగళూరులో జరిగిన ఈ పోటీల ఫైనల్లో సంజన 6-4, 6-4తో విదుల అమర్ (కర్ణాటక)పై నెగ్గి, టైటిల్ సొంతం చేసుకుంది. అంతకుముందు ముగిసిన సెమీఫైనల్స్‌లో సంజన 6-4, 2-6, 7-5తో టోర్నీ టాప్ సీడ్ ఆమోదిని నాయక్ (కర్ణాటక)ను ఓడించి, ఫైనల్లో ప్రవేశించింది.

సుదర్శన్, పడిక్కళ్ అర్ధ శతకాలు

భారత్ 'ఎ' 208/2


సుదర్శన్ (96 బ్యాటింగ్)

మాకే (ఆస్ట్రేలియా): సాయి సుదర్శన్ (96 బ్యాటింగ్), పడిక్కళ్ (80 బ్యాటింగ్) అర్ధ శతకాలతో చెలరేగడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్ 'ఎ' పట్టు బిగించింది. సాయి సుదర్శన్, పడిక్కళ్ మూడో వికెట్‌కు అభేద్యంగా 178 పరుగులు జోడించడంతో భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆఖరికి 208/2 స్కోరు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ 99/4 స్కోరుతో రెండో రోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 'ఎ' 195 పరుగులకు ఆలౌటైంది. ముకేశ్ ఆరు వికెట్లు తీయగా, ప్రసిద్ధ్ మూడు వికెట్లు సాధించాడు. కాగా..భారత్ 'ఎ' మొదటి ఇన్నింగ్స్‌లో 107 రన్స్ చేసింది.

రెజ్లర్ మాన్సీకి కాంస్యం



టిరానా: ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత రెజ్లర్ మాన్సీ అహ్లావత్ కాంస్య పతకం కొల్లగొట్టింది. అల్బేనియాలో జరుగుతున్న ఈ పోటీల్లోని మహిళల 59 కిలోల విభాగం కాంస్య పతక పోరులో మాన్సీ 5-0తో లారెన్స్ బ్యూరెగార్డ్ (కెనడా)ను చిత్తు చేసి, విజేతగా నిలిచింది. అంతకుముందు జరిగిన సెమీస్ బౌట్‌లో మాన్సీ 1-4తో సుఖీ సిరెంచిమెడ్ (మంగోలియా) చేతిలో ఓడింది. మనీషా భన్వాలా 65 కి. కేటగిరీ కాంస్య పతక బౌట్‌లో 2-8తో మివా మోరికావా (జపాన్) చేతిలో పరాజయం పాలైంది. ఇతర పోటీల్లో కీర్తి (55 కి.), బిపాషా (72 కి.), సందీప్ (92 కి.), ఉదిత్ (61 కి.), మనీష్ (70 కి.), పర్వీందర్ (79 కి.) పతకం లేకుండా ఇంటిముఖం పట్టారు.

భారత టూర్‌కు సఫారీ సైన్యమిదే!

డర్బన్: భారత్‌తో జరుగబోయే నాలుగు టీ20ల సిరీస్‌కు దక్షిణాఫ్రికా జట్టును ప్రకటించారు. 16 మందితో కూడిన బృందానికి మార్‌క్రమ్ నేతృత్వం వహించనున్నాడు. ఇరు జట్ల మధ్య 8 నుంచి సిరీస్ ఆరంభం కానుంది. **జట్టు:** మార్‌క్రమ్ (కెప్టెన్), హెండ్రిక్స్, స్టబ్స్, మిల్లర్, బార్ట్‌మన్, కొట్జీ, ఫెరీరా, జాన్సెన్, క్లాసెన్, క్రుగర్, కేశవ్, మిహ్లాలి, పీటర్, రికెల్టన్, సిమెలనె, సిపమ్లా.

ఫాస్ట్ ఫుడ్స్‌తో పిల్లలకు ప్రమాదం

పదేళ్ల వయసులోనే ఫ్యాటీ లివర్ సమస్య.. 5 నుంచి 35 శాతానికి గ్యాస్ట్రిక్ కేసులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పల్లెల్లోనూ మారిన ఆహారపుటలవాట్లు.. ఇష్టారాజ్యంగా యాంటాసిడ్స్ వాడొద్దు
మితిమీరిన మద్యపానంతో కాలేయం.. భారీగా పెరిగిన కేసులు
'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి



హైదరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, పిజ్జా, బర్గర్ వంటి ఫాస్ట్‌ఫుడ్స్, అల్ట్రా ప్రాసెస్డ్, జంక్ ఫుడ్స్‌తో పిల్లల ఆరోగ్యానికి పెనుప్రమాదం ఉందని.. ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బడిఈడు పిల్లల్లోనూ ఫ్యాటీ లివర్, గ్యాస్ట్రిక్ సమస్యలు నమోదవుతున్నాయని.. పదేళ్ల క్రితం జనాభాలో ఐదు శాతం మేర ఉన్న ఫ్యాటీ లివర్ కేసుల సంఖ్య 35 శాతానికి పెరిగిందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి'కి డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

ఫాస్ట్, జంక్ ఫుడ్స్‌తో ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుంది?

ప్రస్తుతం అంతా వయసుతో సంబంధం లేకుండా ఫాస్ట్‌ఫుడ్, జంక్ ఫుడ్‌ను ఎక్కువగా తీసుకుంటున్నారు. వాటిలో ఉండే అధిక కెలోరీల వల్ల కొవ్వు పెరిగి అనారోగ్యానికి దారితీస్తుంది. అంతేకాదు.. వాటిని నిల్వ చేయడానికి వాడే ప్రిజర్వేటివ్స్, అడిటివ్స్, కృత్రిమ రంగుల వల్ల క్రమేపీ మన కడుపులో మంచి బ్యాక్టీరియా పోయి చెడు బ్యాక్టీరియా ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఈ చెడ్డ బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే కొన్ని హానికర ఉత్పత్తులు శరీరమంతా వ్యాపించి గుండె, మెదడు సంబంధిత సమస్యలు కూడా వస్తాయి. కాలేయంపై ప్రభావం పడి ఫ్యాటీ లివర్ సమస్య వస్తుంది. ఇటీవలికాలంలో పాఠశాల విద్యార్థుల్లో కూడా ఫ్యాటీ లివర్ సమస్య ఎక్కువగా కనపడడానికి కారణం ఇదే. చాలామంది పిల్లలు.. బర్గర్లు, పిజ్జాలు, చిప్స్ ఎక్కువగా తినేస్తున్నారు. దీంతో పదేళ్ల పిల్లల్లోనూ ఫ్యాటీ లివర్ కేసులు వస్తున్నాయి. వారు గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్నారు. మన దగ్గర మద్యం సంబంధిత కాలేయ వ్యాధుల సంఖ్య గత పదేళ్లలో బాగా పెరిగింది. ఆస్పత్రుల్లో 50% కాలేయ సమస్యల కేసులు ఆల్కహాల్ సంబంధించినవే ఉంటున్నాయి.

పల్లెల్లోనూ జంక్‌ఫుడ్ సంస్కృతి పెరిగింది కదా.. మా ఆస్పత్రి ఆధ్వర్యంలో పల్లెల్లో కూడా సర్వేలు చేశాం. పల్లె ప్రజల్లో ఎక్కువగా అల్సర్స్, ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్), అజీర్తి వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. అక్కడ కూడా ప్రజలు సహజంగా లభించే ఆహారాన్ని సరిగ్గా తీసుకోవడం లేదు. కూరగాయలు, అన్నం మానేసి ఈ ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తింటున్నారు. దీనికితోడు.. పల్లెల్లో కలుషిత నీటి సమస్య ఎక్కువగా ఉంటుంది. అది కూడా గ్యాస్ట్రిక్ సమస్యలకు దారితీస్తోంది. అలాగే శారీరక శ్రమ లేకపోయినా గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి.

ఫాస్ట్ ఫుడ్స్, స్వీట్స్ తయారీలో వాడే పదార్థాల్లో ఏవి అనారోగ్యకరం?

ఫాస్ట్‌ఫుడ్స్, జంక్ ఫుడ్ తయారీలో రకరకాల పదార్థాలు వాడుతున్నారు. మిఠాయిల తయారీలో కృత్రిమ రంగులు వేస్తున్నారు. చక్కెరకు బదులు కృత్రిమ తీపిపదార్థాలు వేసి.. అవి ఆరోగ్యానికి మంచివని చెబుతున్నారు. కానీ అది తప్పు. వాటి వల్ల కూడా దుష్ప్రభావాలు కలుగుతాయి. ఇక నూనెల విషయానికి వస్తే.. అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ మంచివి. ఆలివ్ ఆయిల్ వంటివాటిలో ఉంటాయి. శాచురేటెడ్ ఫ్యాట్స్ అంత మంచివి కావు (కొబ్బరినూనె). ట్రాన్స్‌ఫ్యాట్స్ అస్సలు మంచివి కావు (వనస్పతి లాంటివి). కానీ మన బేకరీల్లో ఎక్కువగా ట్రాన్స్‌ఫ్యాట్స్‌నే వాడుతున్నారు. కాబట్టి బేకరీ ఉత్పత్తుల అధిక వినియోగం వల్ల కూడా మన ఆరోగ్యానికి చాలా హాని కలుగుతుంది. అలాగే.. కొన్ని టూత్‌పేస్టుల్లో దుష్ప్రభావాలను కలిగించే టైటానియమ్ ఆక్సైడ్ ఉంటుంది.

గ్యాస్ట్రిక్ సమస్యలు రాకుండా ఉండాలంటే...

ప్రజలు తమ ఆహారపుటలవాట్లలో మార్పులు చేసుకోవాలి. నిత్యం వ్యాయమం చేయాలి. కంటి నిండా నిద్రపోవాలి. ఇలాంటి మార్పులతో జీవనశైలి జబ్బులను అదుపులో పెట్టుకోవచ్చు. మద్యపానానికి దూరం గా ఉండాలి. అన్నింటికంటే పెద్ద చెడ్డ అలవాటు.. పొగతాగడం. ఇక ఆహారం విషయానికి వస్తే.. మన దక్షిణాది ఆహారం చాలా మంచిది. ఈ ఆహారాన్ని రోజూ తీసుకోవాలి. దాంతోపాటు చిరుధాన్యాలనూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ 50 సంవత్సరాలు నిండిన తర్వాత కొన్ని ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.

గ్యాస్ట్రిక్ సహగ్యాస్ట్రిక్ సమస్యను ముందుగా గుర్తించి, నివారించదగిన ఔషధాలు అందుబాటులో ఉన్నాయా?

చాలా ఔషధాలు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు ఎసిడిటీ సమస్యకు పీపీఐ వాడేవాళ్లం. ఇప్పుడు కొత్తగా పీక్యాప్ వచ్చింది. దీనివల్ల దుష్ప్రభావాలు చాలావరకూ తగ్గిపోయాయి.

ప్రభుత్వం ఏం చేయాలి..?

మనం సహజంగా తినే ఆహారమే మంచిది.. ఫాస్ట్ ఫుడ్స్ మంచివి కావనే విషయంపై ప్రజల్లో అవగాహన పెంచాలి. అలాగే, కొన్ని కఠిన చర్యలు తీసుకోవాలి. స్కూల్స్, కాలేజీల్లో, వాటి సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలి. ఫుడ్స్‌లో ఏం ఉపయోగించాలనే దానిపై కొన్ని నిబంధనలు తీసుకురావాలి.

యాంటాసిడ్స్ వాడకం మంచిదేనా?

ఈ మధ్యనే ఏది పడితే అది తినేసి.. ఎసిడిటీ వస్తోందని ఎక్కువగా యాంటాసిడ్స్ తీసుకుంటున్నారు. ఇది ఏ మాత్రం మంచిది కాదు. యాంటాసిడ్స్ అధిక వినియోగం వల్ల ఆమ్లత్వం తగ్గి శరీరంలో చెడ్డ బ్యాక్టీరియా పెరిగిపోతుంది. అల్సర్స్ ఉన్నవారు, ఇతరత్రా సమస్యలున్నవారు వైద్యులు సిఫారసు చేస్తే మాత్రమే యాంటాసిడ్స్ వాడాలి.

డిసెంబరులో పోలీసు ఫిట్‌నెస్ పరీక్షలు

- కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు ప్రభుత్వం తీపి కబురు
- ఈ నెల 11 నుంచి 21 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 6,100 పోస్టులకు 95 వేల మంది పోటీ

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ వేళ కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఏడాదిన్నరగా ఎదురుచూస్తోన్న ఫిట్‌నెస్ పరీక్షల ప్రక్రియను మొదలు పెడుతున్నట్లు రాష్ట్రస్థాయి పోలీసు నియామక మండలి(ఎస్ఎల్‌పీఆర్‌బీ) ప్రకటించింది. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన 95,208 మందికి డిసెంబరు చివరి వారంలో శారీరక, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 11 నుంచి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్లో పీఎంటీ, పీఈటీ పరీక్షల దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫిజికల్ మెజర్మెంట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టుల్లో పాల్గొనే అభ్యర్థులు ఈ నెల 21 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అనుమానాల నివృత్తికి అభ్యర్థులు 9441450639 లేదా 9100203323 నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

ఒక్క పోస్టూ భర్తీ చేయని జగన్ ప్రభుత్వం

అధికారంలోకి వస్తే 25 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన వైసీపీ.. గత ప్రభుత్వ హయాంలో ఒక్క పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. ప్రతి సంవత్సరం 6,500 చొప్పున నియామకాలు చేపడతామని మూడేళ్లపాటు నాన్చి.. 2022 నవంబరులో నోటిఫికేషన్ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 4.58 లక్షల మంది ఉద్యోగార్థులు దరఖాస్తు చేసుకుని, 2023 జనవరి చివరి వారంలో ప్రిలిమ్స్ రాశారు. ఫిబ్రవరి 5న వెలువడిన ఫలితాల్లో 95,208 మంది అర్హత సాధించినట్లు పీఆర్‌బీ ప్రకటించింది. మార్చి 13 నుంచి 20 వరకూ దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని హాల్‌టిక్కెట్లు జారీచేసింది. అదే సమయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో వాయిదా వేసి.. హోంగార్డులతో వైసీపీ తెర వెనుక నుంచి కోర్టులో కేసు వేయించింది. ఎన్నడూ లేని విధంగా సివిల్ పోలీసులో 15 శాతం, ఏపీఎస్పీలో 25 శాతం రిజర్వేషన్లను వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. తమకు కటాఫ్ తగ్గించాలంటూ కొందరు హోంగార్డులు.. కోర్టును ఆశ్రయించడంతో నియామక ప్రక్రియ ఆగిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. అభ్యర్థులు ఈ విషయాన్ని సర్కార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం చంద్రబాబు.. హోంమంత్రి, డీజీపీ, పీఆర్‌బీ చైర్మన్, అడ్వకేట్ జనరల్‌తో సమీక్షించారు. న్యాయపరమైన చిక్కులకు పరిష్కారం చూడాలని ఆదేశించడంతో నియామక ప్రక్రియ ముందుకు కదిలింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

క్లాసెన్‌కు కాసుల పంట II

రూ.23 కోట్లకు అట్టిపెట్టుకున్న సన్‌రైజర్స్

కోహ్లీని 21 కోట్లకు రిటైన్ చేసుకున్న ఆర్సీబీ

చెన్నై అన్‌క్యాప్‌డ్‌గా ధోనీ.. రూ.4 కోట్లే

ఐపీఎల్ మెగా వేలంలోకి పంత్, రాహుల్

శనివారం | 2-11-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

చిన్నప్పుడు నా తల్లిని చూశాను. 20 మందికి కట్టెల పొయ్యి మీద వంట చేయాలంటే ఎంతో ఇబ్బంది పడేది. ఆమెను చూస్తే నాకు బాధేసేది. ఇప్పుడు అలాంటి కష్టం లేకుండా ఏడాదికి 3 సిలిండర్లు పూర్తి ఉచితంగా ఇస్తున్నాం. నేను తొలి దఫా ఎమ్మెల్యే అయిన సమయంలో, ఏడాదికి ఐదు సిలిండర్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పోయింది. అప్పట్లో 59లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండేవి. ఇప్పుడవి 1.50 కోట్లకు చేరుకున్నాయి. డీబీటీ ద్వారా ఈ కార్యక్రమం చేయాలని కేంద్రం సూచించింది. అందుకు నేను ప్రయత్నిస్తా. అప్పుడు.. ఇప్పటిలా ముందస్తుగా డబ్బులు కట్టాల్సిన పనీ ఉండదు.

● **కార్యకర్తల్లో కోపం..**

45 ఏళ్లుగా రాజకీయం చేస్తున్నా. కానీ, గత ఐదేళ్లలో చూసిన దౌర్భాగ్యమైన రాజకీయాలు గతంలో చూడలేదు. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకోలేక పోయేవారు. శుక్రవారం వస్తే పొక్లెయిన్‌లు వచ్చేవి. అచ్చెన్నాయుడు నాడు ఆపరేషన్ చేయించుకుని ఉన్నా జైల్లో 75 రోజులు పెట్టారు. అదీ రాక్షసత్వం.. దీంతో.. అవతలివారిని మాత్రం ఎందుకు విడిచిపెడుతున్నారని ఈరోజు జనసైనికులు, టీడీపీ తమ్ముళ్లు కొంత కోపంగా ఉన్నారు. తప్పుచేసిన వారిని విడిచిపెట్టను. అలా అని రాజకీయ కక్షసాధింపులకు పోను.

నేను నాలుగో దఫా ముఖ్యమంత్రిని. రాష్ట్రంలో ఏ కార్యక్రమం ప్రారంభించినా మహిళలను ఉద్దేశించే చేపడతాను. ఆడబిడ్డలకు స్వేచ్ఛ రావాలి. ఆత్మగౌరవంతో బతకాలి. డబ్బులు సంపాదించుకునే అవకాశం కల్పించాలి. తెలుగుదేశం పార్టీ మహిళలకు మగవారితో సమానంగా స్వేచ్ఛ ఇచ్చింది. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లను ఎన్టీఆర్ కల్పించారు. ఉద్యోగాల్లో వారికి 33 శాతం రిజర్వేషన్లు నేను ఇచ్చాను. ఐటీ రంగంలో భర్త కంటే భార్యకు ఎక్కువ ఆదాయం వస్తోంది. అదీ టీడీపీ ఇచ్చిన శక్తి.

- సీఎం చంద్రబాబు

మహిళలకు మహర్దశే!

సంక్షేమ కార్యక్రమాల్లో వారికే అగ్రతాంబూలం

సీఎం స్పష్టీకరణ

48 గంటల్లో ఖాతాల్లోకి ఉచిత గ్యాస్ డబ్బులు

రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు నాదీ హామీ

ముందుగా డబ్బు కట్టక్కర్లేని విధానాన్నీ తెస్తాం

నా పాలనలో నాసిరకం మద్యం ఉండదు

మీ ఊరి ఇసుక మీకు ఉచితం..

గత ఎన్నికల్లో నరకాసుర వధ జరిగింది
చెడు మీద మంచి గెలిచింది

ఆర్థిక రాజధానిగా విశాఖ.. రైల్వే జోన్‌కు ఓకే

ఓర్వకల్లులో 320 ఎకరాల్లో డ్రోన్ హబ్: సీఎం

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం
ఈదుపురంలో దీపం-2 పథకం ప్రారంభం

పండగ వాతావరణంలో కార్యక్రమం

స్టవ్ వెలిగించి స్వయంగా టీ కాచిన బాబు



శ్రీకాకుళం జిల్లా ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల వ్యాన్‌కు పచ్చజెండా ఊపి, దీపం-2.0 పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం



అంబటి శాంతమ్మ ఇంటిలో స్వయంగా టీ తయారుచేసి అందిస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీకాకుళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ కార్యక్రమాన్నైనా అక్కచెల్లెమ్మలను దృష్టిలో పెట్టుకునే టీడీపీ ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మహిళలకు రాజకీయాల్లోనూ, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని వెల్లడించారు. ఇదే కోవలో.. మహిళ వంటింటి కష్టాలు తీర్చడం కోసం ఉచిత గ్యాస్ సిలిండర్లను కూటమి ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఉచిత సిలిండర్..సూపర్ సిక్స్‌లోని మరో హామీ. శుక్రవారం ఈ ఎన్నికల వాగ్దానాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురంలో నిర్వహించిన

మిగతా 11వ పేజీలో...

3 నెలల్లో ఎప్పుడైనా పింఛన్ తీసుకోవచ్చు

సామాజిక పెన్షన్లు మన దగ్గరే ఎక్కువ: సీఎం

మాది మంచి ప్రభుత్వం మెతకది కాదు

వైసీపీ ఇంకా వేషాలేస్తే తొక్కి నారతీస్తా

డిప్యూటీ సీఎం పవన్ హెచ్చరిక



ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురంలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

"లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా చెబుతున్నా....! వైసీపీ నేతలు నోరెత్తకుండా చేస్తా. సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్టు ప్రచారం చేస్తున్నారు. మాది మంచి ప్రభుత్వమే తప్ప మెతక ప్రభుత్వం కాదు. తొక్కి నార తీస్తా. ప్రతిదీ సమయంతో సహా లెక్కిస్తున్నాం. మీరు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే"

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వాళ్ల సోషల్ మీడియా లెక్క తీస్తున్నాం

సనాతన ధర్మ పరిరక్షణకే కట్టుబడ్డాం

అస్థిరత్వాన్ని ఎన్నటికీ అంగీకరించం

సేనలోనూ నరసింహ వారాహి గణం

షర్మిల భద్రతపై సీఎంతో మాట్లాడతా

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పవన్ కల్యాణ్

ఏలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమది మంచి ప్రభుత్వమే తప్ప మెతక ప్రభుత్వం కాదని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం ఐ.ఎస్.జగన్నాథపురంలో శుక్రవారం దీపం-2 పథకం కింద గ్యాస్ సిలిండర్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. అక్కడే జరిగిన సభలో వైసీపీ నేతల తీరుపై నిప్పులు

మిగతా 11వ పేజీలో...



పిఠాపురంలో కూటమి అభ్యర్థి రాజశేఖర్ మెడలో కండువాలను చూపుతున్న జనసేన నేత కె.రాంబాబు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురంలో 'కండువాల' పంచాయితీ! 11

ఎమ్మెల్సీ అభ్యర్థి పరిచయ కార్యక్రమంలో టీడీపీ, జనసేన వాగ్వాదం

టీడీపీ నేతలు జనసేన కండువా వేసుకోలేదని జనసేన నేత ఆగ్రహం

అభ్యంతరం చెప్పిన టీడీపీ శ్రేణులు.. వాగ్వాదం, తోపులాట యత్నం

బడ్జెట్ చూసి హామీలివ్వండి



ఐదు, ఆరు, పది అంటూ గ్యారెంటీలను ప్రకటించొద్దు

అమలులో విఫలమైతే ప్రభుత్వానికి చెడ్డపేరు

ప్రజల్లో విశ్వాసం కోల్పోతాం: కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల నేతలకు సూచన

'ఉచిత బస్సు'పై పునరాలోచన: డీకే శివకుమార్

తన ప్రకటనను వక్రీకరించారని తర్వాత వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబరు 1: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటిస్తున్న హామీలపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా రాష్ట్రాల బడ్జెట్‌ను పరిగణనలోకి తీసుకోకుండా హామీలు ప్రకటించవద్దని త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్ కాంగ్రెస్ నేతలకు సూచించారు. బడ్జెట్ పరిధిలోనే గ్యారెంటీలు ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ఖర్గే మీడియాతో మాట్లాడారు. 'త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో అయిదు, ఆరు, పది, ఇరవై వంటి గ్యారెంటీలు ప్రకటించవద్దని ఆ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు సూచించాను. మీ రాష్ట్ర బడ్జెట్‌లో సరిపోయే హామీలే ఇవ్వండి. లేకుంటే రాష్ట్రం దివాలా తీసే పరిస్థితులు వస్తాయి. ప్రణాళిక రహిత విధానం ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుంది. రోడ్లు వేయడానికి కూడా నిధులు లేకపోతే అందరూ మీకు వ్యతిరేకంగా మారిపోతారు. వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమైతే ప్రభుత్వానికి చెడ్డ పేరు రావడమే కాకుండా భావితరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది' అని ఖర్గే హెచ్చరించారు. మహిళలకు ఉచిత బస్సు సేవలు అందించే శక్తి పథకాన్ని పునఃసమీక్షిస్తామని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఖర్గే ఈ సూచనలు

మిగతా 10వ పేజీలో...

కాంగ్రెస్ బండారం బట్టబయలు

ఆ పార్టీ బూటకపు హామీలతో జాగ్రత్త: ప్రధాని మోదీ

రెడ్‌బుక్ చాప్టర్-3 తెరుస్తాం

చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కచ్చితంగా సినిమా చూపిస్తాం

అట్లాంటా సభలో మంత్రి లోకేశ్.. ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రెడ్‌బుక్‌లో ఇప్పటి వరకు రెండు చాప్టర్లను మాత్రమే తెరిచామని, మూడో చాప్టర్‌ను త్వరలోనే తెరుస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన అట్లాంటాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. "చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కచ్చితంగా సినిమా చూపిస్తాం. సందేహం లేదు. త్వరలోనే రెడ్ బుక్ మూడో చాప్టర్ కూడా తెరుస్తాం" అని స్పష్టం చేశారు. యువగళం పాదయాత్రలో తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్‌బుక్‌కు వైసీపీ అధ్యక్షుడు జగన్ భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. "గుడ్‌బుక్ తీసుకువస్తానని జగన్ అంటున్నారు. ఆ బుక్‌లో ఏం రాయాలో జగన్‌కు అర్థం కావడం లేదు. గతంలో సోషల్ మీడియాలో పోస్టు పెడితే కేసులు పెట్టి లుక్ అవుట్ నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులకు భయపడకుండా ప్రవాస భారతీయులు(ఎన్‌ఆర్‌ఐ)లు నిలబడ్డారు" అని లోకేశ్ ప్రశంసించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకువెళ్తున్నామని చెప్పారు. సంక్షేమం అంటే ఏమిటో ఎన్టీఆర్ చేసి చూపారని గుర్తు చేశారు. ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా తలెత్తుకుని తిరిగే పరిస్థితిని ఎన్టీఆర్ తీసుకొచ్చారని అన్నారు. ఆయన ఆశయాలను సాకారం చేయడంలో ఎప్పుడూ ముందుంటామని లోకేశ్ ప్రకటించారు. అమెరికాలోని ఆంధ్రులు ఎన్‌ఆర్‌ఐలు కాదని.. 'ఎంఆర్‌ఐ'లని లోకేశ్ కొత్త నిర్వచనం చెప్పారు. మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్(ఎంఆర్‌ఐ) అని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి గెలుపు ప్రపంచంలోని ప్రతి తెలుగువారిదని లోకేశ్ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నేత కోమటి జయరాం తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

మిగతా 11వ పేజీలో...



అమెరికాలోని అట్లాంటా సమీప కమింగ్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

పెట్టుబడులే లక్ష్యంగా!

వారంపాటు అమెరికాలో దిగ్గజ కంపెనీల అధినేతలతో లోకేశ్ చర్చలు

రాష్ట్రంలో అవకాశాలపై పారిశ్రామికవేత్తలకు ప్రజంటేషన్లు

విశాఖలో క్లౌడ్ డేటా సెంటర్ కోసం 'గూగుల్'తో చర్చలు 11

నేటి ఉదయం స్వదేశానికి తిరుగుపయనం



పెళ్లైన కుమార్తెకు 'కారుణ్య' నిరాకరణ వీల్లేదు 7

ప్రభుత్వ నిబంధనలు వివక్షాపూరితంగా ఉన్నాయి

అమ్మాయికి పెళ్లైనా.. జీవితకాలం కుటుంబసభ్యురాలే

పిటిషనర్‌కు ఉద్యోగం ఇవ్వకపోవడం చట్ట విరుద్ధం

ఎనిమిది వారాల్లో తగిన ఉద్యోగంలో నియమించండి

దేవదాయ శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

రష్యాకు సాయంపై అమెరికా కన్నెర్ర

400 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు

జాబితాలో భారత్ సహా పలు దేశాలు

10

టీటీడీ బోర్డుకు ఓకే

జీవో జారీ.. చైర్మన్, 24 మంది సభ్యులతో ఏర్పాటు

కొత్తగా బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డికి చోటు

నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు

బోర్డు సభ్యులుగా బోరా, కృష్ణమూర్తి నియామకం విషయంలో అభ్యంతరాలు

పునఃపరిశీలించి ఓకే చేసిన చంద్రబాబు



భానుప్రకాశ్ రెడ్డి

దేవదాయ చట్టం సెక్షన్ 154 ప్రకారం మినహాయింపు

అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కొత్త పాలక మండలిని దీపావళికి ముందు ప్రకటించగా, ఎట్టకేలకు నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. బోర్డు సభ్యులుగా సౌరబ్ బోరా (మహారాష్ట్ర), కృష్ణమూర్తి (తమిళనాడు) నియామకం విషయంపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో రెండు రోజులు ఆలస్యమైంది. బుధవారం టీటీడీ బోర్డు చైర్మన్, 23 మంది

మిగతా 9వ పేజీలో...



డిసెంబరులో పోలీసు ఫిట్‌నెస్ పరీక్షలు

కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు తీపి కబురు

11 నుంచి 21 వరకు దరఖాస్తుల స్వీకరణ

6,100 పోస్టులకు 95 వేల మంది పోటీ

నాన్చి.. కేసులతో మోసగించిన వైసీపీ సర్కార్

పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం II

కత్తులతో నరికి.. గునపాలతో పొడిచి.. 9

ఒకే కుటుంబంలో ముగ్గురి దారుణ హత్య

పారిపోయేవారిని వెంటాడి మరీ నరికేశారు.. రాడ్లతోనూ విచక్షణారహితంగా దాడి

మృతదేహాలను బైక్‌లతో తొక్కించి పాశవికం.. పాత కక్షలు, వివాహేతర సంబంధ వివాదమే కారణమంటున్న పోలీసులు.. కాకినాడ జిల్లా శలపాకలో ఘోరం

'కర్నూలు యురేనియం'పై కదనం 7

మా శవాలను దాటి అడవిలోకి వెళ్లండి

తవ్వకాలకు వ్యతిరేకంగా 12 గ్రామాల పట్టు

కడియం నర్సరీల్లో ఘోరం

వివాహితపై గ్యాంగ్‌రేప్, హత్య

చనిపోయినా వదలని పైశాచికం?

15 రోజుల తర్వాత వీడిన మిస్టరీ

నలుగురు యువకుల అరెస్ట్ 9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అన్నీ గుజరాత్‌కేనా..?

స్పెయిన్ అధినేత పెడ్రో శాంచేజ్‌తో కలసి, ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల గుజరాత్‌లోని వడోదరలో ఘనంగా ఆరంభించిన టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్, ఇప్పుడు మహారాష్ట్రలో ఎన్నికల ముందు అధికారపక్ష కూటమిని ఆత్మరక్షణలో పడవేసింది. పదేళ్ళక్రితమే నరేంద్రమోదీ ప్రధాని అయినా, స్వరాష్ట్రం గుజరాత్‌మీద ఉన్న ప్రేమ మిగతారాష్ట్రాల మీద లేకపోయిందని, ఇతర రాష్ట్రాలకు దక్కాల్సిన ప్రాజెక్టులను కూడా ఆయన తన రాష్ట్రానికి తరలించుకుపోతున్నారని విపక్షాలనుంచి తరచుగా విమర్శలు వినబడుతూనే ఉన్నాయి. సి–295 సైనిక రవాణా విమానాల తయారీ నిమిత్తం ఏర్పాటు చేసిన ఆ కాంప్లెక్స్‌ని ఆరంభిస్తూ, ఆ విమానం ఎంత అద్భుతమైనదో ప్రధాని వివరించారు. వడోదరలో తయారైన విమానాలు ఇతరదేశాలకు ఎగుమతి అవుతాయనీ, ఈ ప్రాజెక్టు 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' ఆశయాన్ని బలోపేతం చేస్తుందని ప్రకటించారు. భారతదేశంలో తొలిసారిగా పర్యటించిన పెడ్రో శాంచేజ్‌తో కలసి రోడ్‌షో కూడా నిర్వహించారు. నరేంద్రమోదీ వ్యాఖ్యానించినట్టుగా, భారత్ గత దశాబ్దకాలంలో విమానయానరంగంలో సాధించిన ప్రగతికి, దేశం ఏవియేషన్ హబ్‌గా మారుతున్న తీరుకూ నిదర్శనంగా దీనిని యావత్ దేశం చూస్తుందని బీజేపీ నాయకులు భావించడం సహజం. అయితే, ఎన్నికలు దగ్గరపడుతున్న మహారాష్ట్రలో ఈ అంశం విపక్షాలకు అయాచిత ఆయుధంగా అందివస్తుందని మహాయుతి నేతలు ఊహించలేదు.

నాగపూర్‌లో ఏర్పాటు కావాల్సిన ఈ కర్మాగారం నరేంద్రమోదీ ఒత్తిడిమేరకు గుజరాత్‌కు తరలిపోయిందని మహారాష్ట్రలోని విపక్షపార్టీలు ఆరోపిస్తున్నాయి. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ నాయకులంతా మహారాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా కుట్రచేశారని కాంగ్రెస్‌పార్టీ, ఉద్ధవ్‌ఠాక్రే శివసేన ప్రచారం చేస్తున్నాయి. మహారాష్ట్రకు రావాల్సిన ప్రాజెక్టులన్నీ ఎవరో కక్షకట్టినట్టుగా గుజరాత్‌కు వరుసపెట్టి పోతున్నాయని వారి ఆరోపణ. మహారాష్ట్రలో అధికారంలో కొనసాగడమే ముఖ్యమనుకొనేవారు ఉంటే, మరోపక్క గుజరాత్ కోసం ఇద్దరు ముఖ్యమంత్రులు పనిచేస్తూ అన్నీ తరలించుకుపోతున్నారని ఓ విపక్షనేత వ్యాఖ్యానించారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ–ఎస్పీ) అధినేత శరద్‌పవార్ మరో అడుగుముందుకు వేసి అప్పుడెప్పుడో జరిగిన కొన్ని పరిణామాలను వివరించారు. మహారాష్ట్రలోనే ఈ ప్రాజెక్టు స్థాపించాలని రతన్‌టాటా నిర్ణయించుకున్నారని, నాగపూర్ ఎంఐడీసీ ఏరియాలో దీనికోసం ఐదువందల ఎకరాలను మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కేటాయించిందని, ఇంతలో ప్రభుత్వం మారడంతో నరేంద్రమోదీ స్వయంగా రతన్‌టాటాను పిలిపించుకొని, ప్రాజెక్టును వడోదరకు మార్చేయమని ఒత్తిడిచేశారని శరద్‌పవార్ వ్యాఖ్యానించారు. ఈ వయసులో ఇన్ని అబద్ధాలా అంటూ అధికారపక్షనేతలు ఆయనమీద ప్రతిదాడి చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రతిపాదన దశలో కూడా మహారాష్ట్ర పేరు లేదని, కేవలం గుజరాత్, యూపీ మాత్రమే ఉన్నాయని ఉపముఖ్యమంత్రి ఫడ్నవీస్ సమర్థించుకున్నారు.

ఒకపక్క రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, గుజరాత్‌లో ఈ ప్రాజెక్టు ఆరంభం ఘనంగా జరగడం, తరలిపోయిందన్న ప్రచారం ఎక్కువకావడం మహాయుతి నేతలను ఇరకాటంలో పెడుతున్నది. 2022లో వేదాంత–ఫాక్స్‌కాన్ ప్రాజెక్టు కూడా ఇదే విధంగా చేజారిపోయిందంటూ ప్రత్యర్థులు ఇప్పుడు మళ్ళీ దానిని ఓటర్లకు గుర్తుచేస్తున్నారు. ఆఖరుక్షణంలో, రాష్ట్రప్రజలకు, నిరుద్యోగయువతకు వెన్నుపోటుపొడుస్తూ బీజేపీ అప్పట్లో ఈ ప్రాజెక్టు లోకేషన్ మార్చేసిందని వారి విమర్శ. గుజరాత్‌లో గిఫ్ట్‌సిటీ తెరమీదకు వచ్చినప్పుడు అది ముంబైలోని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్‌ను దెబ్బతీయడానికేనని ఓ ప్రచారం జరిగింది. గుజరాత్–మహారాష్ట్ర మధ్య జన్మవైరం దశాబ్దాలుగా ఉన్నదే. ఆవిర్భావం నాటి ఆగ్రహం, అక్కసు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. మరాఠీ ఆత్మగౌరవం, ఆధిపత్యంమీద తిరుగుబాటు వంటి మాటలు ఈ ఎన్నికలకాలంలో మరింత వినబడుతుంటాయి. టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ వివాదం వల్లనే కాబోలు, గుజరాత్, మహారాష్ట్రలలో ఏది ఎక్కువ విదేశీ పెట్టుబడులను ఆకర్షించిందో వివరించే డేటా ఒకటి ఇప్పుడు ప్రచారంలోకి వచ్చింది. కానీ, వాస్తవాలకంటే భావోద్వేగాలే ఎన్నికల్లో ఎక్కువగా పనిచేస్తాయని నాయకుల నమ్మకం.

ఫ్రీలాన్స్ జర్నలిజం... 'సుప్రీం' వ్యాఖ్యలు సబబేనా?

న్యాయవాద వృత్తిలో ఉంటూ జర్నలిస్టు వృత్తిలో ఎలా కొనసాగుతారంటూ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కమ్రాన్ అనే న్యాయవాది, బ్రిజేష్ భూషన్ అనే ప్రజాప్రతినిధిపై వేసిన పరువునష్టం దావాపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టులో ఈ విషయమై ప్రస్తావన వచ్చింది. ఇదే అంశంపై జూలై 29న "అడ్వకేట్ వర్కింగ్ యాజ్ ఫ్రీలాన్సర్ ఈజ్ మిస్ కండక్ట్" అంటూ అడ్వకేట్ కమ్రాన్ విషయంపై విచారించాల్సిందిగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కి లేఖరాసింది. అయితే ఈ విషయానికి అప్పట్లో అంత ప్రాచుర్యం లభించలేదు. తాజాగా "మహ్మద్ కమ్రాన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్" కేసులో మళ్లీ అడ్వకేట్ డ్యుయల్ రోల్‌పై సుప్రీంకోర్టు కీలక ప్రకటన చేసింది. బీసీఐకి మరో లేఖ పంపినట్టు వార్తలు వచ్చాయి. న్యాయవాది రెండు వృత్తులను ఎలా నిర్వహిస్తారు అన్నది ఇక్కడ సుప్రీంకోర్టు అభ్యంతరం.

వాస్తవానికి జర్నలిస్టుకూ, ఫ్రీలాన్స్ జర్నలిస్టుకూ చాలా తేడా ఉంది. జర్నలిజం అనేది వృత్తి, కానీ ఫ్రీలాన్స్ జర్నలిజం కేవలం ప్రవృత్తి మాత్రమే. జర్నలిస్టులు/ రిపోర్టర్‌లు నిత్యం వార్త సేకరణ పనిలో ఉంటారు. వారు పని చేసే సంస్థలు వారికి ఇచ్చిన అసైన్‌మెంట్ పూర్తిచేసే పనిలో ఉంటారు. రెవెన్యూ, సర్క్యులేషన్ పెంచడం కూడా ఇటీవల వారి విధుల్లో భాగమైపోయింది. కానీ ఫ్రీలాన్స్ జర్నలిస్టుకు ఏ సంస్థతోనూ పూర్తిస్థాయి బాధ్యతాయుతమైన సంబంధాలు ఉండవు. వారు కేవలం కొన్ని విషయాలను మాత్రమే మక్కీకి మక్కీ అందించాలి. ఎందుకంటే కొన్ని కొన్ని న్యూస్ ఏజెన్సీలు మాత్రమే వీరిని వార్తల కోసం ఆశ్రయిస్తాయి. ప్రధాన స్రవంతి మీడియాలో వీరికి అవకాశాలు చాలా తక్కువ. ఫ్రీలాన్స్ జర్నలిస్టులు ఏ వ్యక్తికి లేదా సంస్థకు లేదా వ్యవస్థలకూ వ్యతిరేకంగా వార్తలు రాయరు. వివాదాల్లో తలదూర్చరు. ఏ సంస్థ పేరు మీద కూడా వ్యాపార ప్రకటనలు, లేదా ఇతర ఆర్థిక లావాదేవీలు జరిపే అవకాశం లేదు. వ్యాసకర్తలుగా సమాజంలో వస్తున్న ఆధునిక పోకడలు, విపత్తులు, మారుతున్న సామాజిక పరిస్థితులపై విశ్లేషణలు రాయడం వరకు ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు సాధ్యమయ్యే పని. ఈ ప్రవృత్తిలో వీళ్లకు ఆర్థిక ప్రయోజనాలు ఉండే అవకాశాలు మృగ్యం. కానీ మహ్మద్ కమ్రాన్ విషయంలో జరిగింది పూర్తిగా విరుద్ధం. అతను ఫ్రీలాన్స్ జర్నలిస్టు ముసుగులో ఒక ప్రజాప్రతినిధిని టార్గెట్ చేయడంతో ఫ్రీలాన్స్ జర్నలిజాన్ని ఒక వృత్తిగా భావించి అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.



వ్యాసకర్తలుగా సమాజంలో వస్తున్న ఆధునిక పోకడలు, విపత్తులు, మారుతున్న సామాజిక పరిస్థితులపై విశ్లేషణలు రాయడం వరకు ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు సాధ్యమయ్యే పని. ఈ ప్రవృత్తిలో వీళ్లకు ఆర్థిక ప్రయోజనాలు ఉండే అవకాశాలు మృగ్యం. కానీ మహ్మద్ కమ్రాన్ విషయంలో జరిగింది పూర్తిగా విరుద్ధం. అతను ఒక ప్రజాప్రతినిధిని టార్గెట్ చేయడంతో ఫ్రీలాన్స్ జర్నలిజాన్ని ఒక వృత్తిగా భావించి అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

న్యాయవాది ఫ్రీలాన్స్ వ్యాసకర్తగా పని చేయడానికి వీల్లేదు అన్నప్పుడు న్యాయ విషయాలకు సంబంధించి, న్యాయస్థానాలకు సంబంధించి, వివిధ కోర్టు తీర్పులకు సంబంధించిన వార్తలు ఎవరు రాయాలీ అనే సందేహం కలగక మానదు. ఎందుకంటే సహజంగా రాసే వార్తలకూ న్యాయ పరిభాషలో రాసే వార్తలకూ కొంత వ్యత్యాసం ఉంటుంది. ఆయా జడ్జిమెంట్‌లను అర్థం చేసుకొని వార్త రూపంలో మలవాలంటే అది న్యాయవాద వృత్తిలో ఉంటూ భాష మీద పట్టు ఉన్నవాళ్లకు మాత్రమే సాధ్యమయ్యే విషయం. అలాగే రెండు వృత్తులు నిర్వహిస్తే రెండు వృత్తుల్లోనూ ఆర్థిక ప్రయోజనాలు ఉండాలి. కానీ ఎటువంటి ఆర్థిక లావాదేవీలు లేని వ్యాస రచనా ప్రవృత్తిని వృత్తిగా ఎలా గుర్తిస్తారనేది కూడా ఆలోచించాల్సిన విషయం. తాజాగా భారత ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుప్రీంకోర్టు వార్తలు కవర్ చేయడానికి న్యాయవిద్య పూర్తిచేసి ఉండాల్సిన పని లేదని స్పష్టం చేశారు. న్యాయస్థానం వార్తలను కవర్ చేయాలి అంటే న్యాయవాది అయి ఉండాల్సిన పనిలేదన్న సీజేఐ వ్యాఖ్యలకు ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ఈ వార్త సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

లీగల్ కంట్రిబ్యూటర్స్ ఫ్రీలాన్స్ జర్నలిస్టుల కిందికి వస్తారా లేక వాళ్లకు ఈ నియమం వర్తించదా? అన్న విషయానికి వద్దాం. లీగల్ కంట్రిబ్యూటర్స్ అన్న పదంలోనే కంట్రిబ్యూషన్ అనే మాట ఉంది. అంటే విరాళం అని అర్థం. న్యాయవాదులుగా పని చేస్తూ ఏదో ఒక పత్రికకు లీగల్ కంట్రిబ్యూటర్‌గా పనిచేస్తూ వాటికి లీగల్ అప్‌డేట్స్ అందించడం వీరి పని. శిక్షపడ్డ తీర్పులు, చెక్ కేసులు, ఐపీ దాఖలు వార్తలు, లోక్ అదాలత్ వార్తలు, కొత్తగా విధుల్లో చేరిన విషయాలపై వార్తలు, న్యాయాధికారుల ఇతర సిబ్బంది బదిలీ వార్తలు, న్యాయవాద సంఘాల కాన్ఫరెన్స్‌లు... ఇలా న్యాయస్థానానికీ, దాని అనుబంధ వర్గాలకూ సంబంధించిన వార్తలను మాత్రమే లీగల్ కంట్రిబ్యూటర్స్ అందిస్తారు తప్ప ఏ వ్యక్తికి గానీ వ్యవస్థలకు గానీ అనుకూలంగానో, ప్రతికూలంగానో రాసే అవకాశమే లేదు. ఇందుకు గానూ వీరికి ఏ రకమైన ఆర్థిక ప్రయోజనాలు ఉండవు. కేవలం కంట్రిబ్యూషన్ మాత్రమే. వీరి విలువైన సమయాన్ని కేటాయించి, సదరు కాన్ఫరెన్స్‌లకు, జడ్జి గారి ప్రెస్ మీట్‌లకు హాజరై వార్తలు, ఫోటోలు పంపించినందుకు వీళ్లకు దక్కేది కేవలం ఒక గుర్తింపు మాత్రమే.

ప్రస్తుతానికి మహ్మద్ కమ్రాన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసులో ఇంకా తుది తీర్పు రాలేదు. తీర్పు వెలువడ్డాక ఈ అంశంపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. న్యాయవాద విషయ విరాళ సేవకులు తమ విలువైన సమయాన్ని కేటాయించి స్వచ్ఛంద సేవ చేయాలా లేక న్యాయవాద వృత్తికే పరిమితమవ్వాలా అనే విషయంపై లీగల్ కంట్రిబ్యూటర్లు పునరాలోచించుకోవాల్సిన సందర్భం ఇది.

● అయితగాని జనార్దన్

భయపెడుతున్న ఆర్థిక భవితవ్యం



■ పి. చిదంబరం

'పళని' పలుకు

భారతీయ రిజర్వ్ బ్యాంక్ సరికొత్తగా ద్రవ్య విధాన ప్రకటన చేసింది. అది మీడియా పతాక శీర్షికల్లో అందరినీ ఆలోచనామగ్నులను చేసింది. రెపో రేటు విధానమే అందుకు కారణమని మరి చెప్పనవసరం లేదు. బ్యాంకులు తమ వద్దనున్న అదనపు నిల్వలను రిజర్వ్ బ్యాంకు వద్ద ఉంచి నిధులు తీసుకోవడాన్ని రెపో అంటారు. ప్రభుత్వ సెక్యూరిటీల హామీతో ఆర్బీఐ తీసుకొనే ఒక స్వల్పకాలిక వడ్డీతో కూడిన అప్పు ఇది. ఈ అప్పుమీద తీసుకునే వార్షిక వడ్డీరేటునే రెపో రేటు అంటారు. రెపో రేటు వడ్డీరేట్లకు ప్రధాన సంకేతంగా మారింది. రెపో రేటు తగ్గడం బ్యాంకుల నుంచి అప్పులు తీసుకునేవారికి ఆనందదాయక విషయం. ఎందుకంటే అవి, రిజర్వ్ బ్యాంక్ నుంచి తక్కువ వడ్డీరేటుపై అప్పులు తీసుకుంటాయి. ఈ సొమ్మును తక్కువ వడ్డీపై తిరిగి ప్రజలకు అప్పుగా ఇస్తాయి. రెపో రేటు పెరగడం ద్రవ్యోల్బణం తగ్గాలని ఆశిస్తున్న వారికి సంతోషకరమైన విషయం. ఎందుకంటే ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు రెపోరేటు ఒక సాధనం. రెపోరేటు యథాతథంగా ఉండిపోవడం జరిగితే అప్పులు తీసుకునేవారు, ద్రవ్యోల్బణం ఎప్పుడు తగ్గుతుందా అని నిరీక్షిస్తున్నవారు తమ ఆర్థిక భవితవ్యం విషయమై వివిధ అంచనాలకు రావడాన్ని అనివార్యం చేస్తుంది.

మార్చి 27, 2020న రెపోరేటును 5.0 శాతం నుంచి 4.0 శాతానికి తగ్గించారు. ఇది చాలా పెద్ద కోత. కోవిడ్ ప్రభావిత ఆర్థిక వ్యవస్థ మాంద్యం ముప్పు నెదుర్కొంటున్న కారణంగా రెపో రేటును తగ్గించారు. ఆ తగ్గిన రేటు 26 నెలల పాటు అమలులో ఉన్నది. కోవిడ్ విలయం ముగిసి, ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకుంటున్న సూచనలు కన్పించగానే రెపోరేటును స్వల్పంగా పెంచారు. ద్రవ్యోల్బణ అంచనాలను నియంత్రించేందుకై రెపోరేటును 4 నుంచి 4.40 శాతానికి పెంచారు. ఫిబ్రవరి 2023 నాటికి అది 6.50 శాతానికి పెరిగింది. గత 20 నెలలుగా అది అలానే ఉండిపోయింది ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మే 2022 నుంచి ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు అయితే రెపో రేటు మార్పుని కారణంగా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో ఆర్బీఐ ఇంతవరకు సఫలం కాలేదు.

ఆర్బీఐ గవర్నరే కాదు, ఏ కేంద్ర బ్యాంకు గవర్నర్ కూడా అందరినీ తన నిర్ణయాలతో సంతృప్తిపరచలేడు. యూపీఏ ప్రభుత్వం ఒక ద్రవ్య విధాన కమిటీని నియమించింది. ఆర్బీఐ గవర్నర్ బాధ్యతల బరువు పంచుకోవడమే ఆ కమిటీ ఏర్పాటు లక్ష్యం. అయితే రెపోరేటుగానీ మరేదైనా విషయమై గానీ తుది నిర్ణయం మాత్రం ఆర్బీఐ గవర్నర్‌దే.

ద్రవ్యోల్బణాన్ని 4 శాతంగా ఉంచాలన్నది లక్ష్యం. అయితే ద్రవ్యోల్బణం ఆ లక్ష్య దిశగా లేదు. ఆహార, ఇంధన ధరలు పరిస్థితులను క్లిష్టం చేస్తున్నాయి. వడ్డీరేటు మార్పుకు అవి ప్రతిస్పందించడం లేదు. సెప్టెంబర్ 2024లో గత ఏడాది ధరల కంటే టొమాటో ధర 42.4 శాతం, ఉల్లిపాయల ధర 66.2 శాతం, పొటాటో ధర 65.3 శాతం పెరిగాయి. రెపో రేటును యథాతథంగా ఉంచడాన్ని ఆర్బీఐ గవర్నర్ సమర్థించారు. రెపో రేటు అధిక స్థాయిలో ఉంటే ఆర్థిక వ్యవస్థ పెరుగుదల కుంటుపడుతుందనేది ఒక ప్రతి వాదన.

ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, ద్రవ్యోల్బణం అదుపు అనేవి అటు ప్రభుత్వ, ఇటు ఆర్బీఐ ప్రాథమిక బాధ్యతలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 7.5 శాతంగా ఉండగలదని శక్తికాంత దాస్ అంచనా వేశారు. అలాగే ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉండగలదని ఆయన భావిస్తున్నారు ద్రవ్యోల్బణం ఇంకా ఆ స్థాయికి రాలేదు. ద్రవ్యోల్బణం రేటు సెప్టెంబర్ 2024లో 5.49 శాతంగా ఉన్నది. అఖిల భారత వినియోగదారు ఆహార ధర సూచీ 9.24 శాతం వద్ద ఉన్నది. ఈ నెలలో విడుదలైన ఆర్బీఐ ద్రవ్య విధాన నివేదిక ఆ రెండు అంశాలపై ఏమి చెప్పిందో వివరంగా చూద్దాం.

ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు సంబంధించి ప్రభుత్వ గణాంకాలను ఏకరవు పెట్టిన తరువాత ఆ నివేదిక ఇలా వ్యాఖ్యానించింది: 'అనిశ్చిత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, పెచ్చరిల్లుతున్న భౌమ రాజకీయ ఘర్షణలు, పెరుగుతున్న సరఫరా గొలుసు ఒత్తిళ్ల మొదలైనవాటి కారణంగా ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఆశాజనకంగా లేదు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్‌లో తగ్గుదల, వాతావరణ మార్పు కారణంగా తరచు ప్రాకృతిక విపత్తులు వాటిల్లడం మొదలైనవి కూడా ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు సానుకూలంగా లేవు'.

ఇక ద్రవ్యోల్బణం అదుపు విషయమై ఎదురవుతున్న చిక్కుల గురించి ఆ నివేదిక ఇలా పేర్కొంది : పెరుగుతున్న ప్రపంచ సరఫరా ఒత్తిళ్లు, ప్రతికూల వాతావరణ సంఘటనలు, వర్షపాతం అన్ని రాష్ట్రాలలో ఒకే విధంగా లేకపోవడం, ఎడతెగకుండా కొనసాగుతున్న భౌమ రాజకీయ ఘర్షణలు, తత్ఫలితంగా సరఫరాలకు అంతరాయం, ఆహార, లోహ, ధరల పెరుగుదల, క్రూడాయిల్ ధరల చంచల స్వభావం మొదలైనవి ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు దోహదపడడంలేదు. ఆర్థిక మంత్రిత్వ శాఖ 'మంత్లీ ఎకనామిక్ రివ్యూ' అంచనా నిక్కచ్చిగా ఉన్నది. భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు 'సంతృప్తికరం'గా ఉందని పేర్కొంటూ డిమాండ్ పరిస్థితులను జాగ్రత్తగా గమనించవలసి ఉన్నదని హెచ్చరించింది. భౌమ రాజకీయ ఘర్షణలు అంతకంతకూ పెచ్చరిల్లిపోవడం, కొన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలోని ద్రవ్యవిపణులలో మూల్య నిర్ధారణలు అధిక స్థాయిలో ఉండడం మొదలైనవి కూడా మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు సానుకూలంగా లేవని 'మంత్లీ ఎకనామిక్ రివ్యూ' పేర్కొంది. ఎన్‌సిఎఇఆర్‌కు మంత్లీ ఎకనామిక్ రివ్యూ అంచనా సమతౌల్యంగా ఉన్నది. పెరుగుదలకు దోహదం చేస్తున్న అంశాలను ప్రస్తావించిన తరువాత పలు ప్రతికూల అంశాలను పేర్కొంది. బ్యాంకు రుణాల మంజూరులో తగ్గుదల, వ్యక్తిగత రుణాలలో తగ్గుదల, రూపాయి విలువ పడిపోవడం, విదేశీ పెట్టుబడుల రాక తగ్గిపోవడం మొదలైనవాటిని ప్రస్తావించింది.



ఆర్థిక వ్యవస్థపై విహంగ దృష్టి కంటే అందుకు వ్యతిరిక్తంగా కింది నుంచి పరిశీలించవలసిన అవసరమున్నది. స్థూల ఆర్థిక రంగాన్ని పరిశీలించడంలో విహంగ దృష్టి ముఖ్యమైనది అయినా కింది నుంచి చేసే పరిశీలనలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న యాతనలు విశదమవుతాయి. ఈ ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు సవ్యంగా లేవు. దేశీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు సమస్యల మయంగా ఉన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు జాగరూకతతో ఉండడం అవశ్యం.

నా అభిప్రాయంలో ఆర్థిక వ్యవస్థపై విహంగ దృష్టి కంటే అందుకు వ్యతిరిక్తంగా కింది నుంచి పరిశీలించవలసిన అవసరమున్నది. స్థూల ఆర్థిక రంగాన్ని పరిశీలించడంలో విహంగ దృష్టి ముఖ్యమైనది. అయితే కింది నుంచి చేసే పరిశీలనలో సామాన్య ప్రజలకు సమకూరుతున్న ప్రయోజనాలు, వారు ఎదుర్కొంటున్న యాతనలు విశదమవుతాయి. ప్రజలను అమితంగా ఆందోళన పరుస్తున్న విషయాలు: పెచ్చరిల్లుతున్న నిరుద్యోగిత, అధిక ద్రవ్యోల్బణం, ఎదుగుబొదుగు లేని వేతనాలు, పేదలు, సంపన్నుల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, మితిమీరిన క్రమబద్ధీకరణ, జీఎస్టీ పాలనా వ్యవహారాలు కఠోరంగా, భరించలేనివిగా ఉండడం, నాణ్యత కొరవడిన విద్య, అందుబాటులో లేని వైద్య సేవలు, ప్రభుత్వోద్యోగుల నిర్లక్ష్య వైఖరులు, పేదల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన సొమ్మును సంపన్నులకు అనుకూలంగా వ్యయపరచడం మొదలైనవి. వీటితో పాటు మరెన్నో విషయాలు ప్రజల శ్రేయస్సుకు తీవ్ర భంగం కలిగిస్తున్నాయి. వాటిలో ప్రధానమైనవి యుద్ధాలు. పశ్చిమాసియాలో అమానుష యుద్ధం, దాని ప్రభావం మరిన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపై పడుతోంది. అలాగే రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో నాటో దేశాలు సైతం పాల్గొనడం అనివార్యమయ్యే పరిస్థితులు క్రమంగా నెలకొనడం. సరే, ఈశాన్య భారత రాష్ట్రమైన మణిపూర్‌లో పరిస్థితులు ఏ క్షణాన అయినా బద్దలయ్యే అగ్ని పర్వతంలా కొనసాగుతుండడం ఎంతైనా ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్ర ఎన్నికలలో ప్రజల తీర్పు ఆశ్చర్యకరంగా ఉండవచ్చు. చైనా–తైవాన్, అలాగే ఉభయ కొరియాల మధ్య పరిస్థితులు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవచ్చు. మొత్తం మీద దేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఆశాజనకంగా లేదన్నది ఒక కొట్టివేయలేని వాస్తవం. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు జాగ్రత్తపడడం అవశ్యం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఈ అలసత్వం తగునా?

గ్రాడ్యుయేట్ మండలి ఎన్నికల ఓటర్ నమోదులో విద్యావంతులు, మేధావి వర్గం యొక్క ఓటు నమోదు ప్రక్రియ శాతం చాలా తక్కువగా ఉంటుంది. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఉండే ఓటు నమోదు ప్రక్రియలో విద్యావంతులు ఓటు నమోదులో అలసత్వం చూపిస్తున్నారు. అటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఓటు హక్కు నమోదు చేయకుండా ఉండే ఉపాధ్యాయులు శాతం కూడా ఎక్కువగా ఉంటుంది. సెకండరీ స్థాయి పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు అవకాశం ఉంది గనుక ఈ విషయంలో ప్రభుత్వ యాజమాన్యాల ఉపాధ్యాయుల కంటే, ప్రైవేట్ పాఠశాలల్లో సెకండరీ స్థాయి బోధన చేసే ఉపాధ్యాయుల ఓటు నమోదు అధికంగా ఉండే అవకాశం ఉంది. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటిది. ఓటు హక్కుని ఆన్‌లైన్‌లో లేదా మాన్యువల్‌గా గాని నమోదు చేసి ఓటర్‌గా గుర్తింపు పొంది, పోలింగ్ రోజు ఓటు వినియోగించుకునే రోజే 'ప్రజాస్వామ్యం' నిలబెడుతుంది. మేధావి వర్గం ఈ విషయంలో అలసత్వం చూపించడం మంచి పరిణామం కాదు. ఎలక్షన్ కమిషన్ కూడా సులభంగా ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు కోసం అవకాశం కల్పించింది. ఈ అవకాశం నిర్ణీత సమయంలో సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య పండగలో అందరూ భాగస్వాములుగా ఉండవలసిన అవసరం ఉంది.

– బి. సురేష్

ప్రెస్ అకాడమీ ఆర్కైవ్స్‌ను పునరుద్ధరించాలి

జర్నలిజంలో అధ్యయనాన్ని, పరిశోధనను సమన్వయపరచడానికి 1996లో ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ 2005 నాటికి కొన్ని లక్షల పేజీల వరకు అనేక రకాల పత్రికల ప్రతులను డిజిటలైజ్ చేసింది. ప్రెస్ అకాడమీ ఆర్కైవ్స్ వెబ్‌సైట్లో అనేక తెలుగు పత్రికల పాత ప్రతులు పరిశోధకులకు సులువుగా లభించేవి. అది పరిశోధకులకు కల్పతరువులా ఉపయోగపడేది. గతంలో ప్రభుత్వం మారిన కొంత కాలానికే ప్రెస్ అకాడమీ ఆర్కైవ్స్ వెబ్‌సైట్ రూపురేఖలు మారిపోయాయి. డిజిటలైజ్ చేసిన అన్ని పత్రికల ప్రతులు అందుబాటులో లేకుండా పోయాయి. క్రమంగా ప్రెస్ అకాడమీ ఆర్కైవ్స్ వెబ్‌సైట్ కనుమరుగైపోయింది. కుట్రపూరితంగా కావచ్చు, పొరపాటున కావచ్చు గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ తప్పును త్వరితగతిన సరిచేయాలి. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రెస్ అకాడమీ ఆర్కైవ్స్ వెబ్‌సైట్‌ను త్వరగా పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

– గౌరాబత్తిన కుమార్‌బాబు

ఉప ఎన్నిక అనవసర ఖర్చుకు బాధ్యులెవరు?

వివిధ స్థాయి ఎన్నికల్లో ముఖ్యంగా లోకసభ, అసెంబ్లీ స్థానాల్లో ఒక అభ్యర్థి ఒకటికి మించి స్థానాల్లో పోటీచేయడం ప్రజలపై అనవసర వ్యయాన్ని రుద్దడమే కాగలదు. అభ్యర్థుల్లో ఎక్కువగా అగ్రస్థాయి నాయకులే తమ గెలుపుపై నమ్మకం లేకనే వారు రెండు స్థానాల నుంచి పోటీచేస్తున్నారు. రెండుచోట్లా పోటీచేసి గెలిస్తే ఒక స్థానాన్ని మాత్రమే అట్టేపెట్టుకుని మరోదానికి రాజీనామా చేయాలి. అక్కడ ఆరునెలల్లోపు ఉపఎన్నిక నిర్వహించాలి. అంటే, నాయకులు–అభ్యర్థుల సౌకర్యం, గెలుపుకోసమే ప్రజలనెత్తిన అనవసర వ్యయాన్ని రుద్దుతున్నారనేది వాస్తవం. ధనమే కాకుండా అధికారోద్యోగుల, ప్రజల విలువైన కాలం కూడా నష్టపోతున్నారనేది నిజం. రాహుల్ గాంధీ మొన్నటి సాధారణ లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ నుంచీ, యూపీలోని రాయ్‌బరేలి నుంచీ పోటీచేసి రెండుచోట్లా గెలిచాక కేరళలోని వయనాడ్ స్థానాన్ని వదిలేసుకున్నారు. ఆ స్థానానికి ఇప్పుడు ఉపఎన్నిక జరుగుతోంది. అంటే, రాహుల్‌గాంధీ గెలుపు–ఓటమి భయానికి దేశప్రజలు అనవసర ఉపఎన్నిక వ్యయాన్ని భరించాల్సి వచ్చింది. అదే రాహుల్‌గాంధీ రెండు లోక్‌సభ స్థానాల నుంచీ కాకుండా ఏదో ఒక స్థానం నుంచే పోటీ చేసి ఉంటే ఈనాడు ఈ అనవసర ఉపఎన్నిక వ్యయం తప్పేదికదా. ఈ అనవసర ఖర్చుకు బాధ్యులెవరు, ప్రజలెందుకు భరించాలి?

– వీరుభొట్ల పేరయ్యశాస్త్రి

సార్థక సమ్మిళిత వృద్ధి ఏదీ?

సమ్మిళిత అభివృద్ధి (ఇన్‌క్లూజివ్ గ్రోత్) అనే భావన ఉదార ఆర్థిక విధానాలు మొదలయ్యాక ప్రాచుర్యంలోకి వచ్చింది. గ్లోబలైజేషన్ కారణంగా, దేశంలో ఆర్థిక సంస్కరణలు వేగం పుంజుకున్నాక పెరిగిన ఆర్థిక అంతరాలను తగ్గించే క్రమంలో సమ్మిళిత అభివృద్ధి మార్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించడం అనివార్యమైంది.

అసలు సమ్మిళిత అభివృద్ధికి నిర్వచనం ఏమిటి? అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడమే సమ్మిళిత అభివృద్ధిగా భావించాలా? అభివృద్ధిలో ఏ ఒక్క వర్గాన్నీ విస్మరించకపోవడమే సమ్మిళిత అభివృద్ధి అవుతుంది. నిజానికి సమ్మిళిత అభివృద్ధి అనే భావన కొత్తదేమీకాదు. మన రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలోనే ఈ భావన ఉంది. దేశ సంపద ఏ కొన్ని వర్గాలకో పరిమితం కారాదని, కొండకోనల్లో, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలు సైతం ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని, ఆందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది.

ఏటా ఏడు శాతం ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న భారతదేశంలో సమ్మిళిత అభివృద్ధి ఏవిధంగా ఉన్నదో చెప్పడానికి ఇటీవల దేశ సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని, కొన్ని రాష్ట్రాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల్ని ఉటంకించాలి. దీనికంటే ముందు ఆ కేసు పూర్వాపరాలను చూద్దాం.

యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి భారత్‌పైన అత్యంత దారుణమైన ప్రభావం చూపడాన్ని ఏ ఒక్కరూ మర్చిపోలేరు. పీడకల లాంటి ఆ విపత్కర సమయంలో దేశంలో వలస కార్మికులు పడిన కష్టాలు, కడగండ్లు అందరి గుండెల్ని పిండేశాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో వలస కార్మికులు తమ పిల్లాపాపలతో, వృద్ధులతో, ఆకలిదప్పులతో మండుటెండల్లో వందల కిలోమీటర్లు నడుచుకొంటూ స్వస్థలాలకు పయనమైన సందర్భాలలో వారు అనుభవించిన వేదన మన వర్తమాన చరిత్రలో ఓ చీకటి అధ్యాయం. దేశంలో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వివిధ రకాల పనులు చేసే నిమిత్తం వలసపోయే కార్మికుల సంఖ్య దాదాపు 14 కోట్లు. వీరు తమ శ్రమశక్తితో దేశ స్థూల ఉత్పత్తికి 10 శాతం వాటా అందిస్తున్నారు. కానీ, స్థిర నివాసం లేని కారణంగా వలస కార్మికులకు రేషన్ కార్డులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేయడం లేదు.

అటువంటి పూర్వరంగంలోనే వలస కార్మికుల సమస్యలు, కష్టాలపై సుమోటో కేసును విచారించిన ముగ్గురు న్యాయమూర్తుల సుప్రీం ధర్మాసనం జూన్ 29, 2021న ఓ చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. దేశవ్యాప్తంగా ఉన్న అసంఘటితరంగ కార్మికులు, వలస కూలీల వివరాల నమోదు ప్రక్రియ చేపట్టి ఆరు నెలల్లో పూర్తి చేయాలని కేంద్ర కార్మిక శాఖను ఆదేశించింది. ఇందుకుగాను 'నేషనల్ డేటా బేస్ పోర్టల్' ఏర్పాటు చేయాలని, వలస కార్మికులకు రేషన్ సరుకుల పంపిణీకిగాను రాష్ట్రాలు తగిన పథకాలు రూపొందించాలని, ఆ మేరకు కేంద్రం అదనపు ఆహార ధాన్యాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అందజేయాలని స్పష్టం చేసింది. జూలై 31, 2021 నాటికల్లా ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునే 'ఒకే దేశం–ఒకే రేషన్ కార్డు' విధానాన్ని అమలు చేయాలని, కరోనా కొనసాగినంతకాలం వలస కార్మికులు ఉన్నచోట రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక వంటశాలలు (కమ్యూనిటీ కిచెన్స్) నిర్వహించి ఆహారం అందించాలని ధర్మాసనం తన 80 పేజీల తీర్పులో ఆనాడు స్పష్టం చేసింది.

సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువడి ఇప్పటికీ మూడు సంవత్సరాలు దాటింది. అయినా వలస కార్మికులకు రేషన్ కార్డుల పంపిణీ ఇంకా మొదలే కాలేదు. ఈ అసాధారణ జాప్యం సహజంగానే సర్వోన్నత న్యాయస్థానానికి ఆగ్రహం తెప్పించింది. వలస కార్మికులకు రేషన్‌కార్డుల జారీలో చిత్తశుద్ధి చూపని కేంద్రం, కొన్ని రాష్ట్రాలు తమకు తగిన సమయం కావాలంటూ గడువుల మీద గడువులు కోరుతూ వస్తున్నాయి. అయితే అక్టోబర్ 4, 2024న ఈ కేసును విచారించిన జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అసనుద్దీన్‌ల బెంచ్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'ఓపిక పట్టడం అన్నది గొప్ప సుగుణమే కావొచ్చు. కానీ మా ఓపిక తుది దశకు చేరుకొంది. నవంబర్ 19, 2024 మీకు చివరి గడువు. ఈలోగా వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయండి' అని ఇద్దరు న్యాయమూర్తుల సుప్రీం ధర్మాసనం కేంద్రాన్ని, రాష్ట్రాలను తీవ్ర స్వరంతో హెచ్చరించింది.

చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మళ్లీ అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి నిరుపేదల పాలిట కల్పతరువుగా మారింది. వలస కార్మికులకు, సంచార జాతుల వారికి రేషన్ కార్డులు అందించేవరకు ఈ క్యాంటీన్లు వాళ్ల కడుపు నింపుతాయి. అన్న క్యాంటీన్ వంటి పథకాన్ని నిజానికి కేంద్ర ప్రభుత్వమే దేశవ్యాప్తంగా అమలు చేయాలి. ఎందుకంటే కోట్లాది శ్రామికులు ఆకలితోనో, అర్ధాకలితోనో అలమటిస్తుంటే, అభివృద్ధి గురించి, భవిష్యత్ గురించి మాట్లాడటం ఆత్మవంచనే అవుతుంది.




భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో, ఇతర చోట్ల ముక్కిపోతున్న, ఎలుకలు తినేస్తున్న తిండి గింజలను చూసుకొని దేశ ఆహార భద్రత బేషుగ్గా ఉందని జబ్బలు చరుచుకొంటున్న పాలకుల కళ్లు తెరిపిస్తూ.. 'అవి మిగులు తిండి గింజలు కాదురా బాబూ! వాటిని ఆకలి గింజలని పిలవాలి.. దేశంలో ప్రజలందరూ రెండు పూటలా కడుపు నిండా తిన్నాక మిగిలిన వాటినే మిగులు గింజలనాలి' అని నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ చెప్పాక, అదేవిధంగా సుప్రీంకోర్టు కూడా గోడౌన్లలో ఉన్న ఆహార ధాన్యాలను సక్రమంగా వినియోగించమని అక్షింతలు వేశాకనే అప్పటి కేంద్ర ప్రభుత్వం 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి' శ్రీకారం చుట్టింది. తద్వారా ఉపాధి కూలీలకు వ్యవసాయేతర సీజన్‌లో తిండి తినడానికి అవకాశం ఏర్పడింది.

అయితే, దేశంలో ఇప్పటికీ రేషన్ లభించని అభాగ్యులు ఇంకా కోట్ల సంఖ్యలో ఉన్నారు. వలస కార్మికులతో పాటు సంచార జాతుల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదు. వలస కార్మికులు కనీసం ఏదో ఒక ప్రదేశంలో కొన్ని నెలలపాటు నివాసం ఉంటారు. కానీ, సంచార జాతుల వారి పరిస్థితి మరీ దారుణం. వారు మానవ సమూహాలకు దూరంగా అక్కడక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పరచుకొని జీవిస్తుంటారు. వీరెవరికి రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు ఇవ్వడం లేదు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఎం.ఎస్ శ్రీనివాసన్ చెప్పినట్లు.. వీరి గుడిసెల్లోకి, టెంటుల్లోకి ఇంకా ప్రజాస్వామ్యం ప్రవేశించలేదు.

దేశంలో దాదాపుగా ప్రతి పట్టణంలో భవన నిర్మాణ కూలీలు, యాచకులు, పారిశుద్ధ్య కార్మికులు.. రోడ్లవెంట అద్దాలు, దువ్వెనలు, రంగురాళ్లు, ప్లాస్టిక్ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు అమ్మేవాళ్లు వందలు, వేల సంఖ్యలో కనిపిస్తుంటారు. అందులో అత్యధికులకు రేషన్ కార్డులు ఉండవు. ఒకవేళ ఉన్నా, ఒకేసారి రేషన్ తెచ్చుకొనే ఆర్థిక స్థోమత వారికి ఉండదు. అటువంటి వారికి నామమాత్రపు ధరలతో కడుపునిండా భోజనం పెట్టడానికి క్యాంటీన్లు తెరవటం ప్రభుత్వాల బాధ్యత. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అన్న క్యాంటీన్లు' ప్రవేశపెట్టి పేదలను అక్షయపాత్రలా ఆదుకొంటోంది.

నిజానికి కరోనా సమయంలోనే వలస కార్మికులకు, నిరుపేదలకు కమ్యూనిటీ కిచెన్స్ ప్రారంభించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటికే తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు, తెలంగాణలో అన్నపూర్ణ క్యాంటీన్లు నడుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2019 ముందు వరకు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం దాదాపు 100 పట్టణాల్లో అన్న క్యాంటీన్లు నిర్వహించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్షతో అన్న క్యాంటీన్లను మూత వేయించింది. కరోనా సమయంలో కూడా వాటిని పునరుద్ధరించలేదు. నిరుపేదల కడుపులు నింపలేదు. ప్రస్తుతం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ క్యాంటీన్లను పునరుద్ధరించి నిరుపేదల పాలిట కల్పతరువుగా మారింది. వలస కార్మికులకు, సంచార జాతుల వారికి రేషన్ కార్డులు అందించేవరకు ఈ క్యాంటీన్లు వాళ్ల కడుపు నింపుతాయి.. అన్న క్యాంటీన్ వంటి పథకాన్ని నిజానికి కేంద్ర ప్రభుత్వమే దేశవ్యాప్తంగా అమలు చేయాలి. ఎందుకంటే కోట్లాది శ్రామికులు ఆకలితోనో, అర్ధాకలితోనో అలమటిస్తుంటే, అభివృద్ధి గురించి, భవిష్యత్ గురించి మాట్లాడటం ఆత్మవంచనే అవుతుంది. అంతేకాదు.. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల్ని ఖాతరు చేయకపోవడం, రేషన్ కార్డుల జారీలో మితిమీరిన జాప్యం చేయడం దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పేదల కోసం గరీబ్ కల్యాణ్ రోజ్‌గార్ అభియాన్, ఆత్మనిర్భర్ భారత్, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన తదితర పథకాలను అమలు చేస్తూ ఉండొచ్చు. కానీ, వలస కార్మికుల్ని, సంచార జాతుల వారిని.. ముఖ్యంగా పౌర సమాజానికి వెలుపల జీవిస్తూ ఎటువంటి గుర్తింపు, అస్తిత్వం లేకుండా సుస్థిర స్వయం ప్రతిపత్తి పొందే అవకాశం లేకుండా.. జాతి సంపదలో ఎటువంటి వాటా పొందటానికి నోచుకోకుండా జీవిస్తున్న వీరందర్నీ జాతీయ జీవన స్రవంతిలోకి తేవాలి. వారికి రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు, ఎన్నికల ఓటింగ్ కార్డులు మొదలైనవి అందించడం ద్వారా వారికున్న హక్కులను పరిరక్షించి వారందరినీ ప్రజాస్వామ్య పరిధిలోకి తీసుకురావాలి. అప్పుడే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే సమ్మిళిత అభివృద్ధికి నిజమైన అర్థం లభిస్తుంది.

■ సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు





ఆగ్రాకు దగ్గరలో మురళీకృష్ణ పాదయాత్ర

అవిశ్రాంత యాత్ర

71 ఏళ్ల వయసులో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి సాహసం

పెన్షన్‌దారుల సమస్యలు తీర్చాలంటూ ఢిల్లీకి పాదయాత్ర

- సెప్టెంబరు 10న విజయవాడ నుంచి మొదలు
- ఈపీఎస్ పెంచాలంటూ ఇండియా గేట్ వద్ద నిరసన
- పీఎఫ్ ఆఫీసుతో పాటు ప్రధాని కార్యాలయంలో వినతి
- ఇంట్లో చెప్పకుండానే వెళ్లొచ్చా.. : మురళీకృష్ణ

ఏడు పదుల వయసులోనూ ఆయన ఏమాత్రం వెనకడుగు వేయలేదు. విశ్రాంత ఉద్యోగి అయినా అవిశ్రాంత పోరులో ముందడుగే వేశారు. ఆర్టీసీలో లక్షలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు పెన్షన్‌దారుల సమస్యలను తీర్చాలంటూ ఒకటి కాదు.. రెండు కాదు.. వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. సెప్టెంబరు 10న నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి పాదయాత్ర ప్రారంభించి ఢిల్లీకి చేరారు. ఇండియా గేట్ వద్ద నిరసన తెలియజేశారు. పీఎఫ్ ఆఫీసుతో పాటు ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించి.. ఇటీవల పాదయాత్రను పూర్తిచేసుకుని నగరానికి వచ్చిన లోకాల మురళీకృష్ణ తన అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

6లో



దేదీప్యం

దీపావళి సంబరాలు ఇంద్రకీలాద్రిపై ఘనంగా జరిగాయి. రంగురంగుల బాణసంచా వెలుగుల నడుమ రాజగోపురం మరింత శోభాయమానంగా ప్రకాశించింది.

నేటి నుంచి కార్తీక వేడుకలు 6లో **రేపు గాజుల అలంకారం**

సిటీమార్

నగరంలో మోతమోగిన దీపావళి

- గత ఏడాది కంటే ఘనంగా శబ్ద, గాలి కాలుష్యం
- సత్యనారాయణపురంలో 'మోతా'దుకు మించి..
- గత ఏడాది కంటే 37 డెసిబుల్స్ అధికం
- నగరంలోని కీలక ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి
- భారీగా పెరిగిన గాల్లో ధూళికణాల స్థాయి
- ప్రమాదకరమంటున్న పర్యావరణవేత్తలు

దీపావళి పండుగంటే.. టపాసుల వేడుక అనుకుంటాం.. వేలకు వేలు ఖర్చుచేసి కొనేస్తాం.. ఫుల్ టూ బిందాస్‌గా మోత మోగించేస్తాం.. కానీ, సరదాకు మనం చేసే ఈ శబ్దాల వెనుక అంతులేని అనారోగ్యం దాగి ఉంటుందని ఆలోచించం. మనం కాల్చగా వదిలేసిన దుమ్ము ధూళి కణాలు ప్రాణకారకాలని గుర్తించం. ఇలాంటి ప్రమాదాల నుంచి బయటపడటానికి పర్యావరణ హిత వేడుకలు జరుపుకోవాలని, కాలుష్యరహితంగా సంబరాలు చేసుకోవాలని పర్యావరణ వేత్తలు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు హెచ్చరిస్తున్నా ఈ దీపావళి కూడా గత ఏడాది కంటే ఘనంగానే మోత మోగింది.



సత్యనారాయణపురంలో పరిస్థితి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ఒక్కరోజులో ధ్వని, గాలి కాలుష్యం ప్రమాద ఘంటికలను మోగించాయి. సత్యనారాయణపురంలో అత్యధికంగా ధ్వనికాలుష్యం నమోదైంది. ఇక్కడ 102 డెసిబుల్స్ శబ్దం రికార్డైంది. అలాగే, నగరం మొత్తంమీద పీఎం 10 ధూళికణాల స్థాయి 115 మైక్రాన్లకు, పీఎం 2.5 ధూళికణాల స్థాయి 49 మైక్రాన్లుగా నమోదైంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రెండు విధాలుగా ధ్వని, గాలికాలుష్య లెక్కలను నమోదు చేస్తారు. ఈ నిబంధనల ప్రకారం ధ్వనికాలుష్యం పగటిపూట 65, రాత్రిపూట 55 డెసిబుల్స్ ఉండాలి. సత్యనారాయణపురం వీఎంసీ సర్కిల్-2 కార్యాలయ ప్రాంతంలో పగటిపూట 79, రాత్రిపూట 102 డెసిబుల్స్ నమోదైంది. గత ఏడాది ఇక్కడ 65 డెసిబుల్స్ రికార్డైంది. ఒక్క ఏడాదిలో 37 డెసిబుల్స్ పెరిగిందన్నమాట. ఇక ఆలిండియా రేడియో స్టేషన్ వద్ద శబ్ద కాలుష్యం గత ఏడాది కంటే ఈసారి ఒక డెసిబుల్ పెరిగింది. ఇక్కడ పగటిపూట 62, రాత్రిపూట 65 డిసిబుల్స్‌గా నమోదైంది. గత ఏడాది దీపావళికి ఇక్కడ 64 డెసిబుల్స్ రికార్డైంది. అలాగే, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ వద్ద 10 డెసిబుల్స్ కాలుష్యం పెరిగింది. గత ఏడాది ఇక్కడ 64 డెసిబుల్స్ నమోదు కాగా, తాజాగా 77 డెసిబుల్స్‌గా రికార్డైంది. ఇక్కడ పగటి పూట 72 డెసిబుల్స్ నమోదైంది. ఆంధ్రా లయోలా కళాశాల వద్ద మధ్యాహ్నం 12 గంటలకు 66 డెసిబుల్స్ ఉన్న శబ్ద కాలుష్యం రాత్రికి 72 డెసిబుల్స్‌కు చేరింది. గత ఏడాది ఇక్కడ 54 డెసిబుల్స్ ఉంది. జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద పగటిపూట 67, రాత్రిపూట 74 డెసిబుల్స్ రికార్డైంది. గత ఏడాది ఇక్కడ 61 డెసిబుల్స్ ఉంది.

పెరుగుతున్న గాలి కాలుష్యం

నగరంలో గాలి కాలుష్యం పెరుగుతోంది. గాల్లో మైక్రోటోన్, ఓజోన్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, బెంజిన్, లెడ్ వంటి 12 రకాల కణాలు ఉంటాయి. నగరంలో ఇవన్నీ సాధారణ స్థాయిని దాటిపోతున్నాయని తేలింది. గాల్లో పీఎం 10 విలువ 100 మైక్రాన్లలోపు ఉండాలి. అది ఇప్పుడు 115 మైక్రాన్లకు పెరిగింది. అదే పీఎం 2.5 విలువ గాల్లో 60 మైక్రాన్లలోపు ఉండాలి. దాని సరాసరి ఇప్పుడు 49 మైక్రాన్లుగా రికార్డైంది. పీఎం 10 కేటగిరీలో ఎన్ఏఎంపీ 143, సీఏఏక్యూఎంఎస్ 87, సీఏఏక్యూఎంస్ పీక్స్ 268గా రికార్డైంది. అదే పీఎం 2.5 ఎన్ఏఎంపీ 53, సీఏఏక్యూఎంఎస్ 46, సీఏఏక్యూఎంఎస్ పీక్స్ 140గా రికార్డైంది. దీని ప్రభావం నగరవాసులపై తీవ్రంగా పడుతోంది. మున్ముందు పీఎం స్థాయిల పెరుగుదల ప్రజల ఆరోగ్యానికి సవాల్

మిగతా 6లో..

దీపం వెలుగులు

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం

ఎన్టీఆర్‌లో 4,96,000, కృష్ణాలో 4 లక్షల మంది లబ్ధిదారులు



పటమటలో దీపం పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఇన్‌చార్జి కలెక్టర్ నిధిమీనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం) : ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఎన్టీఆర్ జిల్లాలో 4,96,000 మంది, కృష్ణాజిల్లాలో 4,00,000 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. ప్రస్తుతం రూ.15 సబ్సిడీ ఎవరికి అందుతుందో వారిని అర్హులుగా పేర్కొంటున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారంతా ఈ పథకానికి ఎంపికయ్యారు. కాగా, ప్రభుత్వం ఇప్పటికే ఆయిల్ కంపెనీలకు డబ్బు జమ చేసింది. ఆయిల్ కంపెనీలు సబ్సిడీని ఏ విధంగా డీబీటీ విధానంలో అందిస్తున్నాయో.. అలాగే, ఉచిత గ్యాస్ సిలిండర్ల డబ్బును కూడా జమ చేస్తారు. ప్రస్తుతం బుక్ చేసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉన్నా.. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముంది. అర్హత సాధించిన వారందరికీ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రతి మూడు నెలలకోసారి సిలిండర్ బుక్ చేసుకోగానే, ఆటోమేటిక్‌గా గ్యాస్ ధర నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా గ్యాస్ కంపెనీల వద్దకు ఆధార్ తీసుకెళ్లడం, ఈకేవైసీ చేసుకోవడం వంటివి అవసరం లేదు. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఎంపికైనట్టు వారి మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వచ్చాయి. వీటిప్రకారం నిర్దేశించిన మూడు నెలల్లో ఎప్పుడు బుక్ చేసుకున్నా డబ్బు అకౌంట్‌లో జమ అవుతుంది. ప్రతి మూడు నెలలకోసారి ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు.

కోడెదూడకు కృత్రిమ కాలు

- మానవత్వం చాటుకున్న యజమాని
- పాలకొల్లులో 30 గంటల్లోనే కాలు తయారు



మోపిదేవి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తన ఇంట మూడు కాళ్లతో పుట్టిన కోడె దూడ బాధను చూడలేకపోయాడు ఆ యజమాని. ఎలాగైనా దానిని ఇతర దూడలతో సమానంగా నడిపించాలని కంకణం కట్టుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వేదాంతం సదాశివమూర్తి మనుషులకే కాదు మూగజీవాలకు కూడా కృత్రిమ అవయవాలు అమర్చి మానవత్వం చాటుకుంటున్నారని తెలిసి.. అక్కడ తన దూడకు కృత్రిమ కాలు తయారు చేయించాడు ఆ యజమాని. వివరాల్లోకి వెళితే.. స్వతహాగా గోపాలమిత్ర అయిన మోపిదేవి మండలంలోని కె.కొత్త పాలేనికి చెందిన మత్తి శ్రీనివాసరావు ఇంట్లో ఆరు నెలల క్రితం కపిల ఆవుకు మూడు కాళ్లతో కోడె దూడ జన్మించింది. నడవడానికి అది పడుతున్న బాధను చూడ లేకపోతున్న శ్రీనివాసరావు.. పది రోజుల క్రితం మోపిదేవి పశువైద్యాధికారి నందకిశోర్‌ను సంప్రదించాడు. దాంతో ఆయన తన స్నేహితుడు, పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న మరో పశువైద్యాధికారిని సంప్రదించగా.. ఆయన వేదాంతం సదాశివమూర్తి నిర్వహిస్తున్న చైతన్య కృత్రిమ అవయవ కేంద్రం గురించి చెప్పారు. అక్కడ మనుషులకే కాకుండా పశువులకు కూడా కృత్రిమ అవయవాలు తయారు చేసి ఇస్తారని వివరించారు. దీంతో శ్రీనివాసరావు దూడను ఆటోలో పాలకొల్లుకు తీసుకెళ్లగా, దానిని పరిశీలించిన సదాశివమూర్తి 30 గంటల్లోనే దూడకు సరిపోయే కృత్రిమ కాలును తయారుచేసి అమర్చారు. ప్రస్తుతం దూడ నడుస్తూ చలాకీగా ఉండటంతో యజమాని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

పండుగలో విషాదం

రెండు జిల్లాల్లో వేర్వేరు ప్రమాదాలు..

ఆరుగురు దుర్మరణం

- జి.కొండూరు-చెవుటూరు బైపాస్ వద్ద ఘోరం
- 13 మంది కూలీలతో వెళ్తున్న ట్రక్ ఆటోను ఢీకొన్న లారీ
- ముగ్గురు మృతి.. పదిమందికి గాయాలు
- కొండాయపాలెం వద్ద కాల్వలోకి దూసుకెళ్లిన కారు
- ఊపిరాడక ఇద్దరు జలసమాధి
- కురుమద్దాలి వద్ద కారు అదుపుతప్పి వ్యక్తి మృతి



జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదంలో నుజ్జయిన ట్రక్ ఆటో

పండుగ పూట జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి. రెండు జిల్లాల్లో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం ఆరుగురు మృతిచెందారు.

జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. పనుల కోసం నెల్లూరు జిల్లాకు వెళ్లిన 13 మంది.. కుటుంబంతో కలిసి దీపావళి జరుపుకోవాలని ట్రక్ ఆటోలో ఏ.కొండూరు మండలం రామచంద్రాపురానికి వస్తుండగా జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో కొనకళ్ల నాగరాజు (20), బొలగాని వెంకటేశ్వరరావు (28), ఉయ్యాల సాయికుమార్ (26) మరణించారు. పదిమందికి తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి ఇంకా విషమంగా ఉంది. పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిపై కొండాయపాలెం వద్ద జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. గుడివాడవైపు నుంచి దావులూరుకు వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పంటకాల్వలోకి దూసుకెళ్లింది. అక్కడే ఉన్న కూలీలు కారు అద్దాలు పగలగొట్టేసరికే గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడికి చెందిన చలసాని శివరామకృష్ణ (48), కంకిపాడు మండలం దావులూరు గ్రామానికి చెందిన తుమ్మల వేణుగోపాలకృష్ణ (41) ఊపిరి అందక చనిపోయారు. అలాగే, డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న భార్యను దీపావళికి ఇంటికి తీసుకొద్దామని గన్నవరం మండలం వీరపనేనిగూడేనికి చెందిన సింహాద్రి ప్రసాద్ (40) తన కారులో బయల్దేరగా, కురుమద్దాలి ఫ్లై ఓవర్ వద్దకు రాగానే కారు పంక్చరైంది. అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రసాద్ అక్కడికక్కడే చనిపోయారు.

4

రెవెన్యూ స్థలాన్వేషణ

- కొత్తూరు తాడేపల్లిలో 100 ఎకరాల పరిశీలన
- టిడ్కో ఇళ్ల కోసమా? ఎంఐజీ లే అవుట్ల కోసమా?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో గృహ నిర్మాణాల కోసం రెవెన్యూ యంత్రాంగం స్థలాన్వేషణ చేపట్టినట్టు తెలుస్తోంది. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో 100 ఎకరాల భూముల కోసం విజయవాడ ఆర్డీవో చైతన్య భూములు పరిశీలించడమే ఇందుకు కారణం. అయితే, ఈ భూములు దేనికోసమన్నది ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వలేదు. టిడ్కో ఇళ్ల నిర్మించుకోవడం కోసమా? సీఆర్‌డీఏ పరిధిలో ఎంఐజీ లే అవుట్ల కోసం తీసుకోవాలనుకుంటున్నారా? అనే విషయం తెలియరాలేదు. కాగా, వారం కిందటే కొత్తూరు తాడేపల్లిలోని పోలవరం కాల్వకు దిగువన గద్దె కాల్వ, పంప్‌హౌస్, కిచ్చాయిగుంట నుంచి కవులూరు రోడ్డు వరకు భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ విషయం తెలిసి దాదాపు 40 మందికిపైగా తమ భూములు ఇవ్వటానికి ఆసక్తి తెలిపారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు మెండం జమలయ్య, టీడీపీ రైతుసంఘం నాయకులు చింతా సుధాకర్, స్థానిక రైతులు పోతరాజు వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకట్రావు శుక్రవారం రూరల్ తహసీల్దార్ సుగుణను కలిశారు. గృహ నిర్మాణాల కోసం అక్కడి భూములు సరికావని వారంతా హితవు పలికారు. వర్షమొస్తే ఆ భూములు మునిగిపోతాయని చెప్పారు. పోలవరం ఎగువన మెట్ట భూములు ఉన్నాయని, మెరక తోలాల్సిన అవసరం లేదని, రైతులు కూడా భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. స్పందించిన తహసీల్దార్ సుగుణ.. విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రైతులు సూచించిన భూములను పరిశీలించాలని నిర్ణయించారు. రాత్రి సమయమైనా.. పోలవరం కాల్వ ఎగువన ఉన్న భూములను పరిశీలించారు.

92.81 శాతం పింఛన్ల పంపిణీ

- జిల్లావ్యాప్తంగా 2,15,289 మందికి రూ.90.85 కోట్లు అందజేత

6లో

ఈ నెల నుంచి బియ్యంతో పాటు జొన్నలు

- తప్పనిసరి కాదు..కార్డుదారులకు ఇష్టమైతేనే

6లో



షోకాజ్ నోటీసులు ఇస్తున్న కమిషనర్ బాపిరాజు

72 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించిన సచివాలయ కార్యదర్శులు72 మందికి మునిసిపల్ కమిషనర్ కె.బాపిరాజు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉదయం 5.30 నుంచే నగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందుకుగాను 394 మందిని నియమించారు. అయితే 72 మంది సకాలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరుకాలేదు. 6.30 గంటల వరకు 72 మంది పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో వారికి కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. శుక్రవారం నూరుశాతం పింఛన్ల పంపిణీ లక్ష్యం నెరవేరాల్సి ఉందని, అయితే క్షేత్రస్థాయిలో 5.30 గంటలకు హాజరుకాని సచివాలయ కార్యదర్శులకు కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీచేయడంతో నగరంలో సంచలనం రేకెత్తించింది. శుక్రవారం హెల్త్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు మరో హెల్త్ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడం, 72 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో కార్యాలయ ఉద్యోగులు ఎవరి సీట్లలో వారు కూర్చుని పనులు చేసే పరిస్థితి ఏర్పడింది.



అవనిగండ్లపాడు మునేటి ఇసుకరేవు నుంచి అక్రమంగా బయటకు వెళుతున్న ఇసుక లారీలను అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

అనిగండ్లపాడులో ఇసుక అక్రమ రవాణా!

» టిప్పర్లను అడ్డుకున్న రైతులు, టీడీపీ నేతలు

పెనుగంచిప్రోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మునేటి రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ అనిగండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ అత్తలూరి అచ్యుతరావు ఆధ్వర్యంలో రైతులు, నేతలు టిప్పర్లను అడ్డుకున్నారు. సేకరించిన సమాచారం మేరకు.. విజయవాడకు చెందిన కొంత మంది గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి పనులకు ప్రభుత్వ అనుమతితో అనిగండ్లపాడు మునేటి రేవు నుంచి ఇసుకను టిప్పర్లలో వస్తుండగా, రైతులు, టీడీపీ నేతలు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను అడ్డ పెట్టి టిప్పర్లను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అనిగండ్లపాడు శివాపురం గ్రామాల రక్షిత మంచినీటి సరఫరా పథకాలు ఉన్నాయని, ఇక్కడ ఇసుక యంత్రాలతో తోడితే పథకాలకు ఇబ్బంది కలగటంతో పాటు మునేటికి భారీగా వరదలు వచ్చినప్పుడు సమీపంలోని తమ పొలాలు ముంపునకు గురై లక్షల రూపాయలు అదనంగా ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రాలతో ఇసుక తోడకుండా కూలీలతో ట్రాక్టర్లు టిప్పర్లలో పోసుకుంటే తమకు ఇబ్బంది లేదని, అవకాశం ఉంటే ఇక్కడ రీచ్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని నేతలు, రైతులు అధికారులను కోరుతున్నారు. దీంతో ఎస్ఐ ఎంఎస్.కె.అర్జున అక్కడకు చేరుకొని రైతులు, నేతలతో మాట్లాడి శాంతింపజేశారు. తహసీల్దార్ శాంతి లక్ష్మీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు మూడు టిప్పర్లు ఎస్కవేటర్‌ను పోలీసులకు అప్పగించారు. ఇసుక టిప్పర్లకు ప్రభుత్వ అనుమతి ఉన్నందున పోలీసులు వదిలివేశారు. రీచ్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగకుండా ఎస్ఐ అర్జున, రెవెన్యూ అధికారుల సమక్షంలో పెద్ద గొయ్యి తవ్వించారు.

13న అరుణాచలానికి బస్సు యాత్ర

» శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌ల దర్శనం

విజయవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అరుణాచల క్షేత్రానికి టూర్ ప్యాకేజీ పూర్తి షెడ్యూల్‌ను శుక్రవారం ఆర్టీసీ ఆర్ఎం ఎంవై దానం విడుదల చేశారు. నవంబరు 13 రాత్రి 9 గంటలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుంది. 14 ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం స్వామిని దర్శనం చేసుకుని సాయంత్రం గోల్డెన్ టెంపుల్‌ను సందర్శిస్తారు. రాత్రికి అరుణాచలం చేరుకుంటారు. అరుణాచల గిరి ప్రదక్షిణ అనంతరం దర్శనం పూర్తికాగానే 15 సాయంత్రం తిరిగి బస్సు బయలుదేరుతుంది. 16వ తేదీ ఉదయం 5 గంటలకు విజయవాడ చేరుకుంటారు. యాత్రకు రాను, పోను కలిపి ఒకరికి రూ.2500 ధర నిర్ణయించినట్టు ఆర్ఎం తెలిపారు. బయట ఖర్చులు ఎవరికి వారే పెట్టుకోవాల్సి ఉంటుందని చెప్పారు. సర్వీసు నెంబర్ 95266 గల బస్సులో ఆన్‌లైన్ రిజర్వేషన్ విధానంలో బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 9959225446, 8074298487, 7382898942లో సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

రైతులు కొత్త వంగడాలు వాడాలి

» వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయంగా వాడుతున్న రకాలను కాకుండా, గత ఐదేళ్లలో కొత్తగా వచ్చిన రకాలను సాగుచేసి, అపరాలు, నూనెగింజల ఉత్పత్తిలో రైతులు స్వయం సమృద్ధి సాధించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు కోరారు. అలాగే తెగుళ్లు, పురుగుల నివారణకు నష్ట పరిమితిని గుర్తించి శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన మందులను సరైన పద్ధతిలో పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. రకరకాల మందుల మిశ్రమాన్ని వాడొద్దని హెచ్చరించారు. శుక్రవారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో రాష్ట్ర, జిల్లా వ్యవసాయ అధికారులు, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రబీసీజన్‌లో అపరాలు, నూనెగింజల సాగుపై వర్క్‌షాప్ నిర్వహించారు. రైతులు నూతన యాజమాన్య పద్ధతులు అనుసరించేలా అవగాహన కల్పించే అంశాలపై చర్చించారు.

పండుగకు ముందే.. తెల్లారిన బతుకులు!



బొలగాని వెంకటేశ్వరరావు, ఉయ్యాల సాయికుమార్, కొనకళ్ల నాగరాజు (ఫైల్ ఫొటోలు)

ఆరుగురు దుర్మరణం

వారంతా రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబాలకు చెందిన వారు. ఉన్న ఊరు విడిచి పొట్ట చేత పట్టుకొని కూలి పనుల నిమిత్తం ఇతర జిల్లాకు వెళ్లి 20 రోజులుగా పనులు చేసుకొని దీపావళి పండుగను కుటుంబసభ్యులతో కలిసి చేసుకునేందుకు ఎంతో సంతోషంగా ఇంటి ముఖం పట్టారు. అర్ధగంటలో ఎవరి ఇళ్లకు వారు వెళతారనగా.. అంతలోనే మృత్యువు ముగ్గురిని కబళించింది. మరో పదిమంది తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. ఈ విషాదఘటన ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలో జి.కొండూరు - చెవుటూరు బైపాస్ రోడ్డులో గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది.

జి.కొండూరు - చెవుటూరు బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

» లారీని ఢీకొన్న ట్రక్ ఆటో

» ముగ్గురు మృతి.. 10 మందికి గాయాలు

జి.కొండూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డులో గురువారం తెల్లవారుజాము 3.30 గంటలకు ట్రక్ ఆటో ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కూలీలు బొలగాని వెంకటేశ్వరరావు (మేస్త్రి) ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా పొదలిపురం గ్రామానికి బొప్పాయి కోత నిమిత్తం ఈనెల 11న వెళ్లారు. అక్కడే ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నారు. అక్టోబరు 31న దీపావళి పండుగను కుటుంబసభ్యులతో కలిసి జరుపుకునేందుకు 30 రాత్రి అశోక్ లేలాండ్ ట్రక్ ఆటోలో మొత్తం 13 మంది బయలుదేరారు. వీరి వాహనం జి.కొండూరు - చెవుటూరు బైపాస్‌లో చెవుటూరు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని వేగంగా ఢీ కొట్టింది. దీంతో ట్రక్ ఆటో క్యాబిన్‌పై నిద్రిస్తున్న కొనకళ్ల నాగరాజు (20) రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మేస్త్రి బొలగాని వెంకటేశ్వరరావు (28), డ్రైవింగ్ చేస్తున్న ఉయ్యాల సాయికుమార్ (26)లు విజయవాడలోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో పదిమందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన పుల్లారావు పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. బొలగాని వెంకటేశ్వరావుకు, ఉయ్యాల సాయికుమార్‌లకు వివాహాలు అయ్యాయి.

మృత్యువు నుంచి తప్పించుకోలేక..

పుల్లారు గ్రామానికి చెందిన నాగరాజు పొదలిపురం నుంచి వేరే వాహనంలో వచ్చి ఒంగోలు వద్ద మురా ప్రయాణించే వాహనంలో ఎక్కాడు. ఇతర వాహనంలో పుల్లారు వచ్చినా ప్రమాదం నుంచి తప్పించుకునే వాడేమో అని మృతుని బంధువులు మైలవరం ప్రభుత్వాసుపత్రిలో లబోదిబోమంటున్నారు. నాగరాజు మృతితో కుటుంబం దిక్కులేనిదయ్యింది. నాగరాజు తండ్రికి గతంలో ప్రమాదంలో కాలు తీసేశారు. చెల్లి, తమ్ముడు చదువుకు కూడా అతడే ఆధారం. నాగరాజు మృతితో కుటుంబసభ్యులు దిక్కులేని వారయ్యారు. పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

దీపావళి పండుగ వేళ వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందగా ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. పామర్రు-విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై కురుమద్దాలి ఫ్లైఓవర్ వంతెన సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిపై కొండాయపాలెం వద్ద పంట కాల్వలోకి కారుదూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు.

పామర్రు, నవంబరు 1: (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం వీరపనేనిగూడెంకు చెందిన సింహాద్రి ప్రసాద్(40)కు భార్య, ఇద్దరు పిల్లలు. కుటుంబసమేతంగా దీపావళి పండుగను అందరూ కలిసి ఘనంగా నిర్వహించుకునేందుకు మెగా డీఎస్సీ కోసం



పంటకాల్వలోకి దూసుకువెళ్లిన కారు, మృతులు చలసాని శివరామకృష్ణ, తుమ్మల వేణుగోపాల కృష్ణ



సింహాద్రి ప్రసాద్

శిక్షణ తీసుకుంటున్న భార్యను ఇంటికి తీసుకువెళ్లడానికి గురువారం కారులో బయలుదేరాడు. పామర్రు మండల పరిధిలోని కురుమద్దాలి ఫ్లై ఓవర్ సమీపిస్తుండగా టైరు పేలడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీపావళి వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

● గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడికి చెందిన చలసాని శివరామకృష్ణ (48), కంకిపాడు మండలం దావులూరు గ్రామానికి చెందిన తుమ్మల వేణుగోపాల కృష్ణ(41) కలిసి కారులో గురువారం గుడివాడలో బంధువులను కలిసేందుకు వచ్చారు. తిరిగి వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న కారు పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిపై కొండాయపాలెం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పంటకాల్వలోకి దూసుకెళ్లింది. సమీపంలో పొలం పనులు చేసుకుంటున్న కూలీలు కారు అద్దాలు పగలగొట్టి ఇద్దరినీ బయటకు తీసుకువచ్చినా ఫలితం లేకపోయింది. ఇద్దరూ ఊపిరి అందక మృతిచెందారు. గతంలో అమెరికాలో ఉన్న శివరామకృష్ణ ప్రస్తుతం భార్య, ఇరువురు పిల్లలతో పోరుగు ప్రాంతంలో నివాసముంటున్నాట్టు బంధువులు తెలిపారు. ఎస్సై సీహెచ్ అవినాశ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల జీవితాల్లో దీపం వెలుగులు

» ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసిన మంత్రి రవీంద్ర

» కృష్ణా జిల్లాలో 4 లక్షల మంది అర్హులు

మచిలీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పేదప్రజలకు అండగా ఉంటుందని రాష్ట్రగనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీపం-2 ఉచితగ్యాస్ సిలిండర్‌ల పంపిణీ జిల్లాస్థాయి కార్యక్రమం మచిలీపట్నం కార్పొరేషన్‌లోని 27వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 1999లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు దీపం పథకాన్ని ప్రవేశపెట్టి, పేదలందరికీ సబ్సిడీపై కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. కట్టెలపొయ్యితో మహిళలు సమస్యలతో ఇబ్బం



ఉచిత గ్యాస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

దులు పడుతున్నారని, సబ్సిడీపై గ్యాస్‌కనెక్షన్లను చంద్రబాబు అప్పట్లో ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికలసమయంలో మూడు ఉచిత గ్యాస్‌సిలిండర్‌ల హామీని నెరవేరుస్తున్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4లక్షలమందికి ఏడాదికి మూడుచొప్పున ఉచిత గ్యాస్‌సిలిండర్‌లు ఇవ్వనున్నట్టు తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదలచేసి 16,700 టీచర్‌పోస్టులను త్వరలో భర్తీచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనెల 9న ఎంఎస్ఎంఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాలులో ఉపాధిపథకాలకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, దీపం పథకాన్ని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్‌లను ఉచితంగా అందించడం పేదకుటుంబాలపై కొంతమేర ఆర్థికభారం తగ్గుతుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండిరామకృష్ణ మాట్లాడుతూ, పేదకుటుంబాలకు దీపం-2 పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డీఎస్‌వో వి.పార్వతి మాట్లాడుతూ, నియోకవర్గంలో 49,800 మంది ఉచితగ్యాస్ సిలిండర్‌ల లబ్ధిదారులను గుర్తించినట్టు తెలిపారు. మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు ఇలియాస్‌బాషా, సయ్యద్‌ఖాజా, గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, అజీమ్, ఆర్డీవో కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 27వ డివిజన్‌కు చెందిన మహ్మద్‌సుల్తానా ఇంటికి వెళ్లి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను అందించి స్టౌవ్‌ను మంత్రి కొల్లు రవీంద్ర వెలిగించారు.

అత్యంత పారదర్శకంగా దీపం -2 అమలు

» ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అత్యంత పారదర్శకంగా దీపం పథకం-2 అమలుకు చర్యలు తీసుకున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. దీపావళి కానుకగా దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పథకాన్ని పటమట 11వ డివిజన్ లలితా గ్యాస్ ఏజెన్సీ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జెండా ఊపి సిలిండర్‌ల డెలివరీ వ్యాన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 4.96లక్షల మంది వినియోగదారులు ఉన్నారని చెప్పారు. వీరంతా ఉచిత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎప్రిల్-జూలై, ఆగస్టు-నవంబర్, డిసెంబర్-మార్చి కాలానికి ఒక్కో సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు ఇస్తారని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేయాలన్నారు.

కూటమి ప్రభుత్వ హయాంలో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. సూపర్-6లో భాగంగా దీపం-2 పథకంలో గ్యాస్ బుక్ చేయడం



ఉచిత గ్యాస్ సిలెండర్‌ల డెలివరీ వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

తరువాత రోజే గ్యాస్ డెలివరీ ఇవ్వడం, ఆ రెండో రోజే సిలిండర్ డబ్బులు లబ్దిదారుల ఖాతాల్లో వేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ పథకానికి 2,684 కోట్ల రూపాయలను వెచ్చించిందన్నారు. పథకం అమలు తీరును ఆర్డీవో చైతన్య వివరించారు. అనంతరం డీఆర్డీఏ అధికారులతో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, కార్పొరేటర్‌లు ముమ్మనేని ప్రసాద్, సీహెచ్ ఉషారాణి, గ్యాస్ ఎజెన్సీ హెచ్‌పి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి సుందరీకరణకు సీఎస్ఆర్ నిధులు

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి సుందరీకరణకు సీఎస్ఆర్ నిధులను కేటాయించనున్నట్టు కలెక్టర్ బాలాజీ తెలిపారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంపై శుక్రవారం కలెక్టర్ చాంబరులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చల్లపల్లి డంపింగ్‌యార్డులో చెత్తనిల్వపై ఆరాతీశారు. చెత్త సేకరణ, డ్రైయిన్‌లు, పారిశుద్ధ్య నిర్వహణకోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తామని తెలిపారు. ఆకుమర్రు మంచినీటి పథకానికి సంబంధించి ఫిల్టర్‌బెడ్‌లు, మైక్రో ఫిల్టర్‌బెడ్‌లు ఏర్పాటు చేసేందుకు జిల్లా ఖనిజ నిధులతోపాటు, ఎంపీ ల్యాడ్స్‌ను సమకూరుస్తామని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నటరాజ్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుధాకర్, సీపీవో గణేష్ కృష్ణ, చల్లపల్లి ఎంపీడీవో ఆర్‌వీ రమణ, ఈవో మాధవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శగ్రామాలను గుర్తించండి

జిల్లాలో ఆదర్శ సౌరగ్రామాల ఏర్పాటుకు అర్హత ఉన్న గ్రామాలను గుర్తించాలని అధికారులను కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. సౌరశక్తిని ప్రోత్సాహించేందుకు 5 వేలకు పైబడి జనాభా ఉన్న ఐదు రెవెన్యూ గ్రామాలను వచ్చేసమావేశం నాటికి అధికారులు గుర్తించాలన్నారు. ఎంపికైన గ్రామానికి రూ.కోటి ఆర్థికసాయంగా కేంద్రప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యానందం, జడ్పీ సీఈవో కన్నమనాయుడు పాల్గొన్నారు.



అక్విడెక్ట్‌ను టీడీపీ నేతలతో కలిసి పరిశీలిస్తున్న మండలి బుద్ధప్రసాద్ (ఫైల్)

దివి జీవనాడికి మంచిరోజులు

» అక్విడెక్ట్ పరిరక్షణపై శ్రద్ధ చూపని వైసీపీ » ఐదు నెలల్లో నిధులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

(అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి) : దివి ప్రాంత ప్రజల జీవనాడి అయిన పులిగడ్డ అక్విడెక్ట్ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేలా 1936లో పులిగడ్డ అక్విడెక్ట్‌ను నిర్మించారు. ప్రతీ రెండేళ్లకొకసారి ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ యాక్షన్ ప్లాన్ కింద ప్రభుత్వం నిధులు విడుదల చేసి అక్విడెక్ట్ మరమ్మతు పనులు నిర్వహిస్తూ వస్తోంది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్విడెక్ట్‌ను పూర్తిగా గాలికి వదిలేయటంతో దాని మనుగడపై స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.54 లక్షలు నిధులు విడుదల చేసిన వైసీపీ ప్రభుత్వం పనులు పూర్తి చేయకుండానే బిల్లులు చేసుకునే ప్రయత్నం చేయటంతో అప్పటి ప్రతిపక్ష టీడీపీ నేతలు మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే అక్విడెక్ట్‌కు పూర్వవైభవం తెస్తామని హామీ ఇచ్చారు.

ఐదేళ్లలో జరిగిందేమీ లేదు..

వైసీపీ 2019లో అధికారం చేపట్టిన నాటి నుంచి పులిగడ్డ అక్విడెక్ట్ మరమ్మతులపై ఏలాంటి శ్రద్ధ చూపలేదు. దీంతో వరుస వరదల తాకిడికి అక్విడెక్ట్ మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడింది. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. చాంబర్స్ పనిని పూర్తిగా పక్కనపెట్టారు. అక్విడెక్ట్ పొడవునా జాయింట్ ఫిల్లింగ్ కూడా తూతూ మంత్రంగా చేపట్టారు. వరదల కారణంగా అక్విడెక్ట్‌పై ఒత్తిడి పెరిగి యాంకర్ బోల్టు చాంబర్లు పూర్తిగా దెబ్బతినటమే కాక అక్విడెక్ట్ పొడవునా జాయింట్లన్ని లీకయ్యే పరిస్థితి ఏర్పడింది. పనులు పూర్తి కాకుండానే నిధులు కాజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ ఉద్యమాన్ని చేపట్టడంతో అధికారులు అప్పటివరకు చెల్లించిన పార్ట్ బిల్లులు మినహా మిగిలిన బిల్లులు నిలుపుదల చేసింది.

టీడీపీ పోరాటాల ప్రతిఫలం..

దివి ప్రాంతంలోని దాదాపు 72 వేలఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల ప్రజలకు సాగునీటి అవసరాలను తీర్చే పులిగడ్డ అక్విడెక్ట్ పరిరక్షణకు టీడీపీ పోరాటాల ఫలితం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లభించింది. ఇరిగేషన్ శాఖ ఆగస్టు మొదటి వారంలో పంపిన ప్రతిపాదనలు పరిపాలనామోదం పొందాయి. అక్విడెక్ట్ పొడవునా గ్యాప్ ఫిల్లింగ్‌కు యాంకర్ బోల్టులను కాపాడే చాంబర్ల నిర్వహణ కోసం, శిథిలావస్థకు చేరిన రెయిలింగ్ బాగుచేసేందుకు ఇరిగేషన్ శాఖ రూ.1.10 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. దీనిపై ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.


పర్యాటకంగానూ అభివృద్ధి చేస్తాం

- మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే

గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా అక్విడెక్ట్ మనుగడ ప్రమాదంలో పడింది. నాటి టీడీపీ పోరాటాలకు ఎట్టకేలకు ప్రతిఫలం లభించింది. రూ.1.10 కోట్ల నిధులతో అక్విడెక్ట్‌కు అత్యవసరమైన మరమ్మతులన్ని పూర్తిచేయడంతో పాటు ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. భవిష్యత్‌లో అక్విడెక్ట్‌ను సుదీర్ఘకాలం పాటు అక్విడెక్ట్ పరిరక్షణకు వెసులుబాటు కలుగుతుంది.

త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం

- పులిగడ్డ వెంకటేశ్వరరావు, డీఈ ఇరిగేషన్ శాఖ



అక్విడెక్ట్ పరిరక్షణ కోసం ప్రభుత్వం రూ.1.10 కోట్లు విడుదల చేస్తూ పరిపాలనామోదం తెలిపింది. తొందరలోనే టెండర్లు పిలిచి అక్విడెక్ట్ మరమ్మతుపనులను నాణ్యతతో రాజీ పడకుండా చేపట్టి పూర్తిచేస్తాం. ఇప్పటికే సుందరీకరణ పనులను ప్రారంభించాం. టెండర్లు పూర్తయిన తర్వాత ఆక్విడెక్ట్ పొడవునా సుందరంగా తీర్చిదిద్దుతాము.

నగరంలో దొంగలు పడ్డారు!

» ఖరీదైన వాహనాల చోరీ

» బ్యాంక్‌లో చోరీకి యత్నం

» సీసీ కెమెరాల్లో చిక్కిన చిత్రాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గొల్లపూడి కాంప్లెక్స్‌లో ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం అర్థరాత్రి దుండగులు చోరీకి ప్రయత్నించారు. వెనుక వైపున ఉన్న కిటికీ గ్రిల్స్ తొలగించి లోపలకు ప్రవేశించాడు. లాకర్లలోకి వెళ్లడానికి బయట పెద్ద ద్వారం తాళాలు పగలుగొట్టే ప్రయత్నం చేశారు. రెండ్రోజుల క్రితం అయ్యప్పనగర్‌లో నేతాజీ రోడ్డులో ఇద్దరు దొంగలు ద్విచక్రవాహనం చోరీకి ప్రయత్నించారు. డిక్కీలో ఉన్న వస్తువులను కాజేశారు. కృష్ణలంకలో ఇటీవల ఇంటి బయట నిలిపి ఉన్న బుల్లెట్‌ను దొంగలు మాయం చేశారు. విజయవాడలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రాత్రివేళల్లో గ్యాంగ్‌లు సంచరిస్తు బైక్‌లు, స్కూటర్ల చోరీలకు దిగుతున్నారు. బ్యాంక్ దోపిడీలకు యత్నిస్తున్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ బీట్ విధానం, స్టేషన్ల పరిధిలో సిబ్బందికి నిత్యం బీట్లు అన్నీ జియో ఫెన్సింగ్ ఉంటుంది. బెదిరింపు కాల్స్ నేపథ్యంలో పోలీసులు కొద్దిరోజులుగా విస్తృత సోదాలు నిర్వహిస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ దొంగలు చేతివాటం చూపిస్తున్నారు.

ఎవరీ నేరగాళ్లు..!

చోరీలకు యత్నిస్తున్న గ్యాంగ్ ఎక్కడిదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. స్థానికంగా నేరచరిత్ర ఉన్న వాళ్లా, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాళ్లా అన్నది నిర్ధారణ కావడం లేదు. చోరీలకు యత్నించిన వారిలో కొంత మంది సీసీ కెమెరాలకు చిక్కారు. మూడు రోజుల క్రితం సీసీఎస్ పోలీసులు ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌ను అరెస్టు చేశారు. మీరట్ నుంచి దొంగల బ్యాచ్ రాష్ట్రంలో ప్రధాన నగరాలను టార్గెట్ చేసుకుని దిగినట్టు గుర్తించారు. వారిలో సిద్ధిఖీ, ఖాసీం అనే ఇద్దరు పీఎన్‌బీఎస్ నుంచి ఒంగోలు వెళ్లే బస్సు ఎక్కి గొల్లపూడికి చెందిన ఫొటోగ్రాఫర్ ఖరీదైన కెమెరాను దొంగిలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నామని సీసీఎస్ పోలీసులు తెలిపారు. గొల్లపూడి మార్కెట్ యార్డులో ఎస్‌బీఐ బ్యాంక్‌లో చోరీకి దిగిన యువకుడు(30) కిటికీలో నుంచి లోపలకు ప్రవేశించి లాకర్‌కు వెళ్లే ప్రధాన ద్వారం పగలు గొట్టే దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బ్యాంక్ అధికారులు శుక్రవారం తలుపులు తెరిచి చూసే సరికి చోరీ యత్నం జరిగినట్టు కనిపించింది. దీంతో వారు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయ్యప్పనగర్‌లోని నేతాజీ రోడ్డులో ఇళ్ల బయట పార్క్‌చేసి ఉన్న స్కూటర్ డిక్కీని ఇద్దరు యువకులు పగలుగొట్టారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీనికి ముందు కృష్ణలంకలో ఇంటి ముందు పార్క్ చేసిన బుల్లెట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మాయం చేశారు. మీరట్ నుంచి వచ్చిన గ్యాంగ్‌లోని వ్యక్తులు ఈ చోరీలు చేస్తున్నారా? పొరుగు జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వరుస చోరీలతో క్రైం పోలీసులు అప్రమత్తమయ్యారు. సీసీ ఫుటేజీల్లో నిందితులను గుర్తించామని త్వరలోనే అరెస్టు చేస్తామని వివరించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 123, 132, 143
చికెన్ విత్ స్కిన్ 234
చికెన్ స్కిన్‌లెస్ 244

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555



లెదర్ హౌస్ సిబ్బందికి బోనస్ పంపిణీ

ఆటోనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని ఈడర్ లెదర్ హౌస్‌లో పనిచేస్తున్న సిబ్బందికి దీపావళి కానుకగా బోనస్ అందజేసినట్లు సంస్థ ఎండీ దేవరపల్లి దేవమణి శుక్రవారం తెలిపారు. సంస్థ ఎదుగుదలకు సిబ్బంది సహాయసహకారాలు ఎంతో ముఖ్యమని ఆమె వెల్లడించారు.



సిబ్బందికి బోనస్ అందజేస్తున్న ఈడర్ లెదర్ హౌస్ ఎండీ దేవరపల్లి దేవమణి

వర్షం వస్తే చిత్తడే

- కృష్ణలంక పొట్టిశ్రీరాములు హైస్కూల్ ఆటస్థలం బురదమయం
- ఇప్పటికే మూడుసార్లు వాకింగ్ ట్రాక్ కొట్టుకుపోయిన వైనం
- పర్మినెంట్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ఎంపీ, ఎమ్మెల్యే హామీ

(ఆంధ్రజ్యోతి, కృష్ణలంక)

కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఆటస్థలం, వాకింగ్ ట్రాక్ వర్షం వస్తే చాలు పదిరోజుల పాటు చిత్తడి చిత్తడిగా మారిపోతుంది. స్కూల్ గ్రౌండ్‌లో కనీసం నడిచేందుకు కూడా వీలుండదు. విజయవాడ నగరంలోని అన్ని నగరపాలక సంస్థల హైస్కూల్స్ కంటే కృష్ణలంక పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల ఆటస్థలం చాలా పెద్దది. ఇక్కడ సెలవురోజుల్లో విద్యార్థులు, పిల్లలు క్రికెట్, వాలీబాల్, తదితర ఆటలు ఆడుతుంటారు. పొరపాటున వర్షం వచ్చిందంటే మాత్రం పదిరోజుల పాటు స్కూల్ గ్రౌండ్‌లోకి అడుగు పెట్టే పరిస్థితి వుండదు. గతంలో అప్పటి కార్పొరేటర్ దోనేపూడి కాశీనాథ్ హయాంలో రూ.5 లక్షలతో వాకర్స్ సౌలభ్యం కోసం వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అది 'భూగర్భం'లో కలిసి పోయింది. ఆ తర్వాత వచ్చిన కార్పొరేటర్ గొరిపర్తి నర్సింహారావు వాకర్స్ విజ్ఞప్తి మేరకు రూ.7 లక్షలు పెట్టి గతంలో కంటే మిన్నగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయించారు.



చిత్తడిగా మారిన కృష్ణలంక హైస్కూల్ ఆటస్థలం (ఫైల్ ఫొటో)

అది కూడా షరా మామూలే. ఆ తర్వాత బొప్పన భవకుమార్ చొరవతో రూ.8 లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను స్కూల్ గ్రౌండ్ కంటే ఒక అడుగు ఎత్తులో ప్లాట్‌ఫాంలా కట్టారు. అయితే స్కూల్‌లో నాడు-నేడు బిల్డింగ్ నిర్మాణం కోసం గ్రౌండ్‌లోకి ట్రాక్టర్లు, లారీలు బిల్డింగ్ మెటీరియల్స్‌ను తీసుకురావడంతో అది కూడా కొట్టుకుపోయింది. కొద్ది రోజుల క్రితం తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు స్కూల్ గ్రౌండ్‌కు విచ్చేసి కృష్ణలంక వాకర్స్ అసోసియేషన్, అమరావతి వాకర్స్ క్లబ్ సభ్యులతో చర్చించి 'త్వరలో మీ అంచనాలకు తగ్గట్టుగా పర్మినెంట్ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయిస్తానని' రెండు వాకర్స్ అసోసియేషన్‌ల అధ్యక్షులు, సభ్యులకు హామీ ఇచ్చారు.

ఇకపోతే స్కూల్ గ్రౌండ్‌లో చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారడంతో విద్యార్థులు, క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చినప్పటికీ గ్రౌండ్‌లో వర్షపు నీరు నిల్వకుండా, బురదమయం కాకుండా వుండే విధంగా ఆటస్థలాన్ని తీర్చిదిద్దాలని వారు కోరుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కూడా ఆటస్థలాన్ని సందర్శించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. అయితే ఎంపీ నిధుల నుంచి స్కూల్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తానని కేశినేని చిన్ని హామీ ఇచ్చారు.



వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు అంచనాలు వేశారు

ఇటీవల తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు స్కూల్ గ్రౌండ్‌కు విచ్చేశారు. కాంట్రాక్టరును, కార్పొరేషన్ అధికారులను పిలిపించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం అంచనాలు కూడా వేసుకున్నారు. వర్షాలు తగ్గగానే వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

\- మూరం లక్ష్మయ్య, కృష్ణలంక వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



స్కూల్ గ్రౌండ్, ట్రాక్ పనుల నిమిత్తం సర్వే చేశారు

ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు విచ్చేసినప్పుడు స్కూల్ గ్రౌండ్‌ను ఎత్తుపెంచి ట్రాక్ మరింత వెడల్పు చేసే విధంగా కొలతలు తీసుకున్నారు. ఎంపీ నిధుల నుంచి స్కూల్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం పనులు చేస్తామని చెప్పారు. సర్వేయర్‌ను పిలిపించి సర్వే కూడా చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే దయ వల్ల స్కూల్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ బాగుపడుతుందని ఆశిస్తున్నా.

\-నిమ్మల జ్యోతిక, అమరావతి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు

రాష్ట్రస్థాయి యోగాకు నవోదయ విద్యార్థులు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఈ నెల 2, 3 తేదీల్లో జరగనున్న



యోగా క్రీడాకారులతో పాఠశాల యాజమాన్యం

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కస్తూరిబాయిపేట నవోదయ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 28న నిడమానూరు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి అండర్-14, 17 యోగా బాల, బాలికల ఎంపిక పోటీల్లో నవోదయ విద్యార్థులు పాల్గొని సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కె. గణేష, కె లోకేష్, ఎస్ చరణ్‌దిలీప్, ఆర్. కౌశికలు ఎంపిక కావడంపై స్కూల్ డైరెక్టర్ అల్లూరి భాస్కర్‌రెడ్డి, వి ద్యార్థులను, కోచ్ శిరీషను అభినందిం



లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, 18వ డివిజన్ నాయకులు

సంక్షేమమే టీడీపీ లక్ష్యం: ఎమ్మెల్యే గద్దె

పటమట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించడం టీడీపీ ద్వారానే సాధ్యం అవుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు పరిధిలోని 12వ డివిజన్‌లో పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్థానిక కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబుతో కలిసి గద్దె రామ్మోహన్ శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ పింఛన్లు ఇచ్చేటప్పుడు లబ్ధిదారుల ముఖంలో నవ్వు చూసి తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు శాయన సత్యనారాయణ, మేదరమెట్ల నారాయణలు పాల్గొన్నారు.

రాణిగారితోట: రాణిగారితోట 18వ డివిజన్‌లో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ పింఛన్లను ఒకటవ తేదీనే లబ్ధిదారులకు అందిస్తూ వారి కళ్లల్లో ఆనందాన్ని చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పగడాల వెంకటేశ్వరరెడ్డి, పత్తి రామారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోబీఖానాలో శ్రమదానం

కృష్ణలంక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : . తూర్పు నియోజకవర్గంలోని 22వ డివిజన్‌లో గంగానమ్మ గుడి వద్ద గల దోబీఖానాలో శుక్రవారం శ్రమదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ హాజరై స్థానికులతో కలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోబీఖానాకు అదనంగా మరో రెండు రేకుల షెడ్లను నిర్మించడానికి అనుమతులు వచ్చాయని, నిధులు కూడా మంజూరయ్యాయని చెప్పారు. త్వరలో రేకుల షెడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. షెడ్ల నిర్మాణానికి అడ్డంకిగా వున్న పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను గద్దె యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమంలో తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నారావు, తోట శ్రీను, నడికుప్పల శివ, పెద్ది అన్నారావు, కొండేటి వెంకట్రావు, అజయ్, రవి, కర్రి రాజేష్ పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న గద్దె క్రాంతి కుమార్

పాత శివాలయంలో నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ చైర్మన్, ఆలయ ఈవో, కమిటీ సభ్యులు

వన్‌టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కార్తీకమాసం సందర్భంగా ఈనెల 2 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు కార్తీకమాస అభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బి.మధు, ఈవో నటరాజన్ షణ్ముగంలు తెలిపారు. గురువారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహోత్సవాలు ప్రారంభానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణలు పాల్గొంటారని తెలిపారు. కార్తీకమాసంలో మల్లేశ్వరస్వామి వారికి ప్రతిరోజూ ఉదయం ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు జరుగుతాయని తెలిపారు. భ్రమరాంబ అమ్మవారు 30 రోజుల పాటు 30 అలంకారాలతో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాచకొండ సుమంత్ శర్మ, ధర్మకర్తలు, అర్చకులు, పాల్గొన్నారు.

ప్రోస్టేట్ కేన్సర్ బాధితులకు అండగా నో షేవ్ నవంబరు

పటమట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రోస్టేట్ కేన్సర్ బాధితులకు రూట్స్‌హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో భాగంగా నో షేవ్ నవంబరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూట్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ మాట్లాడుతూ నో షేవ్ నవంబరు సందర్భంగా ఈ నెలలో తమ జుట్టు, గడ్డం చేయించుకోకుండా పెంచుకుని దాని ద్వారా ఆదా అయ్యే డబ్బును కేన్సర్ బాధితులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. నవంబరు నెల ప్రోస్టేట్ కేన్సర్ అవేర్‌నెస్ నెల అయినందున ప్రోస్టేట్ కేన్సర్ బాధితులకు సహాయం చేయాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని రూట్స్ కార్యాలయంలో నో షేవ్ నవంబరు బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వచ్చే నగదును వెంకటేశ్వరరావు అనే లివర్ కేన్సర్ బాధితుడికి అందజేయడం జరుగుతుందన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రూట్స్ సభ్యులు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 4 నుంచి స్వల్పకాలిక వృత్తి కోర్సులు

భారతీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీ యాడ్స్ అండ్ సిగ్న్స్ రివెల్యూషనరీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డెస్క్‌టాప్ పబ్లిషింగ్(డీటీపీ), సిగ్నేజ్‌సొల్యూషన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులకు ఈ నెల 4 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమౌతాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. డీటీపీ, సిగ్నేజ్‌సొల్యూషన్ కోర్సుల్లో అభ్యర్థులకు డిజైన్, విజువల్ కమ్యూనికేషన్ సామర్థ్యాలను మెరుగుపరుస్తామన్నారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్ అభ్యర్థులకు వాణిజ్య, నివాస భవనాలు, పెద్దపరిశ్రమల్లో విద్యుత్ వ్యవస్థలను నిర్వహించడానికి అవసరమైన కీలక నైపుణ్యాలను బోధిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9347779032, 8008742842 సంప్రదించాలని తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ ధ్యానచంద్ర తన చాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు వెంటనే పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్‌మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్



ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

చిట్టినగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు సిబ్బందితో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, మేనేజర్ ఏయూబీ శర్మ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు, పీఆర్వో రజియా షబీన, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఆటోనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం పెనమలూరు నియోజకవర్గం సనత్‌నగర్‌కు చెందిన రహీమ్(20) ఆటోనగర్ ఫైర్‌స్టేషన్ సమీపంలోని షాపులో ఫౌండ్రీ పని చేస్తుంటాడు. గత నెల 29న రహీమ్ షాపులో పని ముగించుకుని రాత్రి 9 గంటలకు ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఆటోనగర్ 5వ రోడ్డు వద్ద కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో రహీమ్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో బండి అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో రహీమ్ తలకు తీవ్ర గాయమవ్వడంతో కొత్త ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి కరీమ్ ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

నెలరోజులుగా పనిచేయని చేతిపంపు

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుణదల గంగిరెద్దుల దిబ్బ వైఎస్సార్ కాలనీ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేతి పంపు నెల క్రితం మరమ్మతులకు గురయ్యింది. వేసవి ఎద్దడిని తట్టుకునేందుకు నగర కార్పొరేషన్ అధికారులు ఈ పంపును గత ఏడాది ఏర్పాటు చేశారు. అది మరమ్మతులకు గురైందని అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.



ప్రతి అడుగూ.. పెన్షనర్ల కోసం



పాదయాత్ర చేస్తున్న లోకాల మురళీకృష్ణ

71 ఏళ్ల వయస్సులో ఆర్టీసీ మాజీ అధికారి పాదయాత్ర

- విజయవాడ నుంచి ఢిల్లీ వరకు అడుగులు
- ఈపీఎస్ పెంపుదలే ప్రధాన డిమాండ్

ఆర్టీసీలో అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారాయన. వయసేమో ఏడు పదులు దాటింది. ఇప్పుడు లక్షలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు పెన్షన్‌దారుల కోసం పోరాట అడుగులు వేశారు. వృద్ధాప్యంలోనూ విజయవాడ నుంచి ఢిల్లీ వరకు పాదయాత్ర చేశారు. ఇటీవల పాదయాత్రను పూర్తిచేసుకుని విజయవాడకు వచ్చిన లోకాల మురళీకృష్ణను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్

? పాదయాత్ర ఎందుకు చేయాలనుకున్నారు

నేను ఆర్టీసీ విజయవాడ జోనల్ కార్యాలయంలో స్టోర్స్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశా. 1975లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరా. 2011 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేశా. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన లక్షలాది మంది ఇంకా రూ.1000 పెన్షన్ తీసుకుంటున్నారు. ఆర్టీసీలో ఈడీ హోదాలో పనిచేసిన అధికారి రూ.1000 పెన్షన్ అందుకుంటున్నారంటే ఎవరూ నమ్మరు. ఇది నిజం. ఈపీఎస్‌ను పెంపుదల చేయాలని కొన్నేళ్లుగా పోరాడుతున్నాం. అయినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదు. ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ప్రభుత్వం రూ.4వేల పెన్షన్ ఇస్తోంది. ఉద్యోగులుగా మా జీతం నుంచి ఈపీఎస్‌కు డబ్బులు చెల్లించి రూ.1000 పెన్షన్ అందుకోవడం చాలా బాధగా ఉంది. ఇప్పుడున్న ధరలను పరిశీలిస్తే రిటైర్డ్ ఉద్యోగులు ఈ పెన్షన్‌తో జీవించడం చాలా కష్టం.

? ఈ పరిస్థితికి కారణం

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగుల కోసం ఫ్యామిలీ పెన్షన్ స్కీం 1974 ఉండేది. పీవీ నరసింహరావు ప్రధానిగా ఉన్నప్పుడు 1995 నవంబరులో ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం(ఈపీఎస్)ను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఫ్యామిలీ పెన్షన్ స్కీంలో ఉన్న నిధులను ఈపీఎస్‌కు బదిలీ చేశారు. 2014 వరకు రూ.200-300 వచ్చేది. అప్పుడు అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం శాస్త్రీయత లేకుండా ఈపీఎస్‌లో కనీస పెన్షన్‌ను రూ.1000గా నిర్ణయించింది. ఇప్పటికీ అదే అమలవుతోంది. ఎన్డీఏ ప్రభుత్వానికి ముందు యూపీఏ ప్రభుత్వం 2013లో భగత్‌సింగ్ కోషియారీ కమిటీని నియమించింది. కమిటీ నివేదిక ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పార్లమెంటులో పెట్టలేదు. అందుకే పాదయాత్ర చేయాలనుకున్నా.

? నివేదికలో ఉన్న సిఫార్సులేంటి

ఈపీఎస్‌లో కేంద్ర ప్రభుత్వ వాటా 1.16శాతం ఉంది. దీన్ని 8.33 శాతానికి పెంచాలని కోషియారీ కమిటీ స్పష్టం చేసింది. 1995 నుంచి ఈపీఎస్‌తోపాటు డీఏ(కరువు భత్యం) ఇచ్చేవారు. డీఏ 4-4.5శాతంగా ఉండేది. 2000లో డీఏ ఇవ్వడం నిలిపేశారు. కనీస ఈపీఎస్‌గా రూ.1000 ఇస్తున్నారు. 8.33 శాతానికి కేంద్ర ప్రభుత్వ వాటాను పెంచినప్పుడే ఈపీఎస్, డీఏ సక్రమంగా ఇవ్వగలరని భగత్‌సింగ్ కోషియారీ కమిటీ నివేదికలో పేర్కొంది. ఈపీఎస్‌ను కనీసంగా రూ.3000కు పెంచి, డీఏ కలిపి ఇవ్వాలని సూచించింది. ఇలా చేస్తే రూ.1000 ఉన్న కనీస పెన్షన్, డీఏతో కలిపి రూ.9వేలు అవుతుంది. ఈ నివేదిక ఇప్పటికీ పార్లమెంటు మెట్లు ఎక్కలేదు.

? పాదయాత్రలో ఆరోగ్య సమస్యలు రాలేదా

నా వయస్సు 71 ఏళ్లు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి సెప్టెంబరు పదిన పాదయాత్రకు శ్రీకారం చుట్టాను. నా భార్య ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. కుమారుడికి మానసికస్థితి బాగోలేదు. ఇంట్లో చెప్తే వద్దంటారని నాకు నేనే నిర్ణయం తీసుకున్నా. వాస్తవానికి సెప్టెంబరు తొమ్మిదిన గుంటూరు నుంచి విజయవాడకు పాదయాత్ర చేశాను. తర్వాత ఇక్కడ నుంచి తిరిగి గుంటూరుకు వెళ్లిపోయాను. పదో తేదీ నుంచి అడుగులు వేసుకుంటూ ఢిల్లీకి చేరాను. ఈ యాత్ర మధ్యలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాలేదు. సమయానికి ఆహారం తీసుకుంటూ ముందుకు సాగాను.

? రాత్రి సమయాల్లో బస ఎలా

పాదయాత్ర రెండు సమయాల్లో చేశాను. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు కొన్నిరోజులపాటు చేశాను. తర్వాత రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి వరకు చేశాను. అప్పుడున్న పరిస్థితుల మేరకు నడిచేవాడిని. యాత్ర పూర్తయ్యే వరకు చాలా చోట్ల సొంతం గానే బస ఏర్పాటు చేసుకున్నా. కొన్నిచోట్ల ఆర్టీసీ సిబ్బంది బస ఏర్పాటు చేశారు. నేను ఉమ్మడి రాష్ట్రంలో పనిచేశాను. పాదయాత్ర సాగిన మార్గంలో ఉన్న ఆర్టీసీ డిపోలకు వెళ్లి అధికారులను, సిబ్బందిని, కార్మికులను కలుసుకున్నా. మా సమస్య ఏమిటో ప్రజలకు తెలియాలని ఈపీఎస్‌ను పెంచడంతోపాటు భగత్‌సింగ్ కోషియారీ కమిటీ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఫ్లెక్సీపై ముద్రించా. దీన్ని ప్రదర్శిస్తూనే పాదయాత్ర చేశా. ఈపీఎస్ సమస్య ఎదుర్కొంటున్న ఉద్యోగులు ఢిల్లీ వెళ్లే వరకు సంఘీభావం తెలిపారు.

? యాత్రలు చేసిన అనుభవముందా

నేను ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం వెల్ఫేర్ అసోసియేషన్ దక్షిణాది శాఖ సంయుక్త కార్యదర్శిని. దీనికి ముందు వివిధ హోదాల్లో సంఘంలో పనిచేశా. ఉద్యోగంలో ఉన్నప్పుడు స్కూటర్, సైకిల్ యాత్రలు చేశా. పాదయాత్ర ఎప్పుడూ చేయలేదు. 2018లో గుంటూరు నుంచి ఢిల్లీ వరకు హోండా యాక్టివాపై యాత్ర చేశా. 2018 జనవరిలో గుంటూరు నుంచి నాగపూర్ వరకు సైకిల్ యాత్ర చేశా. 2019, 2020, 2022లో గుంటూరు నుంచి ఢిల్లీ వరకు హోండా యాక్టివాపై యాత్ర చేశా. 2022 మార్చిలో గుంటూరు నుంచి ఢిల్లీ వరకు యాక్టివాపై యాత్ర చేశా. ఈపీఎస్ అమలు చేసినపుడు టైం టు టైం రివిజన్, రివ్యూ చేస్తామని ఈపీఎఫ్ ప్రకటించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రివిజన్, రివ్యూ లేదు. దేశంలో పెన్షనర్లు 73లక్షల మంది ఉన్నారు. ఈపీఎస్ రూ.1000 తీసుకుంటున్న వారు 30లక్షలు మంది ఉన్నారు. వాళ్లంతా ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేశారు. రాష్ట్రంలో లక్షమంది ఉంటారు.

? ఢిల్లీ చేరుకున్నాక ఏం చేశారు

పాదయాత్రతో ఢిల్లీకి చేరుకున్నాక అక్కడ ఇండియా గేట్ వద్ద ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన తెలియజేశా. వెంటనే అక్కడున్న సెక్యూరిటీ వచ్చి ఫ్లెక్సీ లాక్కున్నారు. ఇక్కడ నిరసనలు తెలియజేయకూడదని చెప్పి పంపేశారు. తర్వాత ప్రొవిడెంట్ ఫండ్ కార్యాలయానికి వెళ్లా. అక్కడి సిబ్బంది లోపలకు అనుమతించలేదు. అక్కడ రిసెప్షన్‌లో వినతిపత్రం తీసుకుని బయటకు పంపేశారు. తర్వాత ప్రధాని, ఆర్థికమంత్రి, కార్మిక మంత్రి కార్యాలయాల్లోనూ ఇలాగే చేశారు. ఈపీఎస్ ప్రవేశపెట్టినప్పటి నుంచి సర్వీసును మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. అంతకుముందున్న సర్వీసును పరిగణనలోకి తీసుకోలేదు. దీనివల్ల రిటైరైన ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

ఈ నెల నుంచి

బియ్యంతో పాటు జొన్నలు

- తప్పనిసరి కాదు..కార్డుదారులకు ఇష్టమైతేనే
- ఎన్ని కిలోలు తీసుకుంటే అన్ని కేజీల బియ్యం తగ్గింపు
- పౌష్టికాహారం ప్రజలకు అందించాలనే పంపిణీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పౌష్టికాహారమైన తృణధాన్యాలను కూడా ప్రజలకు అందించాలని ఈనెల నుంచి తొలిదశలో జొన్నలను పంపిణీ చేయాలని పౌర సరఫరాల అధికారులు నిర్ణయించారు. తృణ ధాన్యాల్లో పౌష్టికాహారం ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రేషన్ బియ్యానికి ప్రత్యామ్నాయంగా తృణధాన్యాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసింది. తృణధాన్యాలు తీసుకోవడం తప్పనిసరి కాదు. కార్డుదారులకు ఇష్టమైతేనే ఇస్తారు. తృణధాన్యాలను తీసుకునే పరిమాణం మేరకు బియ్యం తగ్గిస్తారు. 10 కేజీల బియ్యం వచ్చే కార్డుదారుడు రెండు కేజీల తృణధాన్యాలు తీసుకుంటే అతనికి 8 కేజీల బియ్యం ఇస్తారు. తృణ ధాన్యాలు తీసుకోవటం కార్డుదారులకు కల్పించిన ఆప్షన్ మాత్రమే. కేజీకి తక్కువ కాకుండా గరిష్ఠంగా మూడు కేజీల వరకు ఇస్తారు.

92.81 శాతం పింఛన్ల పంపిణీ

- ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 2,15,289 మందికి రూ.90.85 కోట్లు అందజేత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 92.81 శాతం మేర పంపిణీ చేశారు. 2,31,961 మంది పింఛనుదారులుండగా.. వీరిలో 2,15,289 మందికి రూ.90.85 కోట్లను అందజేశారు. జిల్లాలో అత్యధికంగా మైలవరం మండలంలో 9,311 మందికి రూ.39.51 లక్షలను(96.6%) అందజేశారు. 7850 మంది పెన్షనర్లకు రూ.32.67 లక్షల సొమ్మును అందించి విస్సన్నపేట మండలం రెండోస్థానం(95.92%), 4634 మంది పెన్షనర్లకు రూ.19.62 లక్షలను అందించి జగ్గయ్యపేట అర్బన్ మండలం మూడో స్థానం(95.13%)లో నిలిచాయి. తిరువూరు మండలంలో రూ.13.55 లక్షలు(94.32%), జి.కొండూరు మండలంలో రూ.34.19 లక్షలు(94.21%), నందిగామ అర్బన్‌లో రూ.17 లక్షలు (94.03%), ఎ.కొండూరులో రూ.29.06 లక్షలు(93.59%), విజయవాడ అర్బన్ పరిధిలో రూ.2.69 కోట్లు (93.28%), గంపలగూడెంలో రూ.43.56 లక్షలు(92.8%), రెడ్డిగూడెంలో రూ.27.84 లక్షలు(92.45%), వీరులపాడులో రూ.33.75 లక్షలు(92.62%), తిరువూరు మండలంలో రూ.26.42 లక్షలు(92.58%), జగ్గయ్యపేటలో రూ.39.16 లక్షలు(92.36%), నందిగామ మండలంలో రూ.31లక్షలు(92.4%), కంచికచర్ల మండలంలో రూ.39.40 (91.9%), పెనుగంచిప్రోలు మండలంలో రూ.32 లక్షలు(90.78%), కొండపల్లిలో రూ. 20.48 లక్షలు(90.36%), వత్సవాయి మండలంలో రూ.36.29 లక్షలు(90.31%), విజయవాడ రూరల్ మండలంలో రూ.65.96 లక్షలు (90.25%), చందర్లపాడు మండలంలో రూ.37.25 లక్షలు(90.17%) మేర పంపిణీ చేశారు.


ఎన్ఐఆర్‌డీపీఆర్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)

వన్‌టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్) సంస్థను, రూరల్ టెక్నాలజీ పార్క్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఎంపీకి ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్, అధికారులు స్వాగతం పలికారు. రూరల్ డెవలప్‌మెంట్ కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు.. అందుకు ఉన్న పథకాలు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి కల్పించేందుకు ఉన్న అవకాశాలపై అధికారులను అడిగి చిన్ని తెలుసుకున్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్‌లోని ప్రధాన పథకాలు, జాతీయగ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం), పంచాయతీ బాధ్యతలు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికలను నరేంద్రకుమార్ బృందం వివరించారు. ఎంపీ రూరల్ టెక్నాలజీపార్కును సందర్శించారు.

విజయవాడ - విశాఖపట్నం మధ్య

16 జనసాధారణ్ రైళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రయాణికుల రద్దీ కారణంగా సామాన్య ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని విజయవాడ, విశాఖపట్నం మధ్య 16 జనసాధారణ్ రైళ్లను నడుపుతున్నట్టు శుక్రవారం రైల్వే అధికారులు ప్రకటించారు. ఇవి పూర్తిగా అన్ రిజర్వుడ్ కేటగిరీకి చెందినవి. నవంబరు 3, 4, 6, 8, 10, 11, 13 తేదీల్లో ఈ రైళ్లను నడుపుతున్నారు. ఈ రైళ్లకు విశాఖపట్నం- విజయవాడ మధ్య దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరంలో హాల్టింగ్ ఉంటుంది.


గాజుల అలంకారానికి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గగుడిలో నేటి నుంచి

కార్తీక వేడుకలు

వచ్చే నెల 1 వరకు నిర్వహణ

వన్‌టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తీకమాస వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈవో కె.ఎస్.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 'రోజూ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సహస్ర లింగార్చనలు, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు చతుర్వేద పారాయణం, కారక పారాయణలు, శివపంచాక్షరి, లక్ష్మీ గణపతి జపములు, మహానివేదనలు నిర్వహిస్తాం. ఈనెల 3న అమ్మవారికి గాజుల అలంకారం, 5న నాగులచవితి సందర్భంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉపాలయంలో ఉదయం 4 గంటలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తాం. రోజూ ఉదయం సహస్ర లింగార్చన, రుద్ర హోమాలు, ఊంజల్ సేవలతో పాటు సాయంత్రం 6.30 గంటలకు అష్టోత్తర పూజా వేదిక వద్ద ఆర్జిత సేవగా దీపోత్సవం జరిపిస్తాం. కార్తీక పౌర్ణమి సందర్భంగా 15న మహామండపం ఏడో అంతస్తులో కోటి దీపోత్సవం, రాత్రి 7 గంటలకు జ్వాలా తోరణం ఉంటుంది. 15న ఉదయం 5.55 గంటలకు గిరి ప్రదక్షిణ యథావిధిగా జరుగుతుంది. రాత్రి 7 గంటలకు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కృత్తిక దీపోత్సవ వేడుక నిర్వహిస్తాం. ఈనెల 4, 11, 12, 15, 18, 25, 26, 29 తేదీల్లో బిల్వార్చనలు, రోజూ మల్లేశ్వరస్వామికి మహానివేదన జరుగుతుంది.' అని ఈవో పేర్కొన్నారు. కార్తీక మాసంలో సహస్ర లింగార్చన, ఊంజల్ సేవల్లో పాల్గొనేందుకు రోజుకు టికెట్టు రుసుము రూ.500, రుద్ర హోమంలో పాల్గొనేందుకు రూ.1000, సహస్ర లింగార్చన సేవలో నెలరోజుల పాటు పాల్గొనేందుకు రూ.5,116, ప్రత్యేక బిల్వార్చన సేవలో పాల్గొనేందుకు రూ.2000, ఊంజల్ సేవ (దీపారాధన)కు రూ.50 రుసుము చెల్లించాలని ఈవో సూచించారు.

ఆకాశదీపం వెలిగించి..వేడుకలకు శ్రీకారం

కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శుక్రవారం రాత్రి దేవస్థానం ఈవో కె.ఎస్.రామారావు ఆకాశదీపాలు వెలిగించారు. ఈవో దంపతులు కనకదుర్గమ్మ దేవస్థానం, మల్లేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభాల వద్ద శాస్త్రోక్తంగా పూజలు చేసి, ఆకాశదీపాలు వెలిగించి కార్తీక మాస వేడుకలకు శ్రీకారం చుట్టారు.


ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపాలు వెలిగిస్తున్న ఈవో దంపతులు

రేపు దుర్గమ్మకు గాజుల అలంకారం

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి గాజుల అలంకారం వేడుక నిర్వహిస్తామని ఈవో కె.ఎస్.రామారావు తెలిపారు. అమ్మవారిని, దేవాలయ పరిసర ప్రాంగణాన్ని గాజులతో అలంకరిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి ఉచిత దర్శనంలోను, 5 గంటలకు అన్ని దర్శనాల్లోనూ అమ్మవారు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆయన తెలిపారు. గాజుల అలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో ఆలయ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. పెద్ద సంఖ్యలో గాజులు విరాళంగా అందించాలని భక్తులకు ఈవో సూచించారు.

శాస్త్రోక్తంగా ధనలక్ష్మీపూజ

దీపావళి పండుగ సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన ఆలయంలో అమ్మవారి ఆలయ వైదిక సిబ్బంది గురువారం శాస్త్రోక్తంగా ధనలక్ష్మీపూజ నిర్వహించారు. ఈవో కె.ఎస్.రామారావు దంపతులు పూజలు చేశారు. దుర్గగుడిలో దీపాలు వెలిగించారు.

దీపావళి వేడుకలు

దేవస్థానంలో ప్రదోషకాలంలో అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఈవో రామారావు దీపాల ప్రజ్వలన చేసి బాణాసంచాలు వెలిగించారు. ఆలయ అధికారులు, సిబ్బంది టపాసులు కాల్చి దీపావళి వేడుకలు నిర్వహించారు.

సిటీమార్

(3వ పేజీ తరువాయి)

విసిరేలా తయారవుతోందని పీసీబీ అధికారులు భావిస్తున్నారు. నగరంలో ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారి సంఖ్య ఏటా పెరుగుతోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. గాల్లో కణాల పీఏం పెరిగే కొద్దీ కాలుష్యం పెరుగుతోంది. నగరంలో 50 స్టేషన్ల ద్వారా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గాలి కాలుష్యాన్ని లెక్కిస్తున్నారు. తాజా పరిశీలనలో ఈ పీఏంల స్థాయి పెరిగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శీతాకాలం ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

గ్రీనరీ పెంపుదలే మార్గం

గాల్లో కాలుష్య నివారణకు పచ్చదనాన్ని పెంచడం ఒక్కటే శాశ్వత మార్గమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రహదారులపై వాహనాల రాకపోకల వల్ల దుమ్ము, ధూళి గాల్లోకి లేస్తాయి. ఇందులో అలర్జీ కారకాలు ఎక్కువ. పొగ, దుమ్ము, ధూళిలో ఈ కారకాలు ఉంటాయి. ఈ కారకాల వల్ల సీవోపీడీ(క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ కారణంగా గుండెజబ్బులు వస్తాయన్నది వైద్యుల అభిప్రాయం. పచ్చదనాన్ని పూర్తిస్థాయిలో పెంచడం వల్ల ఎప్పటికప్పుడు స్వచ్ఛమైన గాలి బయటకు వస్తుందని పర్యావరణవేత్తలు అంటున్నారు.

ప్రభావం తీవ్రమే..

గాల్లో కాలుష్యం పెరుగుతున్న మాట వాస్తవమే. దీనికి నిదర్శనమే ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడే రోగుల సంఖ్య పెరగడం. కణాల పరిమాణం తగ్గిపోవడం వల్ల మనం పీల్చే గాలి ద్వారా సులువుగా శరీరంలోకి ప్రవేశిస్తాయి. అవయవాల చివరి వరకు వెళ్తాయి. ఈ కణాల పరిమాణం తగ్గడం చాలా ప్రమాదకరం. శీతాకాలంలో ఈ కణాలు మంచులో ఉండిపోతాయి. మనం పీల్చే గాలి ద్వారా ఇవన్నీ ఊపిరి తిత్తులు, శ్వాసకోశాల అట్టడుగు భాగానికి చేరు కుంటాయి. అదే పరిమాణం పెద్దగా ఉంటే లోపలకు ప్రవేశించినప్పటికీ ముక్కు చివరి భాగాన గానీ, అంగుటి వద్ద గానీ ఆగిపోతాయి. వర్షాకాలం, ఎండాకాలంలో ఈ కణాలు నేలపై ఉండిపోతాయి. శీతల వాతావరణంలో మాత్రమే పైకి తేలతాయి. దీనివల్ల అలర్జిక్ బ్రాంకైటిస్, అలర్జిక్ రైనైటిస్, వైరల్ అండ్ బ్యాక్టీరియల్ నిమోనియా వంటి వ్యాధులు సోకుతాయి. ఈ రోగాలు ఉన్నవారు శీతాకాలంలో చాలా ఇబ్బంది పడతారు.

- కె.అనిల్, ఊపిరితిత్తులు,శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు

సీఎం చంద్రబాబు ఫ్లెక్సీ దహనం

- వైసీపీ సానుభూతిపరుడు, న్యాయవాది అరెస్టు

అవనిగడ్డ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని వైసీపీ సానుభూతిపరుడిగా చెప్పుకొం టున్న అవనిగడ్డకు చెందిన యువకుడు, న్యాయవాది బడే గౌతమ్ తగలబెట్టాడు. నాగాయలంక మండలంలో గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాడు. దీనిపై టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు స్పం దించారు. గౌతమ్‌ను వెంటనే అరెస్టు చేయాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్‌లకు ఫిర్యాదు చేశారు. ప్రజాస్వామ్యవాదాన్ని, గాంధేయవాదాన్ని నమ్మి రాజకీయం చేసే తమ నేతల ఫొటోలను ఉద్దేశపూర్వకంగా తగలబెట్టి మాజీ సీఎం జగన్ వద్ద గుర్తింపు పొందాలనే గంజాయి బ్యాచ్‌ను గౌతమ్ వెంట వేసుకుని ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. విచారణ నిర్వహించిన పోలీసులు శుక్రవారం సాయంత్రం నాగాయలంక నుంచి అవనిగడ్డకు వస్తున్న గౌతమ్‌ను అరెస్టు చేశారు.


సర్దార్ వల్లభాయిపటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

ఉక్కుమనిషి పటేల్

- కలెక్టరేట్‌లో ఘనంగా ఏక్తాదివస్.. నివాళులర్పించిన ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 'దేశ సమగ్రతను కాపాడిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్. దేశ ఐక్యత కోసం ఆయన విశేష కృషి చేశారు. ఆయన సంకల్పాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలి.' అని ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని ఏక్తాదివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. సర్దార్ వల్లభాయి పటేల్ ఆశయ సాధనకు కృషి చేస్తామని, సమగ్రతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరెడ్డి, కార్యాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా

పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించండి

- నారెడ్కో ప్రతినిధులను కోరిన కూటమి అభ్యర్థి ఆలపాటి

వన్‌టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి(నారెడ్కో) ప్రతినిధులను ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా) కోరారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన నారెడ్కో సర్వసభ్య సమావేశానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కూటమి అభ్యర్థిగా తనను ఎంపిక చేసిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 'గత వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. జగన్ అరాచకాల వల్ల అన్ని వర్గాలు తీవ్ర అవస్థల పాలయ్యాయి. ఏ రంగమూ అభివృద్ధి చెందలేదు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. రాష్ట్రంలో స్థిరాస్తి వృద్ధే అందుకు నిదర్శనం. చంద్రబాబు రియల్ ఎస్టేట్ రంగంలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.' అని ఆలపాటి పేర్కొన్నారు. తమ సమస్యలను ఆలపాటికి నారెడ్కో సభ్యులు వివరించి, పరిష్కరించాలని కోరారు. నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్‌కు మెమెంటో అందించి, సత్కరించారు. నారెడ్కో ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు పరుచూరి కిరణ్, కోశాధికారి చావా రమేష్, సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ, కోశాధికారి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

అన్ని వర్గాలను సంతృప్తిపరిచేలా పాలించండి

- సీఎం చంద్రబాబుకు వడ్డే శోభనాద్రీశ్వరరావు సూచన

దర్నాచౌక్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రజలు, సన్న, చిన్నకారు రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, చిరు వ్యాపారులు, మహిళలకు సంతృప్తి కలిగేలా పాలన చేయాలని సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సూచించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించాక, గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన ప్రెస్‌మీట్‌లో మాటాడారు. 'రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలను స్వాగతిస్తున్నా. ప్రత్యేక హోదాతోనే పరిశ్రమల ఏర్పాటుకు రాయితీ లివ్వడం సాధ్యమవుతుంది. 'హోదా' లేకుంటే ప్రభుత్వంపై తీవ్రభారం పడుతుంది. ప్రధాని మోదీపై ఒత్తిడి తెచ్చి హోదా సాధించాలి. అదానీ కంపెనీకి విశాఖపట్నంలో 5వేల నుంచి 20 వేల ఎకరాల భూమిని ఇవ్వాలనే ప్రతిపాదనలను విరమించుకోవాలి. రాబోయే ఇరవై ఏళ్ల తర్వాత ఉపయోగపడే అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు అవసరం ప్రస్తుతం లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో ఇనుప గనులను కేటాయించాలి. చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, అమరావతిలను కలుపుతూ బుల్లెట్‌ట్రైన్ ఆలోచన విరమించుకోవాలి. దీనికి లక్షల కోట్లు ఖర్చవుతుంది. అమరావతిలో భూములిచ్చిన రైతుల్లో ఇప్పటికీ కొందరికి ప్లాట్లు కేటాయించలేదు. ఇప్పటికే అమరావతిలో ఉన్న భవనాలను వినియోగించుకోవాలి. ఐకానిక్ హైకోర్టు, ఐకానిక్ అసెంబ్లీ అవసరం లేదు. ఇసుక, మద్యం పాలసీల్లో టీడీపీ తీరు సరికాదు.' అని వడ్డే పేర్కొన్నారు.

టీడీపీ కార్యాలయంలో అవతరణ వేడుక

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి గొప్ప నేతలను స్ఫూర్తిగా తీసుకుంటే, భవిష్యత్ తరాలకు ప్రయోజనం ఉంటుందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేశ్‌తో కలిసి, ఆయన నివాళులర్పించారు.

నేటి నుంచి టీడీపీ ప్రజావేదిక పునఃప్రారంభం

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నుంచి ప్రజావేదిక కార్యక్రమం పునఃప్రారంభమౌతుందని పార్టీ మీడియా కోఆర్డినేటర్ నరేంద్రబాబు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, ఆర్టీసీ చైర్మన్ నారాయణ, 4న మంత్రి శ్రీనివాస్, మాజీ మంత్రి సుజాత, 5న మంత్రి ఫరూక్, పొలిట్‌బ్యూరో సభ్యుడు రామయ్య, 6న ఎమ్మెల్యే ఆనంద్‌బాబు, 7న మంత్రి జనార్దనరెడ్డి, మండలి మాజీ చైర్మన్ షరీఫ్, 8న రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మంత్రి సంధ్యారాణి, 9న రాష్ట్ర పార్టీచీఫ్ శ్రీనివాసరావు, మంత్రి రామనారాయణరెడ్డి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

ఓల్గాకు కృష్ణమూర్తి సాహితీ పురస్కారం

ఏలూరు రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త మదుపల్లి మోహన్‌గుప్తా ఏటా అందించే శ్రీకృష్ణమూర్తి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త, నవలా రచయిత కోపూరి లలితకుమారి (ఓల్గా)కి అందజేయనున్నట్టు తెలిపారు. ఏలూరులో గుప్తా మాట్లాడుతూ తన పుట్టినరోజు నాడు తన తండ్రి శ్రీకృష్ణమూర్తి సాహిత్య పురస్కార ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు.

మద్యం షాపులకు ప్రొవిజినల్ లైసెన్స్‌ల గడువు పొడిగింపు

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం షాపులకు ప్రొవిజినల్ లైసెన్స్‌లను ఎక్సైజ్ శాఖ మరోసారి పొడిగించింది. శాశ్వత లైసెన్స్‌లు పొందనివారి ప్రొవిజినల్ లైసెన్స్‌లు ఈ నెల 7 వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. లైసెన్సీలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా మద్యం షాపులకు ఇప్పటికే రెండుసార్లు ప్రొవిజినల్ లైసెన్స్ గడువు ఇచ్చారు.

బీసీలకు ప్రత్యేక పారిశ్రామిక విధానం కావాలి: కేసన

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 2015-20లో వెనుకబడిన తరగతుల పారిశ్రామిక విధానంలో కల్పించిన రాయితీలు, 2023-2027లో కూడా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మండల స్థాయిలో వెనుకబడిన బీసీ పారిశ్రామిక వేత్తలకు 5 నుంచి 10 ఎకరాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే బీసీ పారిశ్రామికవేత్తలకూ ప్రత్యేక పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబును, పరిశ్రమలశాఖ కార్యదర్శిని కోరినట్లు శంకరరావు తెలిపారు.

టెక్సాస్ 'ది హిల్స్' మేయర్ పోటీలో బాపట్ల యువకుడు

బాపట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెక్సాస్ 'ది హిల్స్' పట్టణ మేయర్‌గా బాపట్లకు చెందిన నరాలశెట్టి కార్తీక్ పోటీ చేస్తున్నారు. బాపట్ల పట్టణంలోని నరాలశెట్టివారిపాలెంకు చెందిన కార్తీక్ పూర్వీకులు వేటపాలెంలో స్థిరపడ్డారు. కార్తీక్ తండ్రి నరాలశెట్టి రవికుమార్ గుంటూ రు ఏసీ కాలేజిలో డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పనిచేశారు. కార్తీక్ ఢిల్లీలో చదువుకొని అమెరికా వెళ్లి వ్యాపారవేత్తగా స్థిరపడ్డాడు. ఈ నెల 5న జరిగే పోలింగ్ జరగనుంది.


నరాలశెట్టి కార్తీక్

ఏలూరులో పేలిన ఉల్లి బాంబులు

- ఒకరి మృతి, 8 మందికి తీవ్రగాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిషోర్, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఏలూరుక్రైమ్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపాయ బాంబులను గోనె సంచిలో పెట్టుకుని స్కూటర్‌పై ఇద్దరు యువకులు తీసుకుని వెళ్తుండగా అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా స్కూటర్‌పై ఉన్న యువకుడితో పాటు సమీపంలో ఉన్న మరో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఏలూరు జిల్లా ఏలూరులోని సత్యనారాయణపేటకు చెందిన తాబేలు సాయిరామ్ అతడి స్నేహితుడు దుర్గాసి సుధాకర్(28) గురువారం ఏలూరు తూర్పువీధి కబేళ సమీపంలోని అనధికార బాణాసంచా తయారీ కేంద్రం నుంచి ఉల్లిపాయ బాంబులను బస్తాలో కట్టి స్కూటీపై ఇద్దరి మధ్యలో పెట్టుకున్నారు. అక్కడ నుంచి సత్యనారాయణపేట వెళ్తుండగా తూర్పువీధి గౌరమ్మ గుడి వద్ద స్కూటర్ గోతిలో పడటంతో బస్తాలోని ఉల్లిపాయ బాంబులపై ఒత్తిడిపడి అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో స్కూటర్ నడుతున్న సుధాకర్ శరీరం రెండు ముక్కలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. స్కూటర్ వెనుక కుర్చున్న సాయిరామ్‌తో పాటు ఆ సమీపంలో ఉన్న మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ కేపీఎస్ కిషోర్, క్లూస్‌టీమ్ విజయవాడ ఫోరెన్సిక్ బృందాలు పరిశీలించాయి.


యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా కర్నూలులోని కౌలుట్లయ్యస్వామి ఆలయంలో సమావేశమైన గ్రామీణులు


గ్రామీణులను ఉద్దేశించి మాట్లాడుతున్న గ్రామ పెద్ద రవి శర్మ

'కర్నూలు యురేనియం'పై కదనం

- పచ్చని పల్లెసీమల్లో చిచ్చుపెట్టకండి
- మా శవాలను దాటి అడవిలోకి వెళ్లండి
- తవ్వకాలకు వ్యతిరేకంగా 12 గ్రామాల పట్టు
- పార్టీలకు అతీతంగా గళమెత్తిన గ్రామీణులు
- కౌలుట్లయ్య క్షేత్రంలో భారీ సమావేశం
- మద్దతు పలికిన టీడీపీ స్థానిక నాయకులు
- వైసీపీ హయాంలోనే నిక్షేపాల నిర్ధారణ
- ఏఎండీకి కేంద్రం అనుమతి కూడా అప్పుడే

దేవనకొండ/కర్నూలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల అడవుల్లో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామీణులు పట్టుబిగించారు. 'యురేనియం తవ్వకాలు వద్దే వద్దు.. మా ప్రాణాలతో చెలగాటం ఆడద్దు. సేవ్ కప్పట్రాళ్ల మల.. సేవ్ పల్లెసీమలు..' అంటూ 12 గ్రామాల ప్రజలు ఏకమయ్యారు. రాజకీయ పార్టీలకు అతీతంగా వేలాదిగా తరలివచ్చిన జనం కప్పట్రాళ్లమలలోని కౌలుట్లయ్యస్వామి క్షేత్రంలో సమావేశమయ్యారు. పచ్చని గ్రామసీమల్ని కబళించే అణు ముప్పు నుంచి రక్షించాలని నినదించారు. శుక్రవారం కర్నూలు జిల్లా దేవనకొండ మండలం పరిధిలోని కప్పట్రాళ్ల, పి.కోటకొండ, బేతపల్లి, జిల్లెలబుడకల, మాదాపురం, గుండ్లకొండ, నెల్లిబండ, ఈదుల దేవరబండ, చెల్లిలిచెలిమిల, బంటుపల్లి, బండపల్లి, గుడిమిరాళ్ల గ్రామాల ప్రజలు యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా భేటీ అయ్యారు. 'వన విధ్వంసం.. జీవన విధ్వంసం' అని పేర్కొన్నారు. ప్రజలు, వన్యప్రాణులు, వనాలకు ముప్పు కలిగించే యురేనియం తవ్వకాలను అడ్డుకుందామని పిలుపునిచ్చారు.

6.80 హెక్టార్లలో 68 బోర్ హోల్స్

దేవనకొండ మండలంలో 468.25 హెక్టార్ల విస్తీర్ణంలో కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్(కౌలుట్లయ్యమల) భూములు ఉన్నాయి. కౌలుట్లయ్యమలగా పిలిచే ఈ అటవీ ప్రాంతం ఆదోని రేంజ్ పత్తికొండ సెక్షన్ పరిధిలోకి వస్తుంది. కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు ప్రధాన రహదారికి 10-15 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఈ అటవీ భూముల్లో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు గత వైసీపీ హయాంలో చేపట్టిన ప్రాథమిక సర్వేలో గుర్తించారు. భూమిలోపల ఎంత లోతులో, ఎంత పరిమాణంలో యురేనియం నిక్షేపాలు ఉన్నాయో నిర్ధారించిన తర్వాత తవ్వకాలు చేపడతారు. ఈ క్రమంలో కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ పరిధిలో యురేనియం నిల్వల నిర్ధారణ కోసం 6.80 హెక్టార్ల అటవీ భూమిలో 68 బోర్ హోల్స్ డ్రిల్లింగ్ చేయడానికి అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్(ఏఎండీ) ప్రాంతీయ డైరెక్టర్‌కు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 2022-23లోనే అనుమతి ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. తాజాగా ఈ విషయం తెలిసిన కప్పట్రాళ్ల పరిసర గ్రామాల ప్రజలు ఆగ్రహంతో రగలిపోతున్నారు. యురేనియం తవ్వకాలు వద్దని వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు.

కడప దెబ్బతో అప్రమత్తం

కడప జిల్లా పులివెందులలోని వేముల మండలం తుమ్మలపల్లె, కేకే కొట్టాల, మబ్బుచింతపల్లె, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లెల్లో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్) సంస్థ గతంలోనే యురేనియం తవ్వకాలు చేపట్టింది. దీంతో ఆ పల్లెల్లోని ప్రజలు చాలా నష్టపోయారు. ఈ విషయం తెలుసుకున్న కర్నూలు వాసులు తమ గ్రామాలకు ఆ పరిస్థితి రాకూడదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వీరికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కప్పట్రాళ్ల సర్పంచ్ చెన్నమ్మనాయుడు, టీడీపీ నేత విజయభాస్కరగౌడ్, గ్రామ పెద్ద రవిశర్మ తదితరులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. యురేనియం తవ్వకాల కోసం అడవిలోకి బోరు యంత్రాలు వెళ్లాల్సి వస్తే.. తమ శవాలను దాటుకునే వెళ్లాలని పేర్కొన్నారు. యురేనియంకు వ్యతిరేకంగా ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో యురేనియం వ్యతిరేక పోరాట కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ కమిటీల ఆధ్వర్యంలో ఉద్యమాలు సాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

అబద్ధాల్లో జగన్‌కు ఆస్కార్!

- రివర్స్ పేరుతో 15 నెలలు జాప్యం వల్లే

డయాఫ్రం వాల్ ధ్వంసం: నిమ్మల



అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలు చెప్పడంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవాచేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై ప్రభుత్వం వాస్తవాలు చెబుతుంటే.. ఆయన మాత్రం పదే పదే అసత్యాలనే వల్లె వేస్తున్నారని 'ఎక్స్'లో మండిపడ్డారు. 'కన్నతల్లిని, తోడబుట్టిన చెల్లిని మోసం చేసిన జగన్ వారి ఛీత్కారానికి గురయ్యారు. ప్రజా జీవనంలో ఉండేందుకు తనకు అర్హతలేదని ఆయనకు అర్థమైపోయింది. అందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. పోలవరం ఎత్తుపై తన రోత మీడియాలో అబద్ధాలు అచ్చువేసి గడచిన రెండు రోజులుగా దుష్ప్రచారం చేస్తున్నారు' అని విమర్శించారు. 'రివర్స్ టెండరింగ్ పేరుతో పనులు 15 నెలలు ఆలస్యం చేసి డయాఫ్రం వాల్ విధ్వంసానికి జగన్ కారకుడయ్యారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన రూ.3,800 కోట్ల నిధులను దారి మళ్లించారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించడానికి ఆయన రెండు దశలంటూ విభజించలేదా? 41.15 మీటర్ల ఎత్తుకు తగ్గించాలని కేంద్రానికి లేఖ రాయలేదా? మా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించి గరిష్ఠ స్థాయిలో 196.40 టీఎంసీల నీటిని నిల్వ చేసి.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తుంది' అని హామీ ఇచ్చారు.

పండుగకు స్వగ్రామానికి వస్తుండగా విషాదం

- లారీని ఢీకొన్న మినీ ట్రక్.. ముగ్గురి దుర్మరణం

జి.కొండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మరికాసేపట్లో ఇంటికి చేరుకుని పండుగ జరుపుకొందామనుకున్న వారి జీవితాలను రోడ్డు ప్రమాదం బలిగొంది. గురువారం తెల్లవారుజామున ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరు బైపాస్ రోడ్డులో మినీ ట్రక్ ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరో 10 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కూలీలు బొలగాని వెంకటేశ్వరరావు (మేస్త్రి) ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా పొదలిపురం గ్రామానికి బొప్పాయి కోత నిమిత్తం గత నెల 11న వెళ్లారు. దీపావళి పండుగ కావడంతో 30వ తేదీ రాత్రి స్వగ్రామానికి మినీ ట్రక్‌లో మొత్తం 13 మంది బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం చెవుటూరు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని వేగంగా ఢీ కొట్టింది. దీంతో మినీ ట్రక్ క్యాబిన్‌పై నిద్రిస్తున్న కొనకళ్ల నాగరాజు (20) కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు (28), డ్రైవర్ ఉయ్యాల సాయికుమార్ (26) విజయవాడలోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో పది మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన పుల్లారావు పరిస్థితి విషమంగా ఉంది.

పెళ్లైన కుమార్తెకు 'కారుణ్య' నిరాకరణ వీల్లేదు

- ప్రభుత్వ నిబంధనలు వివక్షాపూరితంగా ఉన్నాయి
- అమ్మాయికి పెళ్లైనా.. జీవితకాలం కుటుంబసభ్యురాలే
- ఎనిమిది వారాల్లో తగిన ఉద్యోగంలో నియమించండి
- దేవదాయ శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం



అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివాహమైందనే కారణంతో కారుణ్య నియామకం కింద చనిపోయిన ఉద్యోగి స్థానంలో కుమార్తెకు దేవదాయశాఖ అధికారులు ఉద్యోగం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. తండ్రి మృతి చెందేనాటికి భర్త నుంచి విడాకులు తీసుకొని, తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్నట్లు ఆ పెళ్లైన కుమార్తె ఆధారాలు చూపించాలన్న ప్రభుత్వ నిబంధనలు వివక్షాపూరితంగా ఉన్నాయని పేర్కొంది. పెళ్లికాని కుమార్తె, కుమారుడు విషయంలో ఇలాంటి నిబంధన ఏదీ లేదని గుర్తుచేసింది. పెళ్లి అయిందనే కారణంతో కారుణ్య నియామకం కింద ఉద్యోగం నిరాకరించడానికి వీల్లేదని న్యాయస్థానం ఇటీవల తేల్చిచెప్పింది. ప్రస్తుత కేసులో పిటిషనర్ సిరిపల్లి అమ్ములుకు ఉద్యోగం ఇవ్వకపోవడం చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది. ఆమెకు తక్షణం స్వీపర్‌గా లేదా తగిన ఉద్యోగం కల్పించాలని దేవదాయశాఖ అధికారులను ఆదేశించింది. 2013 జూన్ 24 నుంచి సర్వీసు బెనిఫిట్స్ కల్పించాలని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులను ఎనిమిది వారాల్లో అమలు చేయాలని తేల్చిచెప్పింది. అయితే జీత భత్య ప్రయోజనాలు కోరడానికి వీల్లేదని పిటిషనర్‌కు స్పష్టం చేసింది.

ఏం జరిగింది?

విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న వి.జగదీశ్ 2013 జూన్ 24న మరణించారు. సర్వీసులో ఉండగానే మరణించిన నేపథ్యంలో సర్వీసుతో పాటు ఇతర ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ పిటిషనర్ సిరిపల్లి అమ్ములు, అక్క ఏడుకొండలు మోహన ఆలయ ఈవోను పలుమార్లు కోరారు. జగదీశ్ వారసురాలిగా అమ్ములును ధ్రువీకరిస్తూ విజయవాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జారీ చేసిన వారసత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను ఈవోకు అందజేశారు. అయితే కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చేందుకు భర్త నుంచి విడాకులు తీసుకున్నట్లు కోర్టు ఇచ్చిన డిక్రీ తీసుకురావాలని అమ్ములును ఆదేశిస్తూ 2016లో ఈవో ప్రొసీడింగ్స్ ఇచ్చారు. తదనంతరం పిటిషనర్‌తో పాటు ఆమె అక్కకు తండ్రి మరణంతో వచ్చే ప్రయోజనాలు కల్పించిన అధికారులు.. కారుణ్య ఉద్యోగ కల్పన విషయంలో నిర్ణయం తీసుకోలేదు. భర్త వివరాలు తెలుసుకోలేకున్నానని, ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ అమ్ములు 2019 నుంచి 2023 వరకు పలుమార్లు దేవదాయశాఖ కమిషనర్, ఈవోకు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు స్పందించకపోవడంతో 2023లో హైకోర్టును ఆశ్రయించారు.

పెళ్లైనా, కాకున్నా.. కుటుంబసభ్యులే!

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కారుణ్య నియామకం కోసం నిబంధనల ప్రకారం అన్ని వివరాలను అమ్ములు సమర్పించినప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం 1999లో ఇచ్చిన జీవో 350 ప్రకారం కుమార్తె కూడా కారుణ్య నియామకానికి అర్హురాలని వివరించారు. దేవదాయ శాఖ కమిషనర్ కౌంటర్ దాఖలు చేస్తూ.. జగదీశ్ మరణించే నాటికి పిటిషనర్ తన భర్తతో కలిసి జీవిస్తోందని కోర్టుకు తెలిపారు. కారుణ్య నియామకం కింద పిటిషనర్‌కు ఉద్యోగం ఇచ్చేందుకు మృతుడి భార్య, ఇతర కుటుంబసభ్యుల(సోదరులు, అక్కాచెల్లెలు) సమ్మతి తెలపాల్సి ఉంటుందన్నారు. ఈ వివరాలు కోర్టు ముందు ఉంచడంలో పిటిషనర్ విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. కారుణ్య నియామకం విషయంలో ప్రభుత్వ ఉత్తర్వు.. పెళ్లైన కుమార్తె విషయంలో వివక్షాపూరితంగా ఉందని అభిప్రాయపడ్డారు. పెళ్లైన కుమార్తెను కుటుంబసభ్యురాలిగా గుర్తించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. పెళ్లైనా, కాకున్నా కుమారుడు, కుమార్తె ఇద్దరూ జీవితకాలం కుటుంబంలో సభ్యులేనని స్పష్టం చేశారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లను పునఃసమీక్షించాలి

- ఆలిండియా ఈక్వాలిటీ ఫోరం

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రమోషన్లలో రిజర్వేషన్లపై రాష్ట్రంలో అన్ని డిపార్ట్‌మెంట్లలో 2011 నుంచి ఇచ్చిన పదోన్నతులను సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం పునఃసమీక్షించాలని ఆలిండి యా ఈక్వాలిటీ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫోరం అనుబంధ, బీసీ, ఓసీ, మైనార్టీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జాతీయ అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు అప్పారావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పదోన్నతుల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం సీనియారిటీతో కూడిన రిజర్వేష ఏపీలో వారి కోటాకు మించి సీనియారిటీతో కూడిన రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల.. ఉన్నత స్థాయి పోస్టుల్లో ఇతర బీసీ, ఓసీ ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయి అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

8 నుంచి సీపీఎం ప్రజాపోరు

తిరువూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌చార్జీల పెంపు, అధిక ధరలు, మహిళలపై జరుగుతున్న దాడుల్ని నిరసిస్తూ ఈ నెల 8 నుంచి 15 వరకు ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీపీఎం ప్రకటించింది.

ఎవరెస్టు బేస్ క్యాంపుపై తెలుగుతేజం


ఎవరెస్టు బేస్ క్యాంపు వద్ద పోతుగుంట్ల చందన


- గుంటూరుకు చెందిన చందన ఘనత
- అక్టోబరు 20న బేస్ క్యాంపునకు చేరిక

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో అనుకున్నది సాధించింది. పర్వతాలను అధిరోహించాలనే కోరికతో కష్టపడి శిక్షణ పొందింది. 5364 మీటర్ల ఎత్తైన ఎవరెస్టు బేస్ క్యాంపునకు చేరి అరుదైన ఘనతను సాధించింది తెలుగుతేజం పోతుగుంట్ల చందన. గుంటూరుకు చెందిన ఈ అమ్మాయి రాజధాని అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతూనే.. తల్లిదండ్రులు పోతుగుంట్ల అనిల్-ధనలక్ష్మి ప్రోత్సాహంతో పర్వతారోహణపై ఆసక్తిని పెంచుకుంది. కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డైరెక్టర్ సిద్ధార్థ త్రిపాఠి ప్రోత్సాహంతో, ఎవరెస్టును అధిరోహించాలనే కోరికతో ఇతర విద్యార్థులతో కలసి 3 నెలల పాటు కఠోర శ్రమ చేసింది. కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులు, ఐదుగురు అధ్యాపకుల బృందం ఎవరెస్ట్ అధిరోహణకు బయలుదేరి వెళ్లింది. అక్టోబరు 13న లూక్లా నుంచి ఎవరెస్టు అధిరోహణ ప్రారంభించిన ఈ బృందం అక్టోబరు 20న ఎవరెస్టు బేస్ క్యాంపు చేరుకుంది. కాగా చందన, ఇతర బృందాన్ని మంత్రి అనిత అభినందించారు.

పూలన్‌దేవి తరువాత జగన్‌పైనే ఎక్కువ కేసులు: గంటా

విశాఖపట్నం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 'దేశంలోని రాజకీయ నాయకుల్లో చంబల్‌లోయ పూలన్‌దేవి తరువాత జగన్మోహన్‌రెడ్డిపైనే అత్యధికంగా 47 కేసులు న్నాయి. ఆయనకు పార్టీ నడిపే అర్హత లేదు' అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖపట్నంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ మునిగిపోతున్న నావ. విజయమ్మ రెండ్రోజుల క్రితం రాసిన లేఖతో ఆ పార్టీ పూర్తిగా మునిగిపోయింది. రుషికొండపై వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన భవనం విలువ మాత్రమే రూ.500 కోట్లు. భూమి విలువ, దానికి ప్రత్యేకంగా తీసుకున్న విద్యుత్, నీటి కనెక్షన్ల వ్యయం చూసుకుంటే ఇంకా ఎక్కువ ఉంటుంది. దానిని ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత ఐదేళ్లలో గాడి తప్పిన పాలనను చంద్రబాబు సరిచేశారు. సూపర్ సిక్స్‌లో ఒక్కొక్క హామీని నెరవేరుస్తూ వస్తున్నారు. ఐటీ మంత్రి లోకేశ్ కృషి ఫలితంగా విశాఖకు టీసీఎస్ వస్తోంది. భోగాపురం విమానాశ్రయానికి చేరుకోవడానికి ఫ్లైఓవర్లు, బీచ్ కారిడార్ నిర్మాణంపై సీఎంతో చర్చిస్తాం' అని గంటా అన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం
2 నవంబరు 2024



భోజన కుతూహలం

బార్లీ గొప్ప చెప్పతరమా!

రూక్షశీతో గురుః స్వాదుస్సరో విడ్వాత కృద్యవః
వృష్య స్సస్థైర్య కరోమూత్రమేదః పిత్తకఫాన్ జయేత్
పీనస శ్వాసకాసోరు స్తంభ కంఠత్వగామయాన్!

బార్లీ అంటే జ్వరాలు వచ్చినప్పుడు జావ కాచుకుని తాగేందుకు మాత్రమే వాడతారనే ఓ బలమైన అభిప్రాయం ఉంది. కానీ వరి కన్నా, గోధుమకన్నా బార్లీ అనేక రెట్లు ఆరోగ్యదాయకమైన, బలకరమైన, ప్రయోజనకరమైన ధాన్యం అని చాలా మందికి తెలీదు. ఆ మాటకొస్తే అన్ని ధాన్యాలకన్నా బార్లీయే ఎక్కువ శక్తిదాయకం కూడా! ఋగ్వేద కాలం నాటి ప్రజలకు బార్లీ ప్రధాన ఆహార ధాన్యం. వాళ్లు దానిని 'యవలు' అని పిలిచేవారు. ఈ పేరు రావటానికి కూడా ఒక కారణముంది. ఋగ్వేద కాలంలో అంగుళంలో ఆరో వంతు ప్రమాణాన్ని 'యవ' అనేవారు. బార్లీ అంగుళంలో ఆరోవంతు ఉంటుంది కాబట్టి దీనిని 'యవ' అన్నారు. ఇదే విధంగా వేలిముద్రల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కొన్ని వేళ్ల మీద గీతలు యవ కంకుల్లా కనిపిస్తాయి. అందుకే వేళ్ల మీద గీతల్ని యవ అంటారు. జ్యోతిష శాస్త్రంలో కూడా యావ అనేది ఒక యోగం. ఇక దీనికి శూకముండాఖ అనే పేరు కూడా ఉందని 'భోజన కుతూహలం' గ్రంథం పేర్కొంది.

అనేక గుణాలు...

బార్లీ గింజలకు 'లేఖనం' అనే గుణం ఉంది. అంటే జిడ్డుని తొలగింస్తుందన్నమాట. శరీరంలో జిడ్డుని కలిగించేది కొవ్వు. ఆ కొవ్వుని తగ్గించే శక్తి బార్లీకుంది. అందువ్ల స్థూలకాయులకు ఇది దివ్యౌషధమని ఆయుర్వేదం పేర్కొంటుంది. అంతే కాదు... మిగతా ధాన్యాలకన్నా ఆహార పీచు (డయటరీ ఫైబర్) బార్లీలో ఎక్కువ. 'గురు' అనే గుణం కలిగి ఉండటం చేత బార్లీ ఆలస్యంగా జీర్ణం అవుతుంది. అందుకని షుగరు రక్తంలో చేరకుండా, షుగరు సూచిక వెంటనే పెరగకుండా ఆపుతుంది. బార్లీ గింజలకు కడుపులో, మూత్రంలో, విరేచనంలో మంటను తగ్గించే గుణం ఉంది. మూత్రాశయంలో కలిగే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది కూడా. ఊపిరితిత్తుల్లో పేరిన కఫాన్ని తగ్గిస్తుంది. తేలికగా జీర్ణం అవుతుంది. గొంతులో వచ్చే వ్యాధుల్లో బార్లీ ఔషధంగా ఉపయోగపడ్తుంది. దీర్ఘకాలం వదలని పడిశ భారాన్ని తగ్గిస్తుంది. దగ్గుని, ఆయాసాన్ని, ఉబ్బసాన్ని నివారిస్తుంది. కండరాలు పట్టేయటాన్ని ఆపుతుంది. రక్త దోషాల్ని, దప్పికని తగ్గిస్తుంది. వడ దెబ్బ తగలకుండా ఆపుతుంది. గడ్డల్ని కరిగించే ఫెరూలిక్ యాసిడ్ అనే రసాయనం ఇందులో ఉంటుంది. ఇది ట్యూమర్లను, కేన్సర్ గడ్డల్ని కరిగిస్తుంది. కేన్సర్ ముదరకుండా సాయపడుతుంది.



- ఒకప్పుడు జావా ప్రాంతంలో బార్లీ ఎక్కువగా పండేది. ఆ సమయంలో బార్లీని యవలు అనేవారు. యవలు అనే పదం నుంచే జావా అనే పదం వచ్చింది.
- హరప్పా, మొహెంజోదారో నాగరికత సమయంలోనే బార్లీని పండించినట్లు ఆధారాలున్నాయి.

బార్లీ నీళ్లే కాదు...

బార్లీ గింజల్లో నీళ్లు పోసి, మెత్తగా ఉడికించి, వార్చిన జావ తాగుతుంటారు. కానీ, గింజల్ని వదిలేస్తుంటారు. ఇది సరికాదు. నీటిలో కరిగే స్వభావం ఉన్న పోషకాలు మాత్రమే ఈ జావలోకి వస్తాయి. విగిలిన మినరల్స్, ఫైబరు వగైరా ఆ గింజల్లోనే ఉండిపోతాయి. అందుకని గింజలతో సహా జావ తాగాలి. బార్లీ, గోధుమ పిండిని చెరిసగం కలిపి తయారు చేసిన చపాతీలు, పుల్కాలు ఎంతో మృదువుగానూ, ఆరోగ్యదాయకంగానూ ఉంటాయి. దోశలు ఇతర పిండివంటల్లో కూడా బార్లీని కలుపుకోవచ్చు. కొందరు బార్లీని దోరగా వేగించి మెత్తగా మిక్సీ పట్టిన పిండిని కూరల్లోనూ పులుసుల్లోనూ చిక్కదనం కోసం వాడుతుంటారు. ఈ పిండిని నీళ్లలో వేసి ఉడికించగా వచ్చిన చిక్కని గంజిలో ఉప్పు గానీ తీపి గానీ నిమ్మరసం గానీ కలుపుకుని తాగుతారు. సమానంగా పెరుగు కలిపి మిక్సీ పట్టిన బార్లీ మజ్జిగవల్ల ప్రోబయాటిక్ ప్రయోజనాలు కూడా అదనంగా అందుతాయి. బీ- విటమిన్ లోపంతో బాధపడేవారికి రోజూ రెండు చెంచాల బార్లీ పిండిని జావకాచి ఇస్తుంటే విటమిన్ మాత్రల అవసరం ఉండదు. మూత్రపిండాలలో రాళ్లు కరిగించే గుణం దీనికి ఉంది. విరేచనం ఫ్రీగా అవుతుంది. ఎక్కువగా నడవటం ద్వారా నీరు పట్టటం తగ్గుతుంది. చర్మానికి మంచి రంగుని, మృదుత్వాన్ని ఇస్తుంది. బీపీ త్వరగా తగ్గేందుకు తోడ్పడుతుంది. అతిసారం, కలరా లాంటి వ్యాధుల్లో చిక్కని బార్లీ జావని పెరుగు కలిపి, చిలికి, ఉప్పు, పంచదార వేసి తాగితే విరోచనాలు తగ్గుతాయి.

• గంగరాజు అరుణాదేవి

తీపి అంటే అందరికీ ఇష్టమే. అలా అని ఎప్పుడూ తినే స్వీట్లు తింటే బోర్ కొడుతుంది. అలాంటప్పుడు ఇలా కాస్త వెరైటీగా వీటిని తయారుచేసుకుని రుచిచూస్తే సూపర్ అనకుండా ఉండలేరు. మరి మీరూ ట్రై చేయండి.

తియ్యగా.. నోరూరించేలా..

వంటిల్లు

ఆప్రికాట్ డిలైట్

కావలసిన పదార్థాలు

ఆప్రికాట్- 200గ్రాములు, బిస్కట్ క్రంబ్స్- 50 గ్రాములు, స్పాంజ్ క్రంబ్స్- 50 గ్రాములు, పాలు- 200 ఎంఎల్, పంచదార- 100 గ్రాములు, కస్టర్డ్ పౌడర్- 30గ్రాములు.

తయారీ విధానం

- ముందుగా ఆప్రికాట్స్‌ని వేడినీళ్లలో రెండు గంటలు నానబెట్టుకోవాలి.
- ఒక బౌల్‌లో పాలు తీసుకుని వేడి చేయాలి. 50 గ్రాముల పంచదార, కస్టర్ పౌడర్‌ని మరుగుతున్న పాలలో వేసి బాగా కలపాలి. కాసేపయ్యాక దింపి పక్కన పెట్టుకోవాలి.
- మరొక బౌల్‌లో నానబెట్టుకున్న ఆప్రికాట్‌లను స్టవ్‌పై పెట్టి వేడి చేయాలి. అందులో పంచదార వేసి, పాకం వచ్చాక దింపుకోవాలి.
- చల్లారిన తరువాత ఆప్రికాట్‌లను మిక్సీలో వేసి బ్లెండ్ చేయాలి.
- ఒక ట్రేలో ఆప్రికాట్ మిశ్రమాన్ని లేయర్‌లా వేయాలి. తరువాత దానిపై బిస్కట్ క్రంబ్స్, స్పాంజ్ క్రంబ్స్‌ని లేయర్‌గా వేసుకోవాలి. దానిపై కస్టర్డ్ మిల్క్‌ని పోయాలి. ఇదే విధంగా మరో లేయర్ చేయాలి.
- ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లగా సర్వ్ చేసుకోవాలి.

తిరమిసు



కావలసిన పదార్థాలు

కోడిగుడ్లు- 5, పంచదార- పావుకేజీ, కాఫీ లిక్కర్- 15 ఎంఎల్, మస్కర్‌పోన్ చీజ్- 200 ఎంఎల్, వైట్ చాక్లెట్- 100ఎంఎల్, క్రీమ్- 200 ఎంఎల్, లేడీఫింగర్స్ - సరిపడా.

తయారీ విధానం

- ఒక కప్పులో వేడి నీళ్లు తీసుకుని కొంచెం పంచదార, కాఫీ లిక్కర్ వేసి ఇన్‌స్టంట్ కాఫీ తయారు చేసి పక్కన పెట్టుకోవాలి.
- ఒక బౌల్‌లో కోడిగుడ్డు పచ్చ సొన తీసుకుని కొద్దిగా పంచదార వేసి గిలక్కొట్టాలి. తరువాత వైట్ చాక్లెట్‌ను కలుపుకోవాలి.
- ఇప్పుడు మస్కర్‌పోన్ కలిపి మళ్లీ గిలక్కొట్టాలి. తరువాత క్రీమ్ వేసి కలియబెట్టి పక్కన పెట్టుకోవాలి.
- ఒక వెడల్పాటి ట్రేలో లేడీఫింగర్స్ (స్వీట్ స్పాంజ్ కేక్ బిస్కట్లు)ను వరుసగా పరుచుకోవాలి. దానిపై ఒక లేయర్‌లా మస్కర్‌పోన్ మిశ్రమాన్ని వేయాలి.
- తరువాత మరొకసారి లేడీఫింగర్స్‌ని వరుసగా పరుచుకోవాలి. దానిపై మరో లేయర్ మస్కర్‌పోన్ మిశ్రమాన్ని వేసి మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.
- సర్వ్ చేసుకునే ముందు కాఫీ పౌడర్‌తో గార్నిష్ చేసుకోవాలి.

సకోరా ఫిర్నీ



కావలసిన పదార్థాలు

పాలు- ఒక లీటరు, బియ్యం- 100గ్రాములు, యాలకులు- 10గ్రాములు, పిస్తా పలుకులు- 10గ్రాములు.

తయారీ విధానం

- స్టవ్‌పై ఒక కడాయిపెట్టి పాలు పోసి మరిగించాలి.
- బియ్యం శుభ్రంగా కడిగి ఆరబెట్టుకోవాలి. ఆరిన తరువాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిని పాలల్లో వేసి మరిగించుకోవాలి. చిక్కగా అవుతున్న సమయంలో పంచదార వేయాలి.
- యాలకుల పొడి వేసి దింపుకోవాలి.
- ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లబడిన తరువాత పిస్తా పలుకులతో గార్నిష్ చేసుకుని సర్వ్ చేయాలి.

కొడాలి వెంకటేశ్వరరావు
ఎగ్జిక్యూటివ్ చెఫ్,
గోల్కొండ హోటల్,
హైదరాబాద్.
ఫోన్: 9666003930



షాహీ తుక్డా



కావలసిన పదార్థాలు

బ్రెడ్ ప్యాకెట్ ఒకటి, పంచదార- రెండు కేజీలు, నెయ్యి- ఒక కేజీ, యాలకుల పొడి- ఒక టీస్పూన్, బాదం పలుకులు- 100గ్రాములు, పిస్తా- 100 గ్రాములు, రబ్డీ- 500 గ్రాములు, నిమ్మకాయలు- రెండు.

తయారీ విధానం

- ముందుగా బ్రెడ్‌ని ముక్కలుగా కట్ చేసుకోవాలి.
- తరువాత నిమ్మకాయ ముక్కలతో పంచదార పానకం తయారు చేసుకోవాలి.
- ఒక కడాయిలో నెయ్యి వేసి వేడి అయ్యాక బ్రెడ్ ముక్కలను గోల్డెన్ బ్రౌన్ రంగులోకి మారే వరకు వేయించుకోవాలి.
- ఇప్పుడు ఆ బ్రెడ్ ముక్కలను పంచదార పానకంలో వేయాలి. కాసేపయ్యాక తీసి ట్రేలో పెట్టుకోవాలి.
- ఆ బ్రెడ్ ముక్కలపై రబ్డీ పోయాలి. బాదం పలుకులు, పిస్తా పలుకులతో గార్నిష్ చేసుకోవాలి.
- ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లని షాహీ తుక్డా సర్వ్ చేసుకోవాలి.

పేరెంటింగ్

పిల్లల్లో సానుకూల దృక్పథానికి...

సాధారణంగా పిల్లల్లో ఎన్నో భయాలు, అపోహలు, నెగెటివ్ ఆలోచనలు ఉంటాయి. వీటన్నింటినీ తట్టుకుని పిల్లలు సానుకూల దృక్పథంతో ఎదగడానికి తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను స్వీకరిస్తూ ఉన్నత లక్ష్యాలవైపు అడుగులు వేసేలా పిల్లల ఆలోచనా తీరును సరిదిద్దడం ఎలానో తెలుసుకుందాం!

- పిల్లలకు చిన్న కష్టం కూడా తెలియకుండా పెంచాలని తల్లిదండ్రులు అనుకుంటారు. ఇలా చేస్తే పిల్లలు సున్నితమనస్కులుగా మారతారు. చిన్న సమస్య ఎదురైనా భూతద్దంలో చూస్తూ భయపడుతుంటారు. అలా కాకుండా సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో పిల్లలకు తెలియజేయాలి.
- తోటి పిల్లలు కొడుతున్నారనో, తిడుతున్నారనో చెప్పినపుడు సాధారణంగా తల్లిదండ్రులు మీరు కూడా అలాగే చేయండి అనేస్తుంటారు. ఇది సమర్థనీయం కాదు. తోటివారితో స్నేహంగా ఎలా మెలగాలో పిల్లలకు నేర్పించాలి. చక్కని మాటతీరుతో స్నేహపూర్వకంగా ఉండేలా ప్రోత్సహించాలి.
- కొంతమంది పిల్లలు హింసాత్మక ధోరణితో ఉంటారు. ఇంటి చుట్టూ ఉండే కుక్కలను, పిల్లులను రాళ్లతో కొడుతుంటారు. దుడుకు స్వభావంతో తోటి పిల్లలతో గొడవపడుతుంటారు. పిల్లల్లో ఈ స్వభావాన్ని మార్చే ప్రయత్నం చేయాలి. సందర్భానుసారం దయ, ప్రేమ, స్నేహం గురించి వివరిస్తూ ఎవరినీ బాధించకూడదని నచ్చచెప్పాలి.
- తోటి పిల్లలకు హోంవర్క్‌లో సహాయం చేయడం, పాఠశాలలో లంచ్ బాక్స్ షేర్ చేసుకోవడాన్ని ప్రోత్సహించాలి. పిల్లలకు బాధ కలిగినపుడు దాన్ని స్నేహితులతో, కుటుంబ సభ్యులతో పంచుకోవడం నేర్పించాలి. అలాగే తోటివారి సమస్యల గురించి ఆలోచించే అలవాటు చేయాలి. ఎదుటివారికి సహాయం చేయడంలో ఉన్న ఆనందాన్ని పిల్లలకు అనుభవంలోకి తెచ్చే ప్రయత్నం చేయాలి.



- పిల్లలతో తల్లిదండ్రులు ఎప్పుడూ ప్రేమగా మాట్లాడాలి. వారిపై చిరాకు, కోపం ప్రదర్శించకూడదు. పిల్లలు ఏదైనా మంచి పనిచేసినపుడు వారిని అభినందిస్తూ ప్రోత్సహించాలి.
- ఓటమి ఎదురైనపుడు పిల్లలు కృంగిపోకుండా అది సహజంగా జరిగేదే అన్న ధోరణిలో తల్లిదండ్రులు సర్దిచెప్పాలి. గెలుపు, ఓటములను; సంతోషం, బాధలను సమానంగా చూడగలిగే మనోధైర్యాన్ని మరోసారి విజయం సాధించగలమనే ఆత్మవిశ్వాసాన్ని కల్పించాలి.

నవ్య | చిత్రజ్యోతి



పాటతో పూర్తి

తమిళ హీరో ధనుష్, నాగార్జున, రష్మిక కాంబినేషన్‌లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం ఓ పాటను ప్రస్తుతం చిత్రీకరిస్తున్నారు. ఈ పాటతో షూటింగ్ పూర్తవుతుందని నిర్మాతలు చెప్పారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంతో జరుగుతోందని తెలిపారు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 15న విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. పాత్రలు, వాటి నేపథ్యాలను లోతుగా ఆవిష్కరించే విధంగా టీజర్ ఉంటుందని తెలిపారు. దీపావళి సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. జిమ్ సర్ఫ్ కీలక పాత్ర పోషిస్తున్న 'కుబేర' చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలవుతుంది.



ఆశించిన ఫలితాన్ని ఇచ్చారు

సుజీత్, సందీప్

హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. రీసెంట్‌గా విడుదలై ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించిన దర్శకులుగా తొలి చిత్రంతోనే తమ ప్రతిభ నిరూపించుకున్నారు సుజీత్, సందీప్. సినిమా సక్సెస్ అయిన సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ విజయం సాధిస్తేనే మనుగడ అనుకున్నాం. అందుకే పట్టుదలగా పనిచేశాం. ప్రేక్షకులు మేము ఆశించిన ఫలితాన్ని ఇచ్చారు. ఈ దీపావళిని ఎంతో స్పెషల్ చేశారు. థియేటర్లలో ప్రేక్షకులు సినిమా చూస్తూ చివరలో స్టాండింగ్ ఓవేషన్ ఇస్తున్నారు. మేము 'క' కథ అనుకునప్పుడు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అని భయపడ్డాం. కానీ, ఈ రోజు ప్రేక్షకులు కథకు చాలా కనెక్ట్ అవుతున్నారు. మూవీకి సామ్ సీఎస్ ఇచ్చిన మ్యూజిక్ పెద్ద ప్లస్ పాయింట్ అయ్యింది' అని తెలిపారు. దర్శకుడు సందీప్ మాట్లాడుతూ ' సోషల్ మీడియాలో ఎక్కడైనా సినిమా గురించి నెగెటివ్‌గా వస్తే ప్రేక్షకులే వాటికి సమాధానాలు ఇస్తున్నారు. ఏ కథకైనా ప్రిమేజ్ ముఖ్యం. 'క' సినిమాకు మేము చేసింది అదే. ఏ కథ అయినా ఫలానా ఏ, బీ, సీ ఆడియెన్స్‌కు నచ్చుతుందని విభజించుకుంటాం. 'క' సినిమా మల్టీప్లెక్స్ ఆడియెన్స్‌కు బాగా రీచ్ అవుతుంది. సీ సెంటర్‌లో కొంత తక్కువగా ఆదరిస్తారు అనుకున్నాం. కానీ ఈ రోజు రిజల్ట్ చూస్తుంటే సీ సెంటర్ ఆడియెన్స్ మల్టీప్లెక్స్ ఆడియెన్స్ కన్నా ఎక్కువగా ఇష్టపడుతున్నారు. బడ్జెట్ కాదు సబ్జెక్ట్ బాగుంటే ఇంటర్నేషనల్ లెవెల్‌కు సినిమాలు తీసుకెళ్లవచ్చని డైరెక్టర్ రాజమౌళి చెప్పినట్లు మా రాబోయే సినిమాలను సరికొత్తగా రూపొందించే ప్రయత్నం చేస్తాం' అని చెప్పారు.



నటుడు చారుహాసన్‌కు అస్వస్థత

లెజండరీ నటుడు, 93 యేళ్ళ చారుహాసన్ అనారోగ్యం కారణంగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఆయనకు ఆపరేషన్ చేయనున్నట్టు ఆయన కుమార్తె, సినీ నటి సుహాసిని మణిరత్నం ఓ వీడియో సందేశంలో వెల్లడించారు. అగ్రనటుడు కమల్ హాసన్‌కు స్వయానా అన్న అయిన చారుహాసన్‌ను గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో పాటు వృద్ధాప్య సమస్యలు వేధిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయన ఉన్నట్టుండి గురువారం అస్వస్థతకు లోనుకావడంతో నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే తన తండ్రికి చిన్నపాటి ఆపరేషన్ చేయనున్నారని, ఇందుకోసం ఆయన సిద్ధమవుతున్నారని పేర్కొంటూ ఆస్పత్రి పడకపై ఉన్న తన తండ్రితో కలిసి దిగిన ఒక ఫోటోను సుహాసిని సోషల్ మీడియాలో షేర్ చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)



సంక్రాంతికి సిద్ధం

వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలయ్యే చిత్రాల జాబితాలోకి మరో పేరు చేరింది. విక్టరీ వెంకటేశ్ హీరోగా నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. వెంకేటశ్ లుంగీ ధరించి, తుపాకీ పట్టుకుని సీరియస్ పోజులో ఉన్న పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఆయన భార్య పాత్రధారి ఐశ్వర్య రాజేశ్ సంప్రదాయ దుస్తుల్లో, మాజీ లవర్ పాత్రలో మీనాక్షి చౌదరి మోడరన్ లుక్‌లో కనిపించారు.ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుందని, ప్రస్తుతం డబ్బింగ్ పనులు జరుగుతున్నాయనీ నిర్మాత శిరీష్ చెప్పారు. సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

రాజకీయ నేపథ్యంలో సినిమా చేస్తా



నాగవంశీ

'మహానటి', 'సీతా రామం' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తెలుగులో నటించిన హ్యాట్రిక్ చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. అక్టోబరు 31న విడుదలైన ఈ సినిమాకు మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ లభించింది. ఈ సందర్భంగా నిర్మాత నాగవంశీ, దర్శకుడు వెంకీ అట్లూరి ప్రెస్ మీట్ నిర్వహించారు. నాగవంశీ మాట్లాడుతూ'సోషల్ మీడియాలో ఎక్కడా సినిమా గురించి ఒక్క నెగెటివ్ కామెంట్ కూడా కనిపించలేదు. అందుకే ప్రేక్షకులకు థాంక్స్ చెప్పేందుకు మీడియా ముందుకి వచ్చాం. థాంక్స్ అనేది చాలా చిన్న మాట. సినిమా పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకు మాటల్లో చెప్పలేనంత సంతోషం కలుగుతోంది. బాలకృష్ణ 'ఎన్‌బికె 109' టీజర్, విడుదల తేదీకి సంబంధించిన అప్డేట్ వారం రోజుల్లో ఇస్తాం. ప్రస్తుతం మా బేనర్‌లో పలు సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. రాబోయే రోజుల్లో ఒక భారీ రాజకీయ నేపథ్యమున్న సినిమా చేసే ఆలోచన ఉంది' అని అన్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ 'ప్రీమియర్ షోల నుంచే సినిమాకి ఎంతో మంచి టాక్ వచ్చింది. నాకు చాలా ఆనందంగా ఉంది. దర్శకుడిగా ఇంత మంచి పేరు రావడం చాలా అరుదైన విషయం. ఖర్చు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని సినిమా చూసిన ప్రేక్షకులు సంతృప్తి చెందుతున్నారు. సంభాషణలకు మంచి పేరు వస్తుండటం సంతోషంగా ఉంది. మణిరత్నం, త్రివిక్రమ్ స్ఫూర్తితోనే నేను సినీ పరిశ్రమలోకి వచ్చాను. నా సంభాషణల్లో త్రివిక్రమ్ ప్రభావం ఎంతో కొంత ఉంటుంది.' అని అన్నారు.


రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులతో గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీరా నజీర్

భారత్ అంటేనే భిన్నత్వంలో ఏకత్వం

- గవర్నర్ అబ్దుల్ నజీర్
- రాజ్‌భవన్‌లో పలు రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవం

అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం, చరిత్ర, భాషలు, మతాల వంటి భిన్నత్వంలోనూ ఏకత్వం అనే దారంతో భారతదేశం ముడిపడిందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో పలు రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్, హరియాణా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు, అండమాన్ నికోబార్, చండీగఢ్, ఢిల్లీ, లక్షద్వీప్, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాలు ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జరుపుకొన్నాయి. ఈ వేడుకలను "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" కింద రాజ్‌భవన్‌లో కూడా నిర్వహించారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో పాటు ఆయన సతీమణి సమీర నజీర్ పాల్గొన్నారు. ఆవిర్భావ వేడుకలు జరుపుకొంటున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రజలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా రాష్ట్రాల సంప్రదాయ నృత్యరూపాలు ప్రదర్శించారు. గేయాలు ఆలపించారు.

అభివృద్ధిలో ఏపీ కొత్త మైలురాళ్లను చేరాలి

- జేపీ నడ్డా, అమిత్‌షా, రాహుల్ ఆకాంక్ష
- ప్రజలకు రాష్ట్రావిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నేతలు

న్యూఢిల్లీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అమిత్ షా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా చైతన్యవంతులైన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలకు ప్రతిరూపమైన ఆంధ్రప్రదేశ్‌ పురోగతికి, స్థిరత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ అందమైన రాష్ట్రం నిరంతరం అభివృద్ధి చెందుతూ, రాబోయే సంవత్సరాల్లో అభివృద్ధి, శ్రేయస్సులో కొత్త మైలురాళ్లను చేరాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని నడ్డా పేర్కొన్నారు.

దేశ నిర్మాణంలో ఆంధ్రాది ఘనమైన పాత్ర: అమిత్‌షా

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. వైవిధ్యమైన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలతో ఆంధ్రప్రదేశ్ భారతదేశ నిర్మాణంలో విస్మరించలేని ఘనమైన పాత్రను పోషించింది. ఈ శుభ సందర్భాన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మరింత మేలు కలగాలని, రాష్ట్రం అభివృద్ధిలో నూతన శిఖరాలను చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని అమిత్ షా పేర్కొన్నారు.

ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు: రాహుల్

ఆంధ్రప్రదేశ్‌తోపాటు అండమాన్, నికోబార్, ఛత్తీస్‌గఢ్, చండీగఢ్, ఢిల్లీ, హరియాణా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, పుదుచ్చేరి, తమిళనాడు, లక్షద్వీప్ ప్రజలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా రాష్ట్రాల చురుకైన సంస్కృతులు, విభిన్న భాషలు, గొప్ప చరిత్రలు, సంప్రదాయాలు దేశానికి బలమని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల ఐక్యత, సహకారం దేశాన్ని సుసంపన్నంగా మారుస్తుందని తెలిపారు.

టీటీడీ బోర్డుకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుల పేర్లతో కూడిన జాబితాను ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అదే రోజు రాత్రి జీవో జారీ కావాల్సి ఉంది. కానీ ఇద్దరు సభ్యులపై అభ్యంతరాలు రావడంతో సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని జీవోను తాత్కాలికంగా నిలిపి వేయించారు. చంద్రబాబు పునఃపరిశీలించి వారి నియామకాన్ని ఓకే చేశారు. దీంతో శుక్రవారం చైర్మన్, 24 మంది సభ్యులతో కొత్త బోర్డు ఏర్పాటుకు జీవో జారీ చేశారు. బోర్డు సభ్యుడిగా బీజేపీ నుంచి బి.భానుప్రకాశ్ రెడ్డి (తిరుపతి)కి కొత్తగా అవకాశం కల్పించారు. బీజేపీ కార్యాలయం భానుప్రకాశ్ రెడ్డి పేరును ప్రతిపాదించడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే సమయంలో ఆయన పేరును పొందుపరిచింది. దేవదాయ శాఖ కార్యదర్శి, దేవదాయ శాఖ కమిషనర్, టీటీడీ ఈవోతో పాటు తుడా చైర్మన్‌ను ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నియమించారు.

వివిధ రాష్ట్రాలకు ప్రాధాన్యం

కొత్త బోర్డులో వివిధ రాష్ట్రాలకు ప్రాధాన్యం కల్పించారు. ఏపీ నుంచి గరిష్ఠంగా 13మందికి చోటు దక్కింది. తెలంగాణ నుంచి ఐదుగురికి, కర్ణాటక నుంచి ముగ్గురికి, తమిళనాడు నుంచి ఇద్దరికి, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించారు. ముగ్గురు మహిళలకు స్థానం దక్కింది.

6న ప్రమాణస్వీకారం

కొత్త పాలక మండలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో వారి ప్రమాణ స్వీకారానికి లైన్ క్లియర్ అయింది. ఈ నెల 6వ తేదీన చైర్మన్‌తో పాటు 24 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ముహూర్తం కూడా నిర్ణయించారు. అదే రోజు తిరుమల తిరుపతిలో నూతన బోర్డు కొలువుదీరనుంది.

ఇవీ అభ్యంతరాలు

మహారాష్ట్ర నుంచి సభ్యుడిగా ఎంపికైన సౌరబ్ బోరా విషయంలో కొంత గందరగోళం ఏర్పడింది. ఆర్థిక వ్యవహారాల్లో అనుభవం ఉన్న బోరా గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి భారీగా అప్పులు సమకూర్చడంలో గట్టిగా పని చేశారు. దాంతో నాటి సీఎం జగన్ అందుకు ప్రతిఫలంగా రెండుసార్లు బోర్డు సభ్యుడిగా ఆయనకు అవకాశం కల్పించారు. తాజాగా కూటమి ప్రభుత్వంలోనూ ఆయనకు అవకాశం దక్కింది. బోరాపై అనేక ఆరోపణలున్నాయని కొంతమంది సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే తమిళనాడు నుంచి బోర్డు సభ్యుడిగా కృష్ణమూర్తి నియామకంపై కూడా కొన్ని అభ్యంతరాలు వచ్చాయి. మరోవైపు వీరిద్దరి విషయంలో ఒక ప్రధాన సమస్య కూడా తలెత్తింది. దేవదాయ శాఖ చట్టంలోని సెక్షన్ 19కే ప్రకారం ఒకే వ్యక్తిని వరుసగా మూడుసార్లు బోర్డు సభ్యుడిగా నియమించకూడదు. బోరా, కృష్ణమూర్తి ఇద్దరు రెండు కంటే ఎక్కువసార్లు నియమితులయ్యారు. వీరిద్దరి కోసం ప్రభుత్వం దేవదాయ శాఖ చట్టంలోని సెక్షన్ 154ను అమలు చేసింది. సెక్షన్ 154 ప్రకారం దేవదాయ శాఖ చట్టంలోని ఏ నిబంధనకైనా ప్రభుత్వం మినహాయింపు ఇచ్చుకోవచ్చు. అప్పట్లో జగన్ ప్రభుత్వం కూడా వీరి విషయంలో ఇదే నిబంధనను అమలు చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే మినహాయింపు ఇచ్చింది. కొత్త పాలక మండలిని నియమిస్తూ దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ జీవో విడుదల చేశారు.

గ్రామీణ శిక్షణ సంస్థకు గ్రహణం వీడేనా?

- వైసీపీ హయాంలో నిర్వీర్యమైన ఎస్ఐఆర్‌డీ
- పీఆర్‌లో ఉండే సంస్థ జీఎస్‌డబ్ల్యూఎస్‌లో విలీనం
- తిరిగి పీఆర్‌లో కలిపేందుకు మీనమేషాలు

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధులకు శిక్షణ అందించే స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఐఆర్‌డీ)కి కూటమి సర్కార్‌లోనైనా గ్రహణం వీడుతుందా? గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పరిధిలో ఉన్న ఈ విభాగాన్ని పంచాయతీరాజ్‌శాఖలో విలీనం చేస్తారా? స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చేందుకు నిధులు రాబడతారా?.. అనే ప్రశ్నలు అధికార యంత్రాంగంలో వినిపిస్తున్నాయి. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అందించే నిధులతో రాష్ట్రంలోని స్థానిక సంస్థల ప్రతినిధులకు శిక్షణ అందించే ఈ సంస్థను గత వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. కేంద్ర ప్రభుత్వం శిక్షణ కోసం ఇస్తున్న ఏటా రూ.250కోట్లను వాడుకోవడంలో నిర్లక్ష్యం చేసింది. ఎస్ఐఆర్‌డీ భవన నిర్మాణాలకు కేంద్రం ఇచ్చే నిధులపై కూడా ఆసక్తి చూపలేదు. కేంద్ర నిధులకు రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉండటంతో ఆ పథకాలపై గత ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో ఉన్న ఎస్ఐఆర్‌డీని గతంలో లాగా పంచాయతీరాజ్ శాఖలో విలీనం చేయాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్‌శాఖలో ఉన్న ఈ విభాగాన్ని గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ శాఖలో విలీనం చేసిందని, దీనివల్ల ఇబ్బందులు వస్తాయని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం వెంటనే ఎస్ఐఆర్‌డీని పంచాయతీరాజ్ శాఖలోకి విలీనం చేయాలని, ఆమేరకు ఫైల్ పంపించాలని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌ను ఆదేశించారు. దీంతో ఎస్ఐఆర్‌డీని పీఆర్‌లో విలీనం చేసేందుకు అవసరమైన ఆర్థిక శాఖ అనుమతులు తీసుకుని ఫైల్‌ను సీఎం కార్యాలయానికి చేర్చారు. అయితే సీఎం కార్యాలయం నుంచి ఈ ఫైల్ బయటకు రాకపోవడంతో ఏం జరిగిందనే ఉత్కంఠ నెలకొంది. సీఎం స్వయంగా ఆదేశించిన అంశానికి సంబంధించిన ఫైల్ ఎందుకు ఆగిపోయిందో అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం మాదిరిగా ఇక్కడా ఒక పెద్ద శిక్షణ సంస్థను ఏర్పాటు చేసి అందులో అన్ని శాఖలకు సంబంధించిన శిక్షణ అందించాలని కొంతమంది అధికారులు సీఎంకు సలహా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో సీఎం ఫైలును పక్కన పెట్టారని అనుకుంటున్నారు. అయితే ఎస్ఐఆర్‌డీకి, ఆ తరహా శిక్షణ సంస్థకు సంబంధం లేదని అని మరికొందరు అంటున్నారు. కాగా, వైసీపీ సర్కార్ ఎస్ఐఆర్‌డీని గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో విలీనం చేశారు. నిధులు, సిబ్బందిని పంచాయతీరాజ్‌శాఖ నుంచి తీసుకుని... శాఖను మాత్రం జీఎడీలో ఉంచారు. తమ పరిధిలో లేకపోవడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపలేకపోయింది. దీంతో ఈ సంస్థకు ఐదేళ్లపాటు నిధులు కరువయ్యాయి. శిక్షణ కూడా నిలిపేశారు. కేవలం అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు ఇస్తున్నారంతే!

సీఎం ఆమోదిస్తే.. అభివృద్ధికి అడుగులు

ఎస్ఐఆర్‌డీని పీఆర్ అండ్ ఆర్డీలో విలీనం చేసేలా సీఎం నుంచి ఆమోదం లభిస్తే ఈ సంస్థ కార్యక్రమాలు ఊపందుకుంటాయని అంటున్నారు. ఇప్పటికే రూ.250 కోట్లతో అమరావతిలో ఎస్ఐఆర్‌డీ సంస్థ భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నారు. రూ.22 కోట్లు వెచ్చించి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. సంస్థ విలీనమైతే ఈ నిధులు రాబట్టుకోవచ్చు. సంస్థలో పనిచేసే సిబ్బంది, ప్రిన్సిపాళ్లు, ఇన్‌స్ట్రక్టర్లు పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన ఉద్యోగుల బదిలీలను ఏ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలోనని అధికారులు అయోమయంలో ఉన్నారు.


జేఏసీ సమావేశానికి హాజరైన రాజధాని రైతులు, మహిళలు, రైతు కూలీలు

ఇప్పటి దాకా ఉద్యమ కమిటీ.. ఇక రాజధాని అభివృద్ధి కమిటీ

- తుళ్లూరులో రైతుల జేఏసీ భేటీ
- 29 గ్రామాల అన్నదాతలు హాజరు

తుళ్లూరు, నవంబరు 1: జగన్ ప్రభుత్వ మూడు ముక్కలాటపై రైతు జేఏసీ ఇప్పటిదాకా ఉద్యమ కమిటీగా నడిచిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఇక అది రాజధాని అమరావతి అభివృద్ధి కమిటీగా ఉంటుందని రైతు జేఏసీ సమన్వయ కమిటీ స్పష్టం చేసింది. శుక్రవారమిక్కడ రైతు జేఏసీని కొనసాగించాలా.. వద్దా.. అనే దాని మీద అభిప్రాయాలను రైతులు, మహిళలు, రైతు కూలీలతో కమిటీ సమావేశమైంది. 29రాజధాని గ్రామాల రైతులు హాజరయ్యారు. రాజధాని ప్రకటించినప్పుడే రైతు జేఏసీ ఏర్పాటు చేసి.. అప్పటి టీడీపీ ప్రభుత్వానికి సలహాలిస్తూ రైతు సమస్యలను దాని దృష్టికి తీసుకెళ్లామని జేఏసీ నేతలు గుర్తుచేశారు. జగన్ సర్కారు రైతులను నానా రకాలుగా ఇబ్బందులు పెట్టడంతో ఉద్యమించామన్నారు. ఇకముందు కూడా ఈ జేఏసీ కొనసాగాలని మెజారిటీ రైతులు అభిప్రాయపడ్డారు.

జగన్ ప్రభుత్వానికి 50 కేసుల్లో చుక్కెదురు..!

అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని ఉద్యమించిన సందర్భంగా.. జగన్ సర్కారు రైతులపై నమోదు చేసిన 50కేసుల్లో దానికి చుక్కెదురైందని అమరావతి లీగల్ అడ్వైజర్ మాదల వాసు తెలిపారు. లోకల్ క్రిమినల్ కేసులను జీవో ద్వారా ఎత్తివేయడం కుదరదన్నారు. ప్రభుత్వం వేరు.. న్యాయ వ్యవస్థ వేరని.. కేసుల్లో వాయిదాలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. కోర్టు ఆ కేసులను కొట్టేవేసే అవకాశం ఉందన్నారు. ప్రతి 3నెలలకొకసారి అమరావతికి ఏమి కావాలో రైతు జేఏసీ సమీక్షించుకోవాలన్నారు. రైతుకూలీలకు ఉపాధి ఎలాగో ప్రభుత్వంతో మాట్లాడాల్సి ఉంది. అందరూ బాధ్యతతో నడుచుకుని అమరావతి నిర్మాణంలో పాలుపంచుకోవాలని పిలుపిచ్చారు. సమన్వయ కమిటీ సభ్యుడు పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ.. వచ్చే డిసెంబరు నాటికి అన్ని కేసులూ కొట్టేవేసే అవకాశం ఉందని భరోసా ఇచ్చారు. చార్జిషీట్లు వేసిన కేసుల్లో ఏమీ చేయలేమని.. విచారణ ఎదుర్కోవలసిందేనన్నారు. తనపై 102 కేసులున్నాయని, ఒక్క వాయిదాకు కూడా గైర్హాజరు కాలేదన్నారు. చాలామంది వాయిదాలకు హాజరుకాకపోవడం వల్ల కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుందని చెప్పారు. రాజధాని ఉద్యమం శాంతియుతంగా జరిగిందని, అక్రమంగా పెట్టిన కేసులు నిలబడవన్నారు. జేఏసీ ట్రెజరీ పువ్వాడ సురేంద్ర, రైతు జేఏసీ సమన్వయ కమిటీ సభ్యులు ధనేకుల రామారావు, బెల్లంకొండ నరసింహారావు, గొర్నేని స్వరాజ్యరావు, ఆలూరి శ్రీనివాసరావు, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, జమ్ముల శ్యాం కిషోర్, కొండెపాటి సతీశ్ చంద్ర, ఆకుల ఉమామహేశ్వరావు, జొజాల చలపతిరావు, దళిత జేఏసీ నేత చిలకా బసవయ్య, అనుమోలు బాలమురళి కృష్ణ, జొన్నలగడ్డ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కత్తులతో నరికి.. గునపాలతో పొడిచి..

- ఒకే కుటుంబంలో ముగ్గురి దారుణ హత్య
- పారిపోయేవారిని వెంటాడి మరీ నరికేశారు
- కాకినాడ జిల్లా శలపాకలో ఘోరం


బత్తుల చిన్నయ్య


బత్తుల రాజు


బత్తుల రమేశ్

కాకినాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో దారుణం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గురువారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. ఎదురింట్లో ఉంటున్న మరో కుటుంబం ఈ హత్య చేయడం తీవ్ర కలకలం రేపింది. పాతకక్షలు, వివాహేతర సంబంధ వివాదం నేపథ్యంలో ఈ హత్యలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. గొల్లపాలెం స్టేషన్ పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన బత్తుల చిన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు ఎదురెదురు ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. నాగేశ్వరరావు భార్య బేబీతో బత్తుల చిన్నయ్యకు వివాహేతర సంబంధం ఉందంటూ ఆయన కుటుంబం గ్రామంలో ప్రచారం చేస్తోంది. నాగేశ్వరరావును, ఆయన భార్యను చిన్నయ్య అసభ్య పదజాలంతో తిడుతుండేవాడు. దీనిపై నాగేశ్వరరావు కొన్నేళ్ల కిందట గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేయడంతో అదుపులో ఉండాలని చిన్నయ్యకు హితవు చెప్పారు. ఆ తర్వాత కూడా ఇరు కుటుంబాల మధ్య గొడవలు కొనసాగాయి. మూడురోజుల కిందట కూడా చిన్నయ్య, నాగేశ్వరరావు కుటుంబాలు గొడవపడ్డాయి. ఈ వివాదం గురువారం రాత్రి మళ్లీ పెద్దదయింది. అప్పటికే బత్తుల కుటుంబంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న నాగేశ్వరరావు, ఆయన భార్య బేబీ, కుమారులు దాడికి దిగారు. బత్తుల చిన్నయ్య(42),అతని తమ్ముడు బత్తుల రాజు(40), చిన్నయ్య కొడుకు బత్తుల రమేశ్(25), బంధువు బత్తుల శ్రీనుపై కత్తులతో దాడిచేసి కడుపు భాగంలోనూ, ఛాతీ, మెడపై నరికేశారు. బత్తుల శ్రీను గాయాలతో తప్పించుకోగా మిగిలిన ముగ్గురినీ గునపాలతో విచక్షణారహితంగా పొడిచేశారు. పారిపోయే ప్రయత్నం చేసినా వెంటాడి మరీ నరికేశారు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ముగ్గురి తలలపై గునపాలతో పొడిచారు. ఇనుప రాడ్లతో తలపై బలంగా మోదడంతో ఇద్దరికి మెదడు బయటకు రాగా, కళ్లు ఛిద్రమయ్యాయి. మరొకరి తల దాదాపుగా వేరుపడిపడింది. హత్య అనంతరం మృతదేహాలపైకి నిందితులు ద్విచక్రవాహనాలను ఎక్కించి మరింత నుజ్జునుజ్జు చేశారు. మృతులు చిన్నయ్య, రాజు.. ఇద్దరి భార్యలు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితులు నాగేశ్వరరావు, బేబీ, సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. గొల్లపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కాలువలో నుంచి వివాహిత మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

కడియం నర్సరీల్లో ఘోరం

- వివాహితపై సామూహిక అత్యాచారం, హత్య
- చనిపోయినా వదలని పైశాచికం?
- గుర్తుపట్టకుండా గుండుకొట్టేశారు
- మృతదేహాన్ని గోదావరి కాలువలో పడేశారు
- 3 రోజుల తర్వాత తేలిన మృతదేహం
- 15 రోజుల తర్వాత నలుగురు యువకుల అరెస్ట్
- గంజాయి మత్తులో చేసి ఉంటారని అనుమానాలు!

రాజమహేంద్రవరం/కడియం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా పేరున్న కడియం పూల నర్సరీల్లో ఘోరం జరిగింది. రోజూ మాదిరిగా నర్సరీ పనికి వెళ్లి వస్తున్న ఓ వివాహితపై నలుగురు యువకులు మరో నర్సరీలోకి లాక్కెళ్లి అత్యాచారం చేయడంతో పాటు చంపేసి, గోదావరి కాలువలో పడేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని కడియం మండలం కడియపులంకలోని బుర్రిలంకలో గత నెల 15వ తేదీన ఈ ఘోరం జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ అమానుష ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ఇలా ఉంది. ఒడిసా ప్రాంతానికి చెందిన దంపతులు.. తమ ఇద్దరు పిల్లలను తీసుకుని పొట్టచేత పట్టుకుని నర్సరీలలో పనికి వచ్చారు. బుర్రిలంకలో హైవేను ఆనుకుని ఉన్న ఓ నర్సరీలో నాలుగేళ్ల నుంచి వివాహిత (43) పని చేస్తోంది. గత నెల 15న సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వస్తుండగా, మరో నర్సరీలో పనిచేసే నలుగురు యువకులు ఆమెను బలవంతంగా నర్సరీ లోపలికి ఈడ్చుకుపోయి సామూహికంగా అత్యాచారానికి పాల్పడ్డారు. తరువాత పక్కనే ఉన్న గోదావరి కాలువలో పడేశారు. రాత్రయినా ఆమె ఇంటికి రాకపోవడంతో భర్త.. నర్సరీ యజమానికి ఫోన్ చేశాడు. ఆమె 5.30 గంటలకే వెళ్లిపోయిందని యజమాని చెప్పడంతో.. కంగారుపడిన భర్త కడియం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో 16న మిస్సింగ్ కేసు నమోదుచేశారు. ఈ క్రమంలో 17వ తేదీన చొప్పెల్ల లాకుల వద్ద కాలువలో ఆమె మృతదేహం తేలింది. ఆమె ఒంటిపై కేవలం లంగా మాత్రమే ఉంది. తలమీద జుట్టుకూడా లేకుండా గుండు చేసినట్టు ఉంది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసి పోస్టుమార్టం చేయించారు. అనంతరం ఆయా నర్సరీల యజమానులను, అక్కడ పనిచేసేవారందరినీ విచారించారు. పక్క నర్సరీలో పనిచేసే ఏసు అనే యువకుడు సంఘటన జరిగిన రోజు నుంచి పనికి రావడం మానేయడంతో అనుమానం వచ్చింది.. ఆరా తీస్తే నేరస్థుల గుట్టు రట్టయింది. దీంతో బుర్రిలంక గ్రామానికి చెందిన దేవర ఏసు(26), వెలుబుడి ప్రవీణ్(21), లోకిన జయప్రసాద్(19), పొట్టిలంకకు చెందిన దాసరి సురేష్(21)ను 30వ తేదీన బుర్రిలంకలో అరెస్టు చేసి వివరాలు సేకరించారు. ఆమె కాళ్లూ చేతులు పట్టుకుని, నర్సరీ మొక్కల మధ్యకు తీసుకుని వెళ్లి నలుగురూ ఆమెపై అత్యాచారం చేసి, తర్వాత హత్య చేశారని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిశోర్ తెలిపారు. ఆ తర్వాత ఆమె మృతదేహాన్ని కాలువలోకి విసిరేసినట్టు విచారణలో తేలిందన్నారు. నలుగురినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి 31న జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. సామూహిక అత్యాచారం, హత్య కింద కేసు నమోదు చేశారు. కాగా, గత ఐదేళ్లలో ఈ ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా గంజాయి వాడకం ఎక్కువైనట్టు స్థానికులు చెప్పుకొంటున్నారు. ఈ క్రమంలోనే నిందితులు ఆమెపై హత్యాచారం చేశారని అంటున్నారు. ఆమె చనిపోయిన తర్వాత కూడా పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి ఎడిటర్‌గా రాహుల్ కుమార్

ఎండీ వేమూరి రాధాకృష్ణ సమక్షంలో బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక నూతన ఎడిటర్‌గా ఎస్.రాహుల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. 16 ఏళ్లకుపైగా ఆంధ్రజ్యోతి ఎడిటర్‌గా విశిష్ట సేవలందించిన కె.శ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సమక్షంలో ఎడిటర్‌గా రాహుల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎడిటర్‌ను కె.శ్రీనివాస్ అభినందించారు. ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అసిస్టెంట్ ఎడిటర్ కృష్ణ ప్రసాద్‌తో పాటు వివిధ విభాగాధిపతులు, ఇతర ఎడిటోరియల్ సిబ్బంది రాహుల్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ నెలలో చలి తక్కువే!


- ఎక్కువ ఉష్ణోగ్రతలు కొనసాగొచ్చు
- భారత వాతావరణ శాఖ అంచనా
- పసిఫిక్‌లో లానినా ఏర్పడకపోవడమే కారణం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత శతాబ్దానికి పైగా కాలంలో ఈ ఏడాది అక్టోబరులో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 1901 నుంచి అక్టోబరు నెలలో నమోదైన గరిష్ఠ, కనిష్ఠ సగటు ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. ఈ ఏడాది 1.23 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నవంబరులో కూడా కూడా ఇదే విధంగా ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయని, రానున్న శీతాకాల ప్రారంభ సూచిక ఇచ్చే అవకాశం లేదని, చలి తక్కువగానే ఉంటుందని భారత వాతావరణ విభాగం శుక్రవారం వెల్లడించింది. వెస్టర్న్ డిస్ట్రబెన్సెస్ బలహీనపడడం, మధ్య పసిఫిక్ మహాసముద్రంలో లానినా ఏర్పడకపోవడం, బంగాళాఖాతంలో వరుసగా ఒక వాయుగుండం, ఒక తీవ్ర తుఫాన్ ఏర్పడడంతో సముద్రం మీదుగా భూమిపైకి రావాల్సిన గాలులు నిలిచిపోయాయి. వీటన్నింటి ప్రభావంతో అక్టోబరులో అనేక ప్రాంతాల్లో వేసవి మాదిరి వాతావరణం నెలకొందని తెలిపింది. రానున్న రెండు వారాల పాటు వాయవ్య మైదాన ప్రాంతాల్లో 2-5 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని, ఆ తర్వాత క్రమంగా తగ్గుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు. దీని వలన నవంబరును శీతాకాలం నెలగా పరిగణించడం లేదని చెప్పారు. ప్రపంచంలోని అన్ని వాతావరణ సంస్థల అంచనాలకు భిన్నంగా పసిఫిక్‌లో ఇంకా లానినా ఏర్పడలేదు. అందువల్ల ఈ నెలలో దేశంలో చలి ప్రభావం అంతంతమాత్రంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. డిసెంబరు నెలాఖరు నాటికి లానినా ఏర్పడే అవకాశం ఉంది. దాంతో డిసెంబరు, జనవరి నెలల్లో చలి గాలుల ప్రభావం ఉంటుందని చెబుతున్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువ వర్షపాతం

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. నవంబరులో దేశంలో ప్రధానంగా ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపించే దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, దక్షిణ కర్ణాటకల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానుంది. ఏపీ విషయానికి వస్తే దక్షిణ కోస్తా, రాయలసీమలకు ఈశాన్య రుతుపవనాలు అత్యంత కీలకం. అందువల్ల ఈ నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

లోకం తీరు



ప్రముఖ ఆర్థికవేత్త బిబేక్ దేబ్‌రాయ్ కన్నుమూత



న్యూఢిల్లీ, నవంబరు 1: ప్రముఖ ఆర్థికవేత్త, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ బిబేక్ దేబ్‌రాయ్ (69) శుక్రవారం కన్నుమూశారు. మధుమేహం, హైపర్ టెన్షన్, గుండె సమస్యలతో గురువారం చికిత్స కోసం ఢిల్లీ ఎయిమ్స్‌లో ఆయన చేరారు. చికిత్స కొనసాగుతుండగానే.. పేగుల్లో సమస్య తలెత్తి పరిస్థితి విషమించి ఆయన మరణించారు. బిబేక్ మృతిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణంతో దేశం ఒక ప్రజామేధావిని కోల్పోయిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'ఆర్థికశాస్త్రం, చరిత్ర, సంస్కృతి, రాజకీయాలు, ఆధ్యాత్మికత వంటి పలు రంగాల్లో నైపుణ్యం కలిగిన శిఖర సమాన మేధావి డాక్టర్ బిబేక్ దేబ్‌రాయ్ జీ. తన రచనలు, కృషి ద్వారా భారత మేధోరంగంపై చెరిగిపోని ముద్ర వేశారు' అని గుర్తు చేసుకున్నారు. బిబేక్ దేబ్‌రాయ్ 2017 నుంచి ప్రధాని ఆర్థిక సలహా మండలికి నేతృత్వం వహిస్తున్నారు. అమృత్ కాల్ మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ఆర్థికశాఖ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి కూడా ఆయన సారథ్యం వహించారు. 2015 నుంచి 2019 వరకూ నీతిఆయోగ్‌లో సభ్యుడిగా ఉన్నారు. దేబ్‌రాయ్ కమిటీ సిఫారసుల మేరకే.. కేంద్రం రైల్వే బడ్జెట్‌ను విడిగా ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని పక్కనపెట్టి 2017-18 నుంచి సాధారణ బడ్జెట్‌లో విలీనం చేసింది. ఆర్థికశాస్త్రం, రైల్వేలు, న్యాయశాస్త్రం, తత్వశాస్త్రం తదితర రంగాలపై బిబేక్ పలు రచనలు చేశారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలతోపాటు వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం నుంచి ఇంగ్లిష్‌లోకి అనువదించారు. తాజాగా మహాభారతం అనువాదాన్ని పది సంపుటాలుగా వెలువరించారు. మరణానికి 4 రోజుల ముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు బిబేక్ దేబ్‌రాయ్ ఒక వ్యాసం రాయటం విశేషం. 2015లో బిబేక్‌కు పద్మశ్రీ పురస్కారం లభించింది.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రోహిత్ బాల్ కన్నుమూత



న్యూఢిల్లీ, నవంబరు 1: ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రోహిత్ బాల్ (63) శుక్రవారం ఇక్కడ కన్నుమూశారు. ఆయన ఏడాది కాలంగా హృద్రోగంతో బాధపడుతున్నారు. చివరిసారిగా గత నెలలో ఢిల్లీలో నిర్వహించిన లక్మే ఇండియా ఫ్యాషన్ వీక్‌లో పాల్గొన్నారు. ఆ సమయంలో ర్యాంపు వద్ద తూలి పడిపోవడంతో ఆయన ఆరోగ్యంపై అభిమానులు ఆందోళన చెందారు. సంప్రదాయాలు, ఆధునికతను మేళవించి దుస్తులకు రూపకల్పన చేయడం ద్వారా ఆయన ప్రత్యేకతను చాటుకున్నారు. కశ్మీర్‌కు చెందిన రోహిత్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కళాశాలలో డిగ్రీ చదివారు. అంతర్జాతీయ సెలబ్రెటీలైన పమేలా అండర్సన్, నవోమీ క్యాంప్‌బెల్‌తో పాటు పలువురు బాలీవుడ్ నటులకు డిజైనర్‌గా పనిచేశారు.

భారీగా పెరిగిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

న్యూఢిల్లీ, నవంబరు 1: మరోసారి వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. 19 కిలోల గ్యాస్ సిలిండర్‌పై రూ.62 పెంచుతున్నట్లు చమురు సంస్థలు తెలిపాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1802కు చేరింది. తాజాగా పెరిగిన రేట్ల ప్రకారం దేశంలోని ప్రధాన మెట్రో నగరాలైన ముంబైలో రూ.1754, చెన్నైలో రూ.1964, కలకత్తాలో రూ.1911గా ఉంది. అలాగే 5 కిలోల గ్యాస్ సిలిండర్‌పై 15రూపాయలు పెంచినట్లు చమురు సంస్థలు తెలిపాయి. ఈ పెంపు తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు.

ఐదేళ్లలో ఏడేళ్లు ఎలా పెరిగాడో?

జార్ఖండ్ సీఎం హేమంత్‌పై బీజేపీ వ్యంగ్యాస్త్రాలు

కోల్‌కతా, నవంబరు 1: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వయసు వివాదాంశం అయింది. ఐదేళ్లలో ఏడేళ్లు పెరిగాడంటూ బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. 2019 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అఫిడవిట్‌లో సోరెన్ తన వయసు 42 ఏళ్లు అని పేర్కొనగా.. ఇప్పుడు 49 ఏళ్లు అని ప్రకటించారు. దీంతో ఈ విషయంపై బీజేపీ విమర్శనాస్త్రాలు సంధించింది. బీజేపీ అధికార ప్రతినిధి ప్రతుల్ షా దేవ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "ఐదేళ్లలో ఎవరికైనా ఏడేళ్లు పెరగడం మీరెప్పుడైనా విన్నారా. ఇది జార్ఖండ్‌లో మాత్రమే సాధ్యం" అంటూ ఎద్దేవా చేశారు. దీనిపై జేఎంఎం అధికార ప్రతినిధి తనూజ్ ఖత్రి ప్రతిస్పందించారు. అఫిడవిట్‌తో సమర్పించిన డాక్యుమెంట్లు హేమంత్ సోరెన్ వయసును నిర్ధారిస్తున్నాయని, ఇపుడు ఆయన వయసు 49 అని స్పష్టం చేశారు.

బాలుడిని బలిగొన్న సెల్ఫీ మోజు

- కడప పాలకొండల జలపాతం వద్ద ఘటన

కడప(క్రైం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సెల్ఫీ మోజు ఓ బాలుడి ప్రాణాలను బలిగొంది. కడప నగర శివారులోని పాలకొండల జలపాతం వద్ద ఈ విషాదం చోటుచేసుకుంది. వివరాలివీ.. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన విజయ్, వెంకటలక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం కడపకు వచ్చి మృత్యుంజయకుంటలో స్థిరపడ్డారు. విజయ్ బేల్దారిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీరి చిన్న కొడుకు వీరవెంకట సాయిమనోజ్(14) స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. దీపావళి సందర్భంగా గురువారం ఇంట్లో ఉన్న ట్యాబ్ తీసుకుని, మరో ఇద్దరు స్నేహితులను వెంటబెట్టుకుని కడప నగర శివారులోని పాలకొండల వద్దకు వెళ్లాడు. ముగ్గురూ మధ్యాహ్నం పాలకొండల్లో వేంకటేశ్వరుని ఆలయ సమీపంలోని జలపాతం వద్ద నీటి మడుగులో ఈతకొట్టారు. ఆ మడుగులోంచి నీళ్లు కింద దాదాపు 60 అడుగుల లోయలోకి జాలువారుతుంటాయి. ఈ క్రమంలో పైన ఉన్న మనోజ్.. జలపాతం దృశ్యం పడేలా సెల్ఫీ తీసుకుంటుండగా, కాలుజారి కింద ఉన్న మరో మడుగులో పడిపోయాడు. అక్కడున్న మరికొందరు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం రాత్రి 8గంటల ప్రాంతంలో పోలీసులు, ఫైర్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దాదాపు గంటపాటు శ్రమించి మృతదేహాన్ని నీటి మడుగులోంచి బయటికి తీసి, పోస్టు మార్టానికి తరలించారు.

బోరుగడ్డ బెయిల్ పిటిషన్ కొట్టివేత

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను మెజిస్ట్రేట్ శుక్రవారం కొట్టేశారు. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏఈఎల్సీ చర్చి కోశాధికారి కర్లపూడి బాబుప్రకాష్‌ను కత్తితో బెదిరించి రూ.50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో అనిల్‌కుమార్‌కు రిమాండ్ విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఆ తర్వాత పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించారు. కాగా తనపై ఫిర్యాదు చేసిన బాబుప్రకాష్ ఎవరో తనకు తెలియదని, తాను ఎవరిని బ్లాక్ మెయిల్ చేయలేదని అనిల్ పేర్కొన్నారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ న్యాయాధికారి లత తీర్పు చెప్పారు.

ఏం భాష ఇది? ఏం దాడులు ఇవి?

ఫిర్యాదు చేస్తే మా పార్టీ మీద, నేతల మీద దాడులు చేస్తారా?



- ఈవీఎంల గురించి మేం అడిగితే.. ఏవో సమాధానాలు ఎలా ఇస్తారు?
- ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ నిప్పులు

న్యూఢిల్లీ, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తాము వ్యక్తం చేసిన సందేహాలపై ఎన్నికల సంఘం (ఈసీ) రాసిన లేఖను కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ఏదైనా అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించే కక్షిదారుల పిటిషన్లపై తీర్పులను వెలువరించే జడ్జీలు ఆ కక్షిదారులను తిడుతూ, దాడులు చేయరని.. కానీ, ఈసీ మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆక్షేపించింది. ఆధిపత్య ధోరణితో ఈసీ తమకు ఇచ్చిన ప్రతీ జవాబు.. తమ పార్టీని, తమ నాయకులను లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లుగా ఉందే తప్ప తాము వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేసేలా లేదని తెలిపింది. 'తటస్థతకు సంబంధించి మిగిలి ఉన్న అవశేషాలేమైనా మిగిలి ఉంటే.. వాటిని కూడా తొలగించుకోవాలన్నదే ఈసీ లక్ష్యమైతే ఆ దిశగా ఈసీ అద్భుతంగా పని చేస్తున్నట్లుగానే కనిపిస్తోంది' అని పేర్కొంది. ఈసీ తీరు ఇలాగే ఉంటే తాము న్యాయపోరాటం చేయటానికి వెనుకాడబోమని హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, అశోక్ గెహ్లాట్, భూపేందర్ హుడా, అజయ్ మాకెన్, అభిషేక్ మను సింఘ్వి, ఉదయ్ భాన్, ప్రతాప్ భజ్వా, పవన్ ఖేరా సంయుక్తంగా ఈసీకి లేఖ రాశారు.

మేం అడిగిందేమిటి.. మీరు చెప్పిందేమిటి?

హరియాణా ఎన్నికల్లో బీజేపీ గెలిచిన అన్ని నియోజకవర్గాల్లో ఈవీఎంల బ్యాటరీలు 99 శాతం చార్జింగ్‌తో ఉన్నాయని, తాము గెలిచిన అన్ని స్థానాల్లో ఈవీఎంల బ్యాటరీలు 60-70 శాతం చార్జింగ్‌తో ఉన్నాయని.. దీనికి కారణమేమిటని కాంగ్రెస్ ఈసీని ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని తాజా లేఖలో ప్రస్తావిస్తూ.. 'ఆ యంత్రం ఎలా పని చేస్తుంది అన్నదానిపైనే మీ సమాధానం ఉందిగానీ.. మేం లేవనెత్తిన ఒక కచ్చితమైన ఫిర్యాదుపైన మీరు స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. మా ప్రశ్నలన్నింటికీ మీ సమాధానాలు ఇదే తరహాలో ఉన్నాయి. స్పష్టమైన జవాబులివ్వటం కంటే మాపైన, మా ఫిర్యాదులపైన దాడి చేయటం మీదనే మీరు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు' అని కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు. 'మీకు మీరు క్లీన్‌చిట్ ఇచ్చుకోవటం మమ్మల్ని ఆశ్చర్యపర్చలేదు. ఎందుకంటే, అలా జరుగుతుందని మాకు తెలుసు. అయితే, మా పార్టీపై మీరు ఉపయోగించిన భాష, మాపై చేసిన ఆరోపణలు మేం మళ్లీ స్పందించాల్సిన అవసరం కల్పించింది. మా ఫిర్యాదులను, మా వాదనలను వినే బాధ్యత మీకుంది. అందుకు మీరు ఇష్టపడకపోతే.. మీ చేత ఆ పని చేయించటం కోసం మేం ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లే అవకాశాన్ని చట్టాలు కల్పిస్తున్నాయి' అని తెలిపారు. తమ మీద చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేదంటే న్యాయపోరాటం మినహా తమకు మరో మార్గం లేదన్నారు. తమకున్న స్వల్ప వనరుల ద్వారా లభించిన సమాచారాన్ని ఈసీ దృష్టికి తీసుకొచ్చామని, ఈసీ వద్ద అపారమైన వనరులుంటాయని.. వాటితో, తాము పేర్కొన్న అంశాల్లో వాస్తవం ఉందా? లేదా? అని పరిశీలించవచ్చన్నారు. అనేక సందర్భాల్లో తాము లేవనెత్తిన అంశాలు సరైనవని ఈసీ కూడా గుర్తించిందని తెలిపారు.

ఎన్నికల కమిషనర్ నోట్‌ను తొక్కిపెడతారా?

ఈసీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు ఆరోపణలు చేసే ఉద్దేశమే తమకు ఉంటే.. ఇటీవలి కాలంలో ఈసీ కీర్తికి భంగం కలిగించిన పలు అంశాలను తాము ప్రస్తావించేవారమని కాంగ్రెస్ నేతలు ఈ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మోదీ, అమిత్‌షాల ప్రసంగాలపై తాము వందకుపైగా ఫిర్యాదులు చేస్తే.. కనీసం ఒక్కదానిపై కూడా వారి మీద ఈసీ చర్య తీసుకోలేదని గుర్తు చేశారు. కానీ, తమ అధ్యక్షుడు ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీల ప్రసంగాలను మాత్రం పలుమార్లు ఈసీ ఆక్షేపించిందన్నారు. ఈ విషయంలో.. స్వయంగా ఎన్నికల సంఘానికి చెందిన ఒక మాజీ కమిషనర్ ఇచ్చిన అసమ్మతి నోట్‌ను కూడా బయటికి రాకుండా ఈసీ తొక్కిపట్టిందని వెల్లడించారు. ఎన్నికల్లో పారదర్శకతను పెంచటానికి చేసిన ప్రతి ప్రయత్నాన్ని ఈసీ అడ్డుకుందని, సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాతగానీ వీవీపాట్ల సంఖ్య పెంపునకు అంగీకరించలేదని గుర్తు చేశారు.

'బడ్జెట్' చూసి హామీలివ్వండి



(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కాగా, 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఖర్గే తోసిపుచ్చారు. పార్లమెంట్‌లో ఏకాభిప్రాయం లేకుండా ఒకేసారి ఎన్నికల నిర్వహణ అసాధ్యమని తెలిపారు. 'ప్రధాని ఏం చెప్పారో అది చేయరు. ఎందుకంటే ఈ బిల్లు పార్లమెంటుకు వచ్చినప్పుడు అందరి అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే అది సాధ్యం. కానీ అది జరిగే పని కాదు. జమిలి ఎన్నికలు అసాధ్యం' అని ఖర్గే పేర్కొన్నారు. కాగా, మోదీ మోసాలకు పాల్పడి ఎన్నికల్లో గెలుస్తున్నారని ఖర్గే ఆరోపించారు. ఈవీఎంల ప్రామాణికతను ఆయన ప్రశ్నించారు. 'మోదీ ఏ ఎన్నికల్లోనూ గెలవలేదు. అంతా మోసమే. ప్రతిసారీ పది వేల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడమో లేదా 10వేల నుంచి 20వేల మంది పేర్లు కొత్తగా చేర్చడమో చేస్తున్నారు. అయితే ఈ నిజాన్ని ఎలా నిరూపించాలనేదే ప్రశ్న' అని ఖర్గే పేర్కొన్నారు.

కాంగ్రెస్ బూటకపు హామీలతో జాగ్రత్త: మోదీ

బడ్జెట్ పరిధిలోనే గ్యారెంటీలు ప్రకటించాలంటూ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. 'బూటకపు వాగ్దానాలు చేయడం సులభమే. వాటిని అమలు చేయడం ఎంత కష్టమో, అసాధ్యమో కాంగ్రెస్ గుర్తిస్తోంది' అంటూ ధ్వజమెత్తారు. ఆచరణ సాధ్యం కాదని తెలిసినా ప్రచారంలో హామీలతో ఊదరగొట్టారని, ఇప్పుడేమో ప్రజల ముందు వారి బండారం ఘోరంగా బట్టబయలైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకల్లో అభివృద్ధి కుంటుపడిందని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ బూటకపు వాగ్దానాల సంస్కృతితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోదీ సూచించారు.

మోదీ ట్వీట్లపై ఖర్గే కన్నెర్ర

ప్రధాని మోదీ విమర్శలపై ఖర్గే కన్నెర్ర చేశారు. బీజేపీ అంటేనే మోసపూరిత హామీలిచ్చే పార్టీ అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ధరల పెరుగుదలకు అడ్డుకట్టే లేకుండా పోయిందని, మంచి రోజుల సంగతి ఏమైందని, వికసిత్ భారత్ ఎక్కడ అంటూ ఆయన మోదీకి వరుస ప్రశ్నలు సంధించారు. మోదీ ఇచ్చే గ్యారంటీ అనేది 140 కోట్ల మంది భారతీయులపై వేసిన క్రూరమైన జోక్ అని ఖర్గే మండిపడ్డారు. ఇతరులపై వేలుపెట్టి చూపే ముందు మోదీ దీన్ని గుర్తించుకోవాలని సుచించారు.

'ఉచిత బస్సు'పై పునరాలోచన

కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంశంపై పునరాలోచన చేస్తామని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. టికెట్ కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, డబ్బులు ఇస్తున్నా కండక్టర్లు తీసుకోవడం లేదని పలువురు మహిళలు తనకు మెయిల్ చేస్తున్నారని, అందుకే ఉచిత బస్సు ప్రయాణంపై మంత్రివర్గంలో చర్చించి పునరాలోచన చేస్తామని తెలిపారు. ఈ వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపాయి. కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఇందిరా గాంధీ వర్ధంతి సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య దీనిపై స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఐదు గ్యారెంటీలూ కొనసాగుతాయని, శక్తి గ్యారెంటీపై పునరాలోచన చేసే ఆలోచన ఏదీ లేదని సీఎం స్పష్టం చేశారు. డీకే వ్యాఖ్యలపై ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పథకాల అమలులో ఏమాత్రం వెనుకడుగు వేయరాదని, ఐదు గ్యారెంటీలు అమలు కావాల్సిందేనని అన్నారు. మరోవైపు, శక్తి పథకాన్ని పునఃసమీక్షించే అంశంపై తన ప్రకటనను వక్రీకరించారని డీకే శివకుమార్ అన్నారు. 'పార్టీ అధిష్ఠానం ఏం చెబితే దాన్ని పాటిస్తాం. నా ప్రకటనను వక్రీకరించారు. పథకాన్ని పునఃసమీక్షించాలని కొంతమంది సూచించారని మాత్రమే నేను చెప్పాను. పథకాలను నిలిపివేసే ప్రసక్తే లేదు. బీజేపీ దీనిపై రాజకీయం చేయాలనుకుంటోంది. అంతకంటే వారు చేసే మంచి ఏమీ లేదు' అని డీకే ఆరోపించారు.

లద్దాఖ్‌లో మార్స్ వాతావరణం

అంతరిక్ష కార్యక్రమాల కోసం ఇస్రో అనలాగ్ మిషన్.. దేశంలో ఇదే మొట్టమొదటిసారి

న్యూఢిల్లీ, నవంబరు 1: చంద్రుడు, అంగారకుడు లాంటి గ్రహాల్లోని వాతావరణాన్ని పోలిన పరిస్థితులను సృష్టించి, ఆ వాతావరణంలో వ్యోమగాములు ఎదుర్కొనే సవాళ్లను అధ్యయనం చేసేందుకు దేశంలోనే మొట్టమొదటి 'అనలాగ్ స్పేస్ మిషన్'ను ఇస్రో శుక్రవారం ప్రారంభించింది. ఇందుకోసం లద్దాఖ్‌లోని లేహ్‌లో ఎత్తైన కొండ ప్రాంతాన్ని ఎంపిక చేసింది. లద్దాఖ్‌లో ఉండే ప్రత్యేకమైన, కఠినమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో లేహ్‌ను ఈ మిషన్ కోసం ఎంచుకున్నారు. హ్యూమన్ స్పేస్‌ఫ్లైట్ సెంటర్, ఆకా స్పేస్ స్టూడియో, లద్దాఖ్ యూనివర్సిటీ, ఐఐటీ బాంబేతో కలిసి ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. దీనికి లద్దాఖ్ కొండ ప్రాంతాల అభివృద్ధి సంఘం కూడా మద్దతు తెలిపింది. లద్దాఖ్ మంచు ఎడారి. అక్కడ ఉష్ణోగ్రతలు ఎండా కాలంలో 3-35డిగ్రీలు, చలికాలంలో -20 నుంచి -35డిగ్రీలు ఉంటాయి. నాసా ప్రకారం.. అనలాగ్ మిషన్ అనేది ఒక ఫీల్డ్ టెస్టు. భూగ్రహాంతర వాతావరణ పరిస్థితుల్లో కొత్త సాంకేతికలు, రోబోటిక్ పరికరాలు, వాహనాలు, కమ్యూనికేషన్, విద్యుత్ వినియోగం ఇలా అంతరిక్ష యాత్రకు అవసరమైన అన్నింటిని పరీక్షిస్తారు. వాటిని పరిమితుల మేరకు ఎలా ఉపయోగించుకోవాలన్నది దీని ద్వారా అంచనా వేస్తారు. వ్యోమగాములకు శిక్షణ ఇస్తారు.

దేశంలో అస్థిరతకు యత్నాలు!

బాహ్య, అంతర్గత శక్తుల ఎత్తులు.. సరిహద్దులపై రాజీ ప్రసక్తే లేదు

- అంగుళం భూమి కూడా వదులుకోం: ప్రధాని
- సర్ క్రీక్ వద్ద జవాన్లతో దీపావళి వేడుకలు



భుజ్, నవంబరు 1: భారత్ నానాటికీ శక్తిమంతంగా ఎదుగుతుండడం.. ఐకమత్య భావన పెరుగుతుండడం దేశ శత్రువులకు కంటగింపుగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. అందుకే దేశంలో అస్థిరత, అరాచకం సృష్టించేందుకు బాహ్య, అంతర్గత శత్రువులు పన్నాగాలు పన్నుతున్నారని విమర్శించారు. ఖలిస్థానీ ఉగ్రవాదుల విషయంలో కెనడా-భారత్ దౌత్య సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా దీపావళి నాడు ఆయన జవాన్లతో గడిపారు. గుజరాత్‌లోని రణ్ ఆఫ్ కచ్ జిల్లాలోని సర్ క్రీక్ లైన్ వద్ద త్రివిధ దళాలు, బీఎస్ఎఫ్ సిబ్బందితో సంభాషించారు. అలాగే సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా నర్మద జిల్లాలో ఏకతా విగ్రహం వద్ద నివాళులు అర్పించి.. అక్కడకు వచ్చిన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దేశ సరిహద్దులపై రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అంగుళం భూమిని కూడా వదులుకునేది లేదన్నారు. 'సర్ క్రీక్ ప్రాంతాన్ని యుద్ధరంగంగా మలిచేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయి. మన శత్రువు ఎంతో కాలంగా దీనిపై కన్నేసింది. దౌత్యం పేరిట కబళించాలని చూసింది. కానీ నాడు గుజరాత్ సీఎంగా ఉన్న నేను ఆ కుయుక్తులపై గళమెత్తాను. మీరంతా (సైనికులు) రక్షణ కవచంలా నిలిచినందున మాకెలాంటి ఆందోళనా లేదు. ఇది మన శత్రువుకు కూడా తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. అయితే దేశం లోపల, వెలుపల కొన్ని శక్తులు, వికృత మనస్తత్వాలు కలిగినవారు.. వక్రీకరించిన ఆలోచనలతో ఉన్నవారు.. అరాచకం, అస్థిరతల సృష్టికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అర్బన్ నక్సల్స్ దేశాన్ని చీల్చాలని చూస్తున్నారని.. వారితో ఎవరెవరికి బంధం ఉందో గుర్తించాలని ప్రజలకు పిలుపిచ్చారు. ఇక కచ్ ప్రాంతంలో పర్యాటక రంగానికి అధిక అవకాశాలు ఉన్నాయన్నారు.

తూర్పు లద్దాఖ్‌లో పూర్వస్థితి

- పండుగ వేళ స్వీట్లు పంచుకున్న భారత్-చైనా బలగాలు

న్యూఢిల్లీ, నవంబరు 1: తూర్పు లద్దాఖ్‌లోని డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాల్లో భారత్-చైనా దేశాల బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తవడంతో సరిహద్దు గస్తీని పునరుద్ధరించారు. డెమ్‌చోక్‌లో శుక్రవారం నుంచి గస్తీని నిర్వహిస్తోన్నట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. డెప్సాంగ్‌లో సైతం త్వరలోనే మొదలుపెట్టనున్నట్లు చెప్పాయి. మరోవైపు నాలుగేళ్లుగా కొనసాగిన ఘర్షణలు సద్దుమణగడంతో దీపావళి పండుగ వేళ వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి పలుచోట్ల రెండు దేశాల సైనికులు గురువారం ఒకరికొకరు స్వీట్లు పంచిపెట్టుకున్నారు. 2020 జూన్ 15న గల్వాన్ లోయ ప్రాంతంలో బలగాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తీవ్రరూపం దాల్చడంతో నాలుగేళ్లుగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణకు చెందిన కల్నల్ సంతోష్‌బాబుతో సహా 20 మంది సైనికులు, పలువురు డ్రాగన్ సైనికులు మరణించారు. దాంతో రెండు దేశాల సైనికులు ఆ ప్రాంతంలో మోహరించాయి. ఇటీవల కుదిరిన ఒప్పందం మేరకు అక్టోబరు 29 నాటికి బలగాల ఉపసంహరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. దీంతో ఎల్ఏసీ వెంబడి 2020 నాటి యథాతథా స్థితి కొనసాగనుంది.

రష్యాకు సాయంపై అమెరికా కన్నెర్ర

400 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు..జాబితాలో భారత సంస్థలు

వాషింగ్టన్, నవంబరు 1: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాకు సాయం చేస్తున్న కంపెనీలు, వ్యక్తులపై అమెరికా కన్నెర్ర చేసింది. 400 సంస్థలు సహా వ్యక్తులపై ఆంక్షలు విధించింది. ఈ జాబితాలో భారత్, చైనా, టర్కీ, థాయ్‌లాండ్, మలేషియా, దుబాయ్ దేశాలకు చెందిన కంపెనీలు, వ్యక్తులు ఉన్నారు. ఈ మేరకు అమెరికా విదేశాంగ, వాణిజ్య, ఆర్థిక శాఖలు వేర్వేరుగా ఆంక్షలు విధించాయి. విదేశాంగ శాఖ 120 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించగా, ఆర్థిక శాఖ 270 సంస్థలు, వ్యక్తులపై, వాణిజ్య శాఖ 40 మంది వ్యక్తులు, సంస్థలపై విడివిడిగా ఆంక్షలు విధించాయి. ఆయా వ్యక్తులు, కంపెనీల నుంచి రష్యా 'అక్రమ యుద్ధానికి' అందుతున్న సాంకేతికత, పరికరాలు, ఇతర సహాయక చర్యలకు బ్రేకులు వేయడమే ఈ ఆంక్షల ప్రధాన ఉద్దేశమని అమెరికా విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. "రష్యా సైన్యానికి ఏ రూపంలో సాయం అందినా దానిని నిర్వీర్యం చేయాలన్నది అమెరికా లక్ష్యం" అని అమెరికా స్పష్టం చేసింది.

హిందూ అమెరికన్లకు రక్షణ కల్పిస్తాం: ట్రంప్


వాషింగ్టన్, నవంబరు 1: బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై ఇటీవల జరిగిన అనాగరిక దాడులను అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన ట్వీట్‌లో అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులను అధ్యక్షుడు బైడెన్, ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే.. రాడికల్ లెఫ్ట్ మత వ్యతిరేక ఎజెండా నుంచి హిందూ అమెరికన్లకు రక్షణ కల్పించడంతో పాటు వారి స్వేచ్ఛ కోసం పోరాడతామని చెప్పారు. భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తామన్నారు.

బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ గురువు చిన్మయపై దేశద్రోహం

ఢాకా, నవంబరు 1: ప్రముఖ హిందూ సాధువు, ఇస్కాన్ గురువు చిన్మయ కృష్ణపై బంగ్లాదేశ్‌లోని మధ్యంతర ప్రభుత్వం దేశద్రోహం కేసు నమోదు చేసింది. ఆయనతో పాటు మొత్తం 19 మంది మైనార్టీ నేతలపై ఈ కేసులు నమోదు చేశారు. దీంతో బంగ్లాదేశ్‌లోని మైనార్టీలు ఆందోళనలు తీవ్రం చేశారు. రాజధాని ఢాకాతో పాటు అనేక చోట్ల మైనార్టీలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మహ్మద్ యూనిస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. షేక్ హసీనా ప్రధాని పదవి నుంచి దిగిపోయాక బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై 2వేల సార్లు దాడులు జరిగాయని ఆరోపించారు.



ఈదుపురం గ్రామంలో మాట్లాడుతున్న చంద్రబాబు, హాజరైన జనం



మహిళలకు మహర్దశే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజావేదిక.. దీపం-2 కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. పండగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం ఆయన ఈదుపురం గ్రామంలో దీపం పథకం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా ఉచిత గ్యాస్ సిలిండరును అందించారు. గ్యాస్ వెలిగించి టీ పెట్టి ఇంటి కుటుంబసభ్యులతోపాటు సరదాగా ఆస్వాదించారు. గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందుకున్న లబ్ధిదారులను వారి ఇళ్లలో కలుసుకున్నారు. అనంతరం బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. 'మొన్నటి ఎన్నికలలో నరకాసుర వధ జరిగింది. చెడుపై మంచి గెలిచింది. ఏకంగా 93 శాతం స్ట్రయిక్ రేటు. టీడీపీ ఆవిర్భావం నుంచి అన్ని సీట్లు గెలవలేదు' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

నరకాసురుడిపై రాజీలేని పోరు చేశా..

"నా మీటింగ్‌లో ఆర్భాటాలు ఉండవు. బలవంతంగా జనాలను తీసుకురాబోం. చెట్లను తొలగించబోం. కొత్తగా మొక్కలను నాటుతాం. ఏ రాజకీయ నాయకుడైనా ప్రజాసేవకుడిగా ఉండాలి. కానీ, గడిచిన ఐదేళ్ల సంగతి వేరు. అప్పట్లో సమావేశాలకు జనాలను బలవంతంగా తీసుకువచ్చేవారు. జనాలు పారిపోకుండా కందకాలు తవ్వేవారు. గుండెల్లో అభిమానం ఉండాలి. తీసుకువస్తే అభిమానం రాదు. ఏం తమ్ముళ్లూ...దీపావళి బాగా చేసారా..? జ్ఞాపకం ఉందా దీపావళి ఎందుకు చేస్తున్నాం..? నరకాసురుడ్ని వధించినప్పుడు దీపావళి చేసుకుంటున్నాం. మొన్నటి ఎన్నికల్లో నరకాసురుడ్ని వధ చేశాం. చెడు మీద మంచి గెలిచిన రోజు. మొన్నటి ఎన్నికల్లో ఇక్కడుండే నరకాసురుడ్ని ఓడించాం. ఏకంగా 93 శాతం స్ట్రయిక్ రేటు సాధించాం. పార్టీ చరిత్రలోనే ఇన్ని సీట్లు గెలవలేదు. 1994లో గెలిచాం కానీ.. ఇన్ని సీట్లు లభించలేదు"

ఆడబిడ్డకు సమాజంలో గౌరవం ఉండాలి

"1997లో బాలికా శిశు సంరక్షణ పథకం పెట్టాను. ఆరోజున సైకిళ్లు ఇచ్చాను. ప్రభుత్వం నుంచి ఇచ్చేవాటిని మహిళల పేరుతోనే ఇచ్చాం. ఓ అన్నగా ఉండాలన్న ఉద్దేశంతో ఆడబిడ్డలకు పెళ్లికానుకలు అందించాం. ఆడబిడ్డలకు సమాజంలో గౌరవం ఉండాలి. అప్పుడే కుటుంబం.. గ్రామం.. రాష్ట్రం బాగుంటుంది. నేను, పవన్ కల్యాణ్ ఒకటే చెప్పాం. మేము రాగానే మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నాం.. ఇస్తున్నాం. అప్పుడప్పుడు చెల్లెమ్మలు మరిచిపోతున్నారు. ఈ గ్యాస్ వల్ల నేను గుర్తుకు వస్తాను" అని చంద్రబాబు చమత్కరించారు.

ఉచిత ఇసుక అడ్డుకుంటే నాకు ఫోన్ చేయండి

"నేను మీకు జవాబుదారీగా ఉంటేనే నా కింద పనిచేసే కలెక్టర్ మీకు భయపడతారు. నేనే పెత్తందారుగా ఉంటే.. మిగిలిన అధికారులు అలానే తయారవుతారు. రాష్ట్రంలో ఇసుక ఉచితంగా ప్రజలకు అందిస్తున్నాం. అందులోని ట్యాక్స్‌లు రద్దు చేసి.. ప్రజలకు స్వేచ్ఛ ఇచ్చాం. ఎవరైనా ఇసుక అడ్డుకుంటే నాకు ఫోన్ చేయండి. మీ ఊరు ఇసుక మీది.. స్వేచ్ఛగా వాడుకోండి. నాసిరకం మద్యం ఉండదు.. బెల్ట్ షాపులు పెడితే తాటతీస్తా. .ఫైన్ కాదు..ఏకంగా మూసేయడమే. విశాఖను ఆర్థిక రాజధాని చేస్తాం. ఓర్వకల్లులో డ్రోన్ హబ్‌ను 320 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నాం. విశాఖ రైల్వేజోన్‌కు లైన్‌క్లియర్ చేశాం. శ్రీకాకుళం జిల్లాలో భావనపాడు పోర్టును మేం ఏర్పాటుచేస్తే దాని పేరు మార్చారు. 10వేలఎకరాలతో ఇండస్ట్రీ పార్కుతీసుకువస్తాం' అని చంద్రబాబు తెలిపారు.



ఈదుపురంలోని అంబటి శాంతమ్మ ఇంటిలో టీ తయారుచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

స్టవ్ వెలిగించి.. చాయ్ కాచి...

» ఈదుపురంలో టీ పెట్టిన బాబు

ఈదుపురంలో శాంతమ్మ అనే లబ్ధిదారుకుచంద్రబాబు ఉచిత సిలెండర్‌ను అందించారు. స్టవ్ వెలిగించి.. గిన్నె పెట్టి పాలు పోసి...టీ పొడి వేసి..వేడి వేడి చాయ్ తయారుచేశారు. శాంతమ్మ కుటుంబసభ్యులతోపాటు టీ తీసుకున్నారు. శాంతమ్మ ఇంటి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. 'ఏమ్మా.. గ్యాస్ సౌకర్యం ఉండటం ఎలా ఉంది...?" అని శాంతమ్మను చంద్రబాబు ఆరా తీశారు. దీనికి శాంతమ్మ బదులిస్తూ.. "గతంలో టీడీపీ ప్రభుత్వం ఉండగా దీపం-1 పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ ఇచ్చారు. మరలా ఇప్పుడు దీపం-2 కింద ఉచిత సిలిండరు అందించారు. మీరు మా ఇంటికి ఉచిత సిలిండరు అందించడం మాకు ఆర్థికంగా ఎంతో భరోసా కలిగించింది" అని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

మహిళల కళ్లలో ఆనందం చూశా..

అమరావతి: ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు అందించే పథకాన్ని శ్రీకాకుళం జిల్లా ఈదుపురంలో ప్రారంభించడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. "ఉచిత వంటగ్యాస్ సిలిండర్ అందుకున్న మహిళల కళ్లలో ఆనందం నాకు సంతృప్తిని ఇచ్చింది. ఉచిత గ్యాస్ సిలిండర్ అందుకున్న శాంతమ్మ అనే మహిళ.. నేను గతంలో ప్రవేశపెట్టిన దీపం పథకం-1లో గ్యాస్ కనెక్షన్ అందుకున్న మహిళ. ఇది నాకు మరింత సంతోషాన్ని కలిగించింది. నేను స్వయంగా ఆమె వంటగదికి వెళ్లి గ్యాస్ వెలిగించి టీ పెట్టి వారి కుటుంబసభ్యులకు అందించాను. వంటగదిలో ఇక పొగ కష్టం, ఆర్థిక భారం ఉండకూడదని.. ఎంతో మంది మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావాలనేదే నా ఆకాంక్ష." అని చంద్రబాబు ట్వీట్ చేశారు.



ఐఎస్ జగన్నాథపురంలో దీపం-2 పథకం సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పవన్



మాది మంచి ప్రభుత్వం
మెతకది కాదు

(మొదటి పేజీ తరువాయి)

చెరిగారు. "వైసీపీ నేతలకు చింత చచ్చినా పులుపు చావలేదు. వారికి పదకొండు సీట్లు వచ్చినా విమర్శలు మానలేదు. వైసీపీది తప్పుడు విధానం. ఇప్పటికీ సోషల్ మీడియాలో వాళ్ల నోళ్లు ఆగడంలేదు' అని ఆగ్రహించారు. ఆ పార్టీ సోషల్ మీడియాలో వ్యక్తుల మీద, బంధువుల మీద, ఆడ బిడ్డల మీద ఇష్టానుసారం ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రతీది సమయంతో సహా లెక్కిస్తున్నామని, తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనంటూ హెచ్చరిక జారీ చేశారు. "మీకు (వైసీపీ నేతలను ఉద్దేశించి) యుద్ధమే కావాలి అనుకుంటే మేము సిద్ధమే.. కాని అభివృద్ధికి ఉపయోగపడే యుద్ధం కావాలి. ఆడబిడ్డల మాన ప్రాణాలకు ఆపద కలిగితే తీవ్రంగా పరిగణిస్తాం. నేరాలు పెరిగాయి.. శిక్షలు తగ్గాయి. ఇప్పుడు దీనిపైనే సీరియస్‌గా ఆలోచిస్తున్నాం. కఠిన శిక్షలకు వీలుగా తగు విధానాన్ని రూపొందించదలిచాం. డిజిటల్ ప్రైవసీ యాక్ట్ తీసుకురాబోతున్నాం. వైసీపీ సోషల్ మీడియాలో వస్తున్న ప్రతీ విషయాన్ని గుర్తిస్తున్నాం. ఏం చేయాలో కూడా త్వరలోనే తేలుస్తాం. ఇంకా తిమ్మిరి తిమ్మిరిగా ఉందా?.. చర్యలు తీసుకునేటప్పుడు వైసీపీ వారు రోడ్డెక్కితే కాళ్లు విరగ్గొట్టి మూలన కూర్చోబెడతాం" అంటూ పవన్ తీవ్ర స్వరం వినిపించారు.

ఈవీఎంలు అవే కదా..

"మీకేమో 151 సీట్లు వస్తే మంచి అంటారు. అదే 11 సీట్లొస్తే మోసం అంటారు. జరిగిందంతా ఈవీఎంల మోసమేనంటూ ప్రచారం చేస్తారు. డ్రామాలు, మెలోడ్రామాలు ఆడతారు. కేంద్రంలో బీజేపీకి 357 సీట్లు వచ్చాయి కదా. అవికూడా ఈవీఎంల తప్పేనా? కొందరు వైసీపీలో మాత్రం వీటిమీదే పాటలు కడుతున్నారు. ఏదో అన్యాయం జరిగిపోయినట్టు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులు, ఉన్నతాధికారులు కొందరు ఇంకా మెతకగా ఉన్నారు. సరిగ్గా పనిచేయడం లేదు. వైసీపీ కాలంలో 'ఊ' అంటే 'ఆ' అంటూ కదిలేవారు. ధర్మబద్ధంగా మేం చెబుతుంటే పనిచేయడంలేదు. పోలీసులకు హనీమూన్ అయిపోయింది. సరిగ్గా పనిచేయాల్సిందే"

షర్మిల భద్రతపై మాట్లాడతా

"ఆ నాయకుడి సోదరి (షర్మిల పేరు ప్రస్తావించకుండానే) అదనపు రక్షణ కోరుకుంటున్నారు. భద్రత పెంచాలని అడుగుతున్నారు. ఆమె ఒక పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు. ఆమె భద్రత విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తా. ఆమె అన్నలా కాకుండా మేము రక్షణ కల్పిస్తాం"

అస్థిరత్వాన్ని సహించం

"రాష్ట్రంలో, దేశంలో అస్థిరత్వాన్ని సహించబోం. సంఘ విద్రోహ శక్తులు గొడవలు సృష్టిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి. ఆలయాల్లో అల్లరిచిల్లర మూకలు ఆడపడుచుల పట్ల అనుచితంగా ప్రవర్తించకుండా ఎక్కడికక్కడ భద్రత కల్పించాలి."

సనాతన ధర్మానికి కట్టుబడ్డా..

"సనాతన ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాను. సనాతన ధర్మంపై రకరకాలుగా మాట్లాడుతున్నారు. అన్ని మతాలను నేను గౌరవిస్తా. హిందూ దేవాలయాలకు వెళ్లేటప్పుడు కొన్ని విలువలు పాటించాలి. సనాతన ధర్మం ప్రపంచానికి దిక్సూచిగా జగన్నాథపురంలోనే దీక్ష చేపట్టాను. హైందవ ధర్మాన్ని, హిందూ ధర్మాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సహించేదిలేదు."

సేనలో నరసింహ వారాహి గణం....

"జనసేన అనుబంధ విభాగాలను ప్రారంభించాలని తరచూ కొందరు నన్ను కోరుతున్నారు. ఈ దిశగా కొత్త కార్యాచరణ తీసుకోబోతున్నాను. పార్టీ అనుబంధ సంఘంగా సనాతన ధర్మ పరిరక్షణ విభాగాన్ని ప్రారంభిస్తున్నాను. ఈ విభాగం పేరు నరసింహ వారాహి గణం. ఏపీ, తెలంగాణల్లో ఈ విభాగాన్ని ప్రారంభిస్తున్నాం"

కారు దిగి.. కొంత దూరం నడిచి...

» వైసీపీ హయాం రోడ్ల దుస్థితిని పరిశీలించిన పవన్

కొయ్యలగూడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో అధ్వానంగా ఉన్న రోడ్లపై తట్ట మట్టి కూడా వేయలేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విమర్శించారు. శుక్రవారం ఆయన ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురం వెళ్తూ మార్గమధ్యలో కొయ్యలగూడెం మండలం రాజవరంలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆయన కారు దిగి కొద్దిదూరం నడిచి వెళ్లారు. ఆ గ్రామంలోని రోడ్లను పరిశీలించారు. ఈ రోడ్డును తక్షణమే నిర్మిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.



ఇండియాస్పోరా ప్రతినిధుల సమావేశంలో మంత్రి లోకేశ్



గూగుల్ ప్రధాన కార్యాలయం ప్రతినిధులతో మంత్రి లోకేశ్

పెట్టుబడులే లక్ష్యంగా..!

దిగ్గజ కంపెనీల అధినేతలతో మంత్రి లోకేశ్ చర్చలు

» వారం రోజులు అమెరికాలో పర్యటన

» రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలపై పారిశ్రామికవేత్తలకు ప్రజెంటేషన్లు

» మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ల, 'రియల్' పెరోట్‌తో విస్తృత చర్చలు

» విశాఖలో క్లౌడ్ డేటా సెంటర్ కోసం గూగుల్ అధినేతలతో సమావేశం

» నేటి ఉదయం స్వదేశానికి తిరుగుపయనం



సేల్స్‌ఫోర్స్ ప్రెసిడెంట్ శ్రీనితల్లాప్రగడతో లోకేశ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లలో పెట్టుబడులు, పరిశ్రమల ఊసే లేని నవ్యాంధ్రకు పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటించారు. ప్రముఖ దిగ్గజ కంపెనీల అధిపతులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో ఏయే రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలున్నాయో వివరించారు. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్ కార్లు, రియల్ ఎస్టేట్ రంగంలోని ప్రముఖులతో సంప్రదింపులు జరిపి.. అమరావతి మొదలుకొని ఉత్తరాంధ్ర, గోదావరి, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే వివిధ రంగాల్లో అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఆయన పర్యటనలో సీఎంవో సంయుక్త కార్యదర్శి కార్తికేయ మిశ్రా కూడా పాల్గొన్నారు. గత నెల 25వ తేదీన హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్లిన లోకేశ్.. మర్నాటి నుంచి వరుసగా వారం రోజులపాటు అనేక సంస్థల సీఈవోలు, అధినేతలతో సమావేశమయ్యారు. శుక్రవారం అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణతో తన పర్యటనను ముగించుకున్న ఆయన.. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 8 గంటలకు స్వదేశానికి బయల్దేరతారు. ఆదివారంకల్లా హైదరాబాద్ చేరుకుంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

ఎవరెవరిని కలిశారంటే..

రెడ్‌మండ్‌లోని మైక్రోసాఫ్ట్ కేంద్ర కార్యాలయంలో సీఈవో సత్య నాదెళ్లతో లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్‌కు సహకరించాలని.. రాజధాని అమరావతిని కృత్రిమ మేధ (ఏఐ) రాజధానిగా తీర్చిదిద్దేందుకు తోడ్పడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఐటీ హబ్‌ల ఏర్పాటు ద్వారా ఆంధ్రను ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రంగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రచిస్తున్నారని.. రాష్ట్రంలోని ఐటీ టాలెంట్‌పై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగేలా మైక్రోసాఫ్ట్ సహకరించాలని కూడా కోరారు. రాష్ట్ర సందర్శనకు రావాలని సత్య నాదెళ్లను ఆహ్వానించారు. అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌ను కూడా లోకేశ్ కలిశారు. డిజిటల్ మీడియా, క్లౌడ్ ఆధారిత సేవల్లో అగ్రగామిగా ఉన్న అడోబ్‌ను రాష్ట్రంలోనూ స్థాపించి సేవలను విస్తరించాలని ఆయన్ను కోరారు. డాక్యుమెంటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, పబ్లిక్ సర్వీస్‌లను క్రమబద్ధీకరించడం.. ప్రభుత్వ వ్యవస్థలను మరింత సమర్థంగా నిర్వహించేలా స్మార్ట్ గవర్నెన్స్, స్మార్ట్ సిటీస్, ఏఐ-డివైస్ సొల్యూషన్స్ అమలులో రాష్ట్రప్రభుత్వంతో కలిసి పనిచేయాలని ప్రతిపాదించారు. అలాగే యాపిల్ సంస్థ ఏర్పాటుకు రాష్ట్రం అనువైన ప్రాంతమని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ప్రియా సుబ్రహ్మణ్యానికి ఆయన వివరించారు. పెట్టుబడులు పెట్టేందుకు రావాలని ఆహ్వానించారు. లాస్‌వెగాస్‌లో ప్రారంభం కానున్న ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్ అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఎండీ రేచల్, పెప్సికో మాజీ సీఈవో ఇంద్రనూయి, రివేచర్ సీఈవో అశ్విన్ భరత్, సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షియాలతోనూ భేటీ అయ్యారు. టెక్నాలజీ, తయారీరంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. గూగుల్ క్లౌడ్ సీఈవో, వైస్ ప్రెసిడెంట్ థామస్ కురియన్, బికాస్ కొలేలను లోకేశ్ కలిశారు. విశాఖలో క్లౌడ్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. డేటా సేవల రంగానికి ఈ నగరం అనువైన ప్రదేశమన్నారు. ఈ-గవర్నెన్స్, డిజిటల్ విద్యలో తమ ప్రభుత్వంతో కలసి పనిచేయాలని గూగుల్‌ను కోరారు. విశాఖను స్టార్టప్, మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ఇండియా స్పోరా, యూఎస్ ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులకు కూడా విజ్ఞప్తి చేశారు. 500 ఫార్చ్యూన్ కంపెనీల అధినేతలతోనూ చర్చలు జరిపారు.

రెడ్‌బుక్ చాప్టర్-3 తెరుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో అభిమానులు హెలికాప్టర్ ద్వారా పూల జల్లు కురిపించారు.

నాన్న ఆశయం నిరంతర స్ఫూర్తి

» అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని స్థాపించిన తెలుగువారందరికీ ధన్యవాదాలు: భువనేశ్వరి

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, సంక్షేమం, పౌరసేవా దృక్పథంలో నాన్న ఎన్టీ రామారావు ఆశయం తమకు నిరంతరం స్ఫూర్తిగా నిలుస్తాయని సీఎం చంద్రబాబు భార్య, హెరిటేజ్ సంస్థల అధినేత నారా భువనేశ్వరి పేర్కొన్నారు. అట్లాంటాలో ఎన్టీ రామారావు మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా భువనేశ్వరి స్పందించారు. 'నాన్నగారి లెగసీని గౌరవిస్తూ అట్లాంటాలో విగ్రహావిష్కరణ చేయడాన్ని చూసి గర్వపడ్డాను. నాన్నగారి లెగసీని, విలువలను ఈ చారిత్రక విగ్రహావిష్కరణ ప్రపంచానికి గుర్తు చేసింది. నాన్నగారికి వందనాలు సమర్పించిన అట్లాంటాలోని తెలుగువారందరికీ నేను ధన్యవాదాలు తెలుపుతున్నా' అని భువనేశ్వరి పేర్కొన్నారు.

3 నెలల్లో ఎప్పుడైనా పింఛన్ తీసుకోవచ్చు

» 64 లక్షల మందికి 2,400 కోట్ల చెల్లింపు: చంద్రబాబు

» లబ్ధిదారు ఝాన్సీకి పింఛను అందజేత

» రూ.2 లక్షల ఆర్థిక సాయం కూడా..

శ్రీకాకుళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మొదటి నెల, రెండోనెలా తీసుకోకున్నా.. మూడో మాసంలో స్వేచ్ఛగా తీసుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మొన్ననే ఆదేశాలు ఇచ్చానని.. ఎవరైనా ఇవ్వకుంటే నిలదీయాలని లబ్ధిదారులకు పిలుపిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా ఈదుపురంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి గౌరవంగా పింఛన్ అందించాలని.. ఎవరైనా ఇంటి వద్ద కాకుండా ఆఫీసు వద్ద ఇస్తే వారి భరతం పడతానని హెచ్చరించారు. ఈ ఒక్క రోజులోనే 80 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. కాగా, ఒంటరి మహిళ బలిజేపల్లి ఝాన్సీ ఇంటికి సీఎం వెళ్లారు. స్వయంగా పింఛన్ అందజేశారు. అనంతరం ఆమెతో మాట్లాడారు. ఆరోగ్యం, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'ప్రతి నెలా 1న లక్ష్మీదేవి మా ఇంటికి వస్తోంది. ఆ డబ్బు మందుల కోసం ఉపయోగపడుతోంది. నాకు షుగర్, థైరాయిడ్ ఉన్నాయి. మీ రుణం తీర్చుకోలేం. నేను యోగిని.. పెళ్లి చేసుకోలేదు. నేను చెబుతున్నా.. మీరు కుటుంబంతో సంతోషంగా, చల్లగా ఉండాలి. మీ మనుమడు కూడా సీఎం అవ్వాలి.' అని ఝాన్సీ అన్నారు. కాగా, ఆమెకు సీఎం రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇల్లు కూడా కట్టిస్తానని హామీ ఇచ్చారు. స్వయంగా పర్యవేక్షణ చేసి ఇంటి నిర్మాణం జరిగేలా చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

విజయనగరం పర్యటన రద్దు

గుంతలు లేని రోడ్లు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు శనివారం విజయనగరం జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు రావాల్సి ఉండగా ఈ కార్యక్రమం రద్దయ్యింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సీఎం పర్యటన వాయిదా పడింది.

'జనవరి 15 నాటికి గుంతల్లేని రోడ్లు'

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రహదారులపై గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రారంభిస్తున్నట్టు ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. "రహదారుల మరమ్మతులకోసం 290 కోట్లు విపత్తు నిధి కింద ఆర్అండ్‌బీకి అందాయి. శనివారం నుంచి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో రహదారి మరమ్మతు పనులు ప్రారంభం అవుతాయి. జనవరి 15 నాటికి రాష్ట్రంలో రహదారులను గుంతల రహితమైనవిగా మారుస్తాం" అని మంత్రి తెలిపారు.





పిఠాపురంలో కూటమి అభ్యర్థి మెడలో కండువాలను చూపుతున్న జనసేన నేత కురుమళ్ల రాంబాబు, ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు

పిఠాపురంలో

'కండువాల' పంచాయితీ!

» టీడీపీ, జనసేన నేతల వాగ్వాదం

» వైసీపీ కోవర్టుల వల్లే ఈ వివాదం: వర్మ

పిఠాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతల మధ్య మరోమారు వివాదం తలెత్తింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జనసేన నేత పార్టీల కండువాల ప్రస్తావన తెచ్చారు. ఇది వివాదానికి దారితీసింది. వైసీపీ కోవర్టుల వల్లే ఈ వివాదం జరిగిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివాదం ఇదీ!

పిఠాపురం పట్టణంలో శుక్రవారం ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పరిచయ కార్యక్రమం, కూటమి పార్టీల నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకటసూర్యనారాయణరాజు, కూటమి నేతలు హాజరయ్యారు. తొలుత వర్మ మాట్లాడుతుండగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. జనసేన నేత, మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు మైకు తీసుకున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ మెడలోని కూటమి పార్టీ కండువాలు పట్టుకుని చూపిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పసుపు కండువాలు మాత్రమే వేసుకుని వచ్చారని, జనసేన పార్టీ కండువాలు ధరించలేదని ఆయన విమర్శలు గుప్పించారు. దీంతో ఒక్కసారిగా అందరూ ఆశ్చర్యపోయారు. టీడీపీ నేతలు రాంబాబు వ్యాఖ్యలపై మండిపడ్డారు. "మా కండువాల గురించి మీకు సంబంధం ఏంటి" అని నిలదీశారు. దీంతో సమావేశంలో టీడీపీ, జనసేన వర్గాల మధ్య వివాదం తలెత్తింది. రెండు వర్గాలు తోపులాటకు ప్రయత్నించాయి. కాగా, కూటమి పార్టీల మధ్య చిచ్చు పెట్టాలనే యోచనతో జనసేనలోకి ఇటీవల వచ్చిన వైసీపీ కోవర్టుల వల్లే ఈ వివాదం తలెత్తిందని మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చిన వారితోనే ఇబ్బందులు వస్తున్నాయని వ్యాఖ్యానించారు.

లైంగికంగా వేధించాడు.. మోసం చేశాడు

» మాజీ మంత్రి మేరుగపై మహిళ ఫిర్యాదు

తాడేపల్లి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. లైంగిక వేధింపులు, మోసం తదితర అభియోగాలతో శుక్రవారం విజయవాడ నగరానికి చెందిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. "మాజీ మంత్రి నాగార్జున ఆయన నిర్వహించే శాఖ పరిధిలో పలు కాంట్రాక్టులు ఇప్పిస్తానని నా వద్ద రూ.90 లక్షలు తీసుకున్నారు. ఎన్నిసార్లు తిరిగినా పనులు ఇప్పించలేదు. కాంట్రాక్టు పనులు ఇప్పించమని అడగడానికి వెళ్లిన నాపై మాజీ మంత్రి నాగార్జున నాలుగుసార్లు అత్యాచారం చేశాడు. మంత్రి పీఏ మురళీమోహన్‌రెడ్డి.. 'సార్ మీతో మాట్లాడాలి రమ్మంటున్నారు' అంటూ తాడేపల్లి మండల పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో ఓ అపార్టుమెంటుకు తీసుకెళ్లాడు. బయట తాళాలు వేసి వెళ్లిపోయేవాడు. గత ప్రభుత్వ హయాంలో అధికార బలాన్ని చూసుకుని బెదిరింపులకు పాల్పడ్డారు. ఆర్థికంగా బాధలు, ఇబ్బందులతో ఒత్తిడి తట్టుకోలేక పోలీసులకు ఫిర్యాదు చేశా' అని బాధితురాలు మీడియాకు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై కేసు నమోదు చేసినట్టు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు. కాగా, ఆ మహిళ ఎవరో తనకు తెలియదని నాగార్జున అన్నారు. 'ఆమె చేసిన ఆరోపణలపై ఎటువంటి విచారణకైనా సిద్ధం. ఇంతవరకు ఆమె ముఖం కూడా చూడలేదు. ఆమెపై గుంటూరు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేస్తా.' అని తెలిపారు.

కేవీబీ ఆదాయం రూ.1.76 లక్షల కోట్లు

చెన్నై: ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ ఆదాయం సెప్టెంబరు 30తో ముగిసిన ఆరు నెలల కాలంలో రూ.1,76,138 కోట్లుగా నమోదయింది. ఇందులో డిపాజిట్లు రూ.95,839 కోట్లు కాగా రుణాలు రూ.80,299 కోట్లున్నాయి. అదే కాలంలో బ్యాంక్ రూ.932 కోట్ల లాభం ఆర్జించింది. నికర మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 0.28 శాతం ఉన్నాయి. ఇదిలా ఉండగా బ్యాంక్ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మరో నాలుగు కొత్త శాఖలను ప్రారంభించింది. అవి బెంగళూరు, కన్యాకుమారి, చెన్నై, తిరుపూర్‌లలో ఏర్పాటయ్యాయి. దీంతో బ్యాంక్ మొత్తం బ్రాంచిల సంఖ్య 848కి చేరింది.

ప్యూరిట్ కొనుగోలు పూర్తి

ఏఓ స్మిత్

న్యూఢిల్లీ: హిందుస్థాన్ యునీలీవర్‌కు చెందిన జలశుద్ధి వ్యాపారం ప్యూరిట్ కొనుగోలును పూర్తి చేసినట్టు ప్రపంచ వాటర్ టెక్నాలజీ కంపెనీ ఏఓ స్మిత్ కార్పొరేషన్ ప్రకటించింది. "ప్యూరిట్" బ్రాండ్ కింద తాము నిర్వహిస్తున్న వాటర్ టెక్నాలజీ వ్యాపార విభాగం విక్రయం పూర్తి చేశామని హెచ్‌యూఎల్ ఒక రెగ్యులేటరీ ప్రకటనలో తెలిపింది. ఈ వ్యాపార విభాగాన్ని ఏఓ స్మిత్‌కు 7.2 కోట్ల డాలర్లకు (రూ.600 కోట్లు) విక్రయించినట్టు గత జూలైలో హెచ్‌యూఎల్ ప్రకటించింది. 2023-24 సంవత్సరంలో ఈ విభాగం టర్నోవర్ రూ.293 కోట్లుంది. హెచ్‌యూఎల్ మొత్తం టర్నోవర్‌లో దీని వాటా 1 శాతం కన్నా తక్కువే.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,560 ▼	73,850 ▼	1,06,000 ▼
ముంబై	79,560 ▼	72,870 ▼	96,670 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	118
వరంగల్	118	గుంటూరు	121
కరీంనగర్	118	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	129
కర్నూలు	118	నెల్లూరు	129
విశాఖపట్నం	107	అనంతపురం	129
గోదావరి	118		

మురిపించిన 'మూరత్'

లాభాలతో ముగిసిన సూచీలు



ముంబై : శుక్రవారం జరిగిన మూరత్ ట్రేడింగ్‌తో దేశీయ స్టాక్ మార్కెట్ మళ్లీ లాభాల బాట పట్టింది. గంట సేపు సాగిన మూరత్ ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 335.06 పాయింట్ల లాభంతో 79,724.12 వద్ద, నిఫ్టీ 99 పాయింట్ల లాభంతో 24,304.35 వద్ద స్థిరపడ్డాయి. మార్కెట్ వర్గాలు నూతన సంవత్సరంగా పరిగణించే 'సంవత్, 2081' ప్రారంభ శుభవేళ శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు మూరత్ ట్రేడింగ్ జరిగిగింది. బ్యాంకింగ్, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లు ఈ సెషన్‌లో మంచి లాభాలతో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 80,023.75 పాయింట్ల ఇంట్రా డే గరిష్ఠ స్థాయిని తాకింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లు లాభాలతో ముగియగా, నిఫ్టీలోని 50 కంపెనీల షేర్లలో 42 లాభాల బాట పట్టాయి. ప్రధాన ఆసియా మార్కెట్లు నష్టాల్లో ఉన్నా, మూరత్ ట్రేడింగ్‌లో భారత మార్కెట్ లాభాల బాట పట్టడం విశేషం.

సంవత్, 2080లో లాభాలే: అక్టోబరు నెల దేశీయ స్టాక్ మార్కెట్‌కు పెద్దగా కలిసి రాలేదు. ఎఫ్‌పీఐల ఎడతెగని అమ్మకాలతో సెన్సెక్స్ 4,910.72 పాయింట్లు (5.82 శాతం), నిఫ్టీ 1,605.5 పాయింట్లు (6.22 శాతం) నష్టపోయాయి. అయినా 2080 సంవత్ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే సెన్సెక్స్ 14,484.38 పాయింట్లు (22.31 శాతం), నిఫ్టీ 4,780 పాయింట్ల (24.6 శాతం) లాభాలతో ముగిశాయి. దీంతో బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.1234.42 లక్షల కోట్లు పెరిగి రూ.444.71 లక్షల కోట్లకు చేరింది.



జీఎస్‌టీ ఆదాయం రూ. 1.87 లక్షల కోట్లు

రెండో అత్యధిక నెలవారీ వసూళ్లివి..

ఏపీలో 12%, తెలంగాణలో 7% వృద్ధి

న్యూఢిల్లీ: అక్టోబరు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 9 శాతం పెరిగి రూ.1.87 లక్షల కోట్లకు చేరుకుంది. 2017 జూలై నెలలో జీఎస్‌టీ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి రెండో అత్యధిక నెలవారీ వసూళ్లివి. దేశీయంగా విక్రయాలు పుంజుకోవడంతోపాటు నిబంధనలకు లోబడి సక్రమంగా పన్ను చెల్లింపులు పెరగడం ఇందుకు దోహదపడింది. గత ఏడాది అక్టోబరులో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.72 లక్షల కోట్లుండగా.. ఈ ఏప్రిల్‌లో ఆదాయం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2.10 లక్షల కోట్లుగా నమోదైంది. కాగా, గతనెలలో తెలంగాణ జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 7 శాతం పెరిగి రూ.5,211 కోట్లకు, ఆంధ్రప్రదేశ్ వసూళ్లు 12 శాతం వృద్ధితో రూ.3,815 కోట్లకు చేరుకున్నాయి. ఈ అక్టోబరులో సెంట్రల్ జీఎస్‌టీ ఆదాయం రూ.33,821 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ రూ.41,864 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.99,111 కోట్లుగా నమోదయ్యాయి. సుంకం రూపంలో మరో రూ.12,550 కోట్లు వసూలయ్యాయి. గతనెలలో దేశీయంగా లావాదేవీలు 10.6 శాతం పెరిగి రూ.1.42 లక్షల కోట్లుగా నమోదు కాగా.. దిగుమతులపై పన్నుల ద్వారా సమకూరిన ఆదాయం 4 శాతం పెరుగుదలతో రూ.45,096 కోట్లుగా ఉంది. కాగా, గతనెలలో జారీ చేసిన రూ.19,306 కోట్ల రిఫండ్లు మినహాయించగా.. జీఎస్‌టీ నికరాదాయం రూ.1.68 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఏడాది అక్టోబరుతో పోలిస్తే ఇది 8 శాతం అధికం.

కార్ల అమ్మకాలు అంతంతే..



ఇన్వెంటరీ తగ్గించేందుకు సరఫరా కుదించిన కంపెనీలు

న్యూఢిల్లీ: ఈ ఏడాది పండగ సీజన్ ప్రయాణికుల వాహన కంపెనీలకు అంతగా కలిసిరాలేదు. అక్టోబరులో కార్ల టోకు విక్రయాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. డీలర్ల వద్ద వాహన నిల్వలిప్పటికే భారీగా పేరుకుపోయిన నేపథ్యంలో కంపెనీలు సరఫరా తగ్గించుకోవడం ఇందుకు కారణం.

మారుతికి ఎగుమతుల దన్ను

మారుతి సుజుకీ కంపెనీ దేశీయ విక్రయాలు 1,59,591 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత ఏడాదిలో ఇదే నెలకు అమ్మకాలు 1,68,047 యూనిట్లుగా ఉన్నాయి. అయితే, గత నెలలో కంపెనీ మొత్తం అమ్మకాలు (ఎగుమతులతో సహా) మాత్రం 4 శాతం పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 2,06,434 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతేకాదు, గతనెలలో కంపెనీ చరిత్రలో అత్యధిక రిటైల్ విక్రయాలు నమోదైనట్లు మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. తద్వారా తమ డీలర్ల నెట్‌వర్క్ వద్ద నున్న వాహన నిల్వలను 40,000 యూనిట్ల మేర తగ్గించుకోగలిగామన్నారు.

హ్యుండయ్ మోటార్స్

కంపెనీ దేశీయ విక్రయాలు అతి స్వల్పంగా పెరిగి 55,568 యూనిట్లుగా నమోదయ్యాయి. ఎస్‌యూవీ మోడళ్లకు అధిక డిమాండ్ నెలకొందని, ఫలితంగా గత నెలలో రికార్డు స్థాయిలో 37,902 ఎస్‌యూవీల అమ్మకాలు జరిపినట్లు కంపెనీ వెల్లడించింది. దేశీయ విక్రయాల్లో ఎస్‌యూవీల వాటానే 68 శాతమని హ్యుండయ్ మోటార్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ తెలిపారు.

- మహీంద్రా అండ్ మహీంద్రా వాహన విక్రయాలు మాత్రం 25 శాతం పెరిగి 54,504 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం విక్రయాలు 20 శాతం వృద్ధితో 96,648 యూనిట్లకు పెరిగాయి.
- టాటా మోటార్స్ కార్ల దేశీయ విక్రయాలు గతనెలలో 48,131 యూనిట్లకు తగ్గాయి.
- టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ విక్రయాలు అక్టోబరులో 18 శాతం పెరిగి 6,79,091కి చేరాయి. దేశీయంగా డీలర్లకు సరఫరా చేసిన వాహనాల సంఖ్య 6,57,403 కాగా ఎగుమతులు 21,688 యూనిట్లున్నాయి. ఈ కంపెనీకి చెందిన విద్యుత్ వాహనం విడా అమ్మకాలు కూడా బలంగానే ఉన్నాయి. అక్టోబరులో గరిష్ఠ నెలవారీ విక్రయాలు 8,750 యూనిట్లు నమోదయ్యాయి.

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎట్ 1,00,000 యూనిట్లు

రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు తొలిసారిగా 1,00,000 యూనిట్ల మైలురాయిని దాటాయి. గ తనెలలో ఎన్‌ఫీల్డ్ దేశీయ విక్రయాలు 26 శాతం వృద్ధితో 1,01,886 యూనిట్లుగా నమోదయ్యాయి.

అక్టోబరులో ఎన్‌సీసీకి రూ.3,496 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్ అక్టోబరు నెలలో మొత్తం రూ.3,496 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు సంపాదించింది. ఇందులో రూ.2,684 కోట్ల ఆర్డర్లు బిల్డింగ్ డివిజన్ ద్వారా, రూ.538 కోట్ల ఆర్డర్లు ఎలక్ట్రికల్ డివిజన్ ద్వారా; రూ.274 కోట్ల విలువైన ఆర్డర్లు వాటర్, ఇతర డివిజన్ల ద్వారా లభించినట్లు కంపెనీ తెలిపింది. ఈ ఆర్డర్లన్నీ వివిధ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థల నుంచి లభించాయి. ఇందులో ఒక్క ఆర్డర్ కూడా తమ అంతర్గత ఆర్డర్లు కావని ఎన్‌సీసీ లిమిటెడ్ తెలిపింది.

'కోహాన్స్' విలీనంతో కొత్త బలం

- 2029 నాటికి రూ.6,000 కోట్ల టర్నోవర్ లక్ష్యం
- ఈ నెల 28న వాటాదారుల భేటీ
- సువెన్ ఫార్మా ఎండీ ప్రసాద రాజు

cohance lifesciences | SUVEN PHARMA

న్యూఢిల్లీ: కోహాన్స్ లైఫ్ సైన్సెస్ విలీనంతో తమ వ్యాపారం మరింత పెరుగుతుందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సువెన్ ఫార్మా భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) రెండు కంపెనీలు రూ.2,392 కోట్ల టర్నోవర్ నమోదు చేశాయి. విలీనంతో 2029 మార్చి నాటికి ఇది రూ.6,000 కోట్లకు చేరుతుందని ఆశిస్తున్నట్టు సువెన్ ఫార్మా ఎండీ ప్రసాద రాజు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, కొత్త కంపెనీల కొనుగోలుకూ సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన సువెన్ ఫార్మా-కోహాన్స్ లైఫ్ సైన్సెస్ కంపెనీల విలీనానికి బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ఇప్పటికే ఆమోదం తెలిపాయి. వాటాదారుల ఆమోదమే ఇంకా మిగిలి ఉంది. ఎన్‌సీఎల్‌టీ ఆదేశాల మేరకు రెండు కంపెనీల వాటాదారులు ఇందుకోసం ఈ నెల 28న భేటీ అవుతున్నారు.

మూడు అంశాలపై దృష్టి

విలీనం తర్వాత కూడాకాంట్రాక్టు పద్ధతిలో సరికొత్త ఔషధాలు, వాటి ముడి పదార్థాల అభివృద్ధి, ఉత్పత్తిపై (సీడీఎంఓ) ప్రత్యేక దృష్టి పెట్టాలని కంపెనీ భావిస్తోంది. ముఖ్యంగా ఫార్మా సీడీఎంఓ, స్పెషాలిటీ కెమికల్స్ (సీడీఎంఓ), తుది ఔషధాల తయారీలో ఉపయోగించే ప్రధాన ముడి పదార్థాలు యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ (ఏపీఐ) విభాగాలపై దృష్టి పెడతామని ప్రసాద రాజు తెలిపారు. సరికొత్త ఔషధాల కోసం చూసే అంతర్జాతీయ ఔషధ కంపెనీలకు వ్యూహాత్మక భాగస్వామ్య సంస్థగా ఎదగడం తమ లక్ష్యమన్నారు. విశ్వసనీయమైన సీడీఎంఓ సేవలు అందించే సంస్థలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అమెరికా బయోసెక్యూర్ చట్టం కూడా ఇందుకు కలిసి వస్తుందన్నారు.

అపార అవకాశాలు

కొవిడ్ తర్వాత సరఫరాలకు అంతరాయం లేకుండా విశ్వసనీయ సీడీఎంఓ సేవలు అందించే ఫార్మా కంపెనీలకు డిమాండ్ మరింత పెరిగింది. ప్రస్తుతం అంతర్జాతీయ సీడీఎంఓ మార్కెట్‌లో మన దేశం వాటా 2.7 శాతం మాత్రమే. వచ్చే నాలుగైదు సంవత్సరాల్లో ఇది ఐదు నుంచి ఏడు శాతం వరకు చేరుకుంటుందని అంచనా. విలీనం తర్వాత ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, నూతన ఔషధాల అభివృద్ధికి దోహదం చేసే సరికొత్త రసాయనాల (మాలిక్యూల్స్) అభివృద్ధి ద్వారా సీడీఎంఓ మార్కెట్‌పై పట్టు మరింత పెంచుకోవాలని భావిస్తున్నట్టు రాజు చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.